

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 65

సోమవారం 20-11-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



31 మంది శిశువుల తరలింపు

చికిత్స కోసం అల్-షిఫా నుంచి ఈజిప్టుకు తరలింపు - 6లో



ప్రణాళికతోనే కెరీర్ బంగారం

భారీగా పెరుగుతున్న విద్యా వ్యయాలు పదేళ్లలో 100-200% అధికం - 12లో

ఎయిర్‌పోర్ట్‌లో కలకలం



గగనతలంలో డ్రోన్లు ఆదివారం మణిపూర్ రాజధాని ఇంఫాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం సృష్టించాయి. రెండు గుర్తు తెలియని వస్తువులు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రన్‌వే పరిసరాల్లో ఎగురుతూ కన్పించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. 6లో

పాక్‌కు సాయం ఆపండి



అమెరికా అందిస్తున్న భారీ ఆర్థిక సాయాన్ని మానవ హక్కుల ఉల్లంఘనకు పాకిస్తాన్ వినియోగిస్తోందని అమెరికా కాంగ్రెస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పాక్‌లో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగి రాజ్యాంగబద్ధమైన రీతిలో ప్రభుత్వం ఏర్పాటయ్యేదాకా ఆ దేశానికి ఎలాంటి ఆర్థిక సాయమూ అందించొద్దని అధ్యక్షుడు జో బైడెన్‌కు విజ్ఞప్తి చేశారు. 6లో

విమాన టికెట్ కంటే ఎక్కువా?



రైళ్లలో డైనమిక్ ప్రైసింగ్‌ను తక్షణం ఉపసంహరించాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. పండుగలు తదితర రద్దీ సందర్భంగా గత వారం దేశవ్యాప్తంగా పలు రూట్లలో రైలు టికెట్ల ధరలు విమాన టికెట్లను కూడా మించిపోతున్నాయని విమర్శించారు. 6లో

ఫ్యాక్ట్‌చెక్

పెరిగిన విద్యుత్ వినియోగం

కనపడదా!?

- ఈ ఏడాది అసాధారణ వాతావరణ పరిస్థితులే కారణం
- వ్యవసాయ, గృహ విద్యుత్ రంగంపై ఇది తీవ్ర ప్రభావం
- కిందటి ఏడాది కంటే ఈ ఏడాది 10-31 శాతం వరకు ప్రతీనెలా అదనంగా వినియోగం
- 8 నెలల్లో దాదాపు 60 శాతం తగ్గిన జల విద్యుదుత్పత్తి

3లో

నామినేషన్‌పై అడ్డగోలు లూటీ!

- ప్రజాధనాన్ని కొల్లగొట్టిన రామోజీ-యనమల బంధుగణం
- ఓ నిర్మాణ కంపెనీకి మేలు అంటూ ఈనాడు దుష్ప్రచారం
- టీడీపీ హయాంలో పట్టిసీమ పనులు చేసింది అదే సంస్థ కాదా?
- ట్రాన్స్‌ట్రాయ్‌కి నాడు అడ్డగోలుగా బాబు సంతర్పణ

10లో

రైతులను మోసం చేసింది

మీ బాబే రామోజీ

- రుణమాఫీ, వడ్డీలేని రుణాల హామీలను పట్టించుకోని బాబు
- అయినా వాత్సల్యంతో రామోజీ ఏనాడు వార్తలు రాయలేదు
- నేటి ప్రభుత్వం క్రమం తప్పకుండా రైతుల ఖాతాలకు సున్నా వడ్డీ రాయితీ జమ
- అబద్ధాలు పోగేసి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న రామోజీ

11లో

'దారి'తప్పిన ఈనాడు రాతలు

- టీడీపీ హయాంలో రోడ్ల నిర్మాణంపై అంతులేని నిర్లక్ష్యం
- కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా రోడ్ల నిర్మాణం
- బాబు జమానాలో రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రోడ్ల నిర్మాణానికి రూ.4,325 కోట్లు
- సీఎం వైఎస్ జగన్ పాలనలో రూ.7,340 కోట్లు ఖర్చు

2లో

పొంగిన సిరులు

జగనన్న పాల వెల్లువతో పాడి రైతుల్లో వెల్లివిరిసిన దరహాసం

రాష్ట్రంలో ప్రైవేట్ డెయిరీలు సేకరించేది రోజుకు 6 లక్షల లీటర్ల పాలు

- మూడేళ్లు కూడా నిండని అమూల్ నిత్యం ఇప్పటికే 2.85 లక్షల లీటర్ల సేకరణ
- 3 జిల్లాలతో మొదలైన క్షీరాభిషేకం నేడు 19 జిల్లాలకు విస్తరణ
- లీటర్‌కు అదనంగా రూ.4 లబ్ధి చేకూర్చాలన్నది ప్రభుత్వ సంకల్పం
- ఇప్పుడు ఏకంగా రూ.10-20 వరకు అదనంగా ప్రయోజనం పొందుతున్న పాడి రైతులు
- 33 నెలల్లో 7 దఫాలు పాల సేకరణ ధరలు పెంచిన అమూల్
- ప్రైవేట్ డెయిరీలు అనివార్యంగా పెంచాల్సి రావడంతో పాడి రైతులకు అదనంగా రూ.2,604.06 కోట్ల లాభం
- బాబు నిర్వాకాలతో మూతపడ్డ రెండు డెయిరీల పునరుద్ధరణ



సాక్షి, అమరావతి: నిండా మూడేళ్లు కూడా నిండని అమూల్ సంస్థ రాష్ట్రంలో ఇప్పుడు రోజుకు 2.85 లక్షల లీటర్ల పాలను సేకరిస్తూ పాడి రైతన్నల ఇళ్లలో సిరులను పొంగిస్తోంది. మూడు జిల్లాలతో మొదలైన అమూల్ ప్రస్థానం ఇప్పటికే 19 జిల్లాలకు విస్తరించి గ్రామగ్రామాన క్షీరాభిషేకం చేస్తోంది. మూతపడ్డ డెయిరీల పునరుద్ధరణ, పాడి రైతులకు గిట్టుబాటు ధర లక్ష్యంతో సహకార రంగంలో దేశంలో నెంబర్ 1 స్థానంలో ఉన్న అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. జగనన్న పాల వెల్లువ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పాడి రైతులకు రక్షణ కల్పిస్తూ పాల సేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం 2023 తీసుకొచ్చింది. అమూల్ వచ్చిన తర్వాత ఏడు సార్లు పాల సేకరణ ధరలను పెంచడంతో

మిగతా 10వ పేజీలో ▶



గుండె 'పదకొండు' ముక్కలు!

ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ పరాజయం

ఆరోసారి విశ్వవిజేతగా ఆస్ట్రేలియా

- 6 వికెట్ల తేడాతో ఓడిన టీమిండియా
- రోహిత్ బృందం బ్యాటింగ్ వైఫల్యం
- అద్భుత సెంచరీతో ఆసీస్‌ను గెలిపించిన హెడ్
- భారత్‌ను కట్టడి చేసిన ఆస్ట్రేలియా బౌలర్లు

- వివరాలు 13,14లో

పశు సంవర్ధక శాఖలో పోస్టుల భర్తీకి

నేడు నోటిఫికేషన్

1,896 వీఏహెచ్‌ఏ పోస్టులకు 11వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

డిసెంబర్ 31వ తేదీన కంప్యూటర్ ఆధారిత పరీక్ష

సాక్షి, అమరావతి: నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సచివాలయాలకు అనుబంధంగా ఉన్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 1,896 గ్రామ పశుసంవర్ధక సహాయకులు (వీఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీకి పశుసంవర్ధక శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేస్తోంది. ఈ నెల 20వ తేదీ నుంచి డిసెంబర్ 11వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులకు డిసెంబర్ 27న హాల్‌టికెట్లు జారీ చేస్తారు. డిసెంబర్ 31వ తేదీన కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ఎంపికైన వారికి జనవరిలో నియామక పత్రాలు అందిస్తారు.

వేతనం రూ.22,460

ఎంపికైన వారికి రెండేళ్లపాటు ప్రొబేషన్ సమయంలో రూ.15 వేల చొప్పున కన్సాలిడేషన్ పే ఇస్తారు. ఆ తర్వాత రూ.22,460 చొప్పున ఇస్తారు. అభ్యర్థులు 18-42 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి, విద్యార్హతలు, ఇతర వివరాలు ahd.aptonline.in, https:// apaha recruitment. aptonline.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు. దరఖాస్తులు కూడా ఇదే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నిర్దేశిత రుసుములను డిసెంబర్ 10వ తేదీలోగా



మిగతా 3వ పేజీలో ▶



విశ్వ సుందరి షెన్నిస్ పలాసియోస్

నికరాగ్వా సుందరికి తొలిసారిగా మిస్ యూనివర్స్ కిరీటం

- ఫస్ట్ రన్నరప్‌గా థాయ్‌లాండ్ భామ ఆంటోనియా పోర్సిల్డ్
- సెకండ్ రన్నరప్‌గా ఆస్ట్రేలియా యువతి మొరాయా విల్సన్
- టాప్-20 జాబితాలో మిస్ ఇండియా శ్వేత శారదా

- వివరాలు 6లో

కొవ్వూరు మండలం దొమ్మేరులో మాట్లాడుతున్న మహేంద్ర కుటుంబ సభ్యులు



మహేంద్ర మృతిని రాజకీయం చేయొద్దు

- ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంది
- సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం
- వీడియో విడుదల చేసిన మహేంద్ర కుటుంబ సభ్యులు

- వివరాలు 3లో

మన్యం గజగజ

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు మన్యంలో మంచు తెరలు కమ్ముకునే ఉంటున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. అరకులోయ కేంద్ర కాఫీ బోర్డు, మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు, చింతపల్లి వ్యవసాయ పరిశోధనస్థానంలో ఆదివారం 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇదండీ సంగతి



సీడ్ పెంచండీ! ప్రచారంలో ఆయన మీకంటే ముందున్నాడు

డైకిన్ ఏసీలు.. ఇక మేడిన్ ఆంధ్రా

23 నుంచి వాణిజ్య ఉత్పత్తుల ప్రారంభం

రూ.1,000 కోట్ల పెట్టుబడితో శ్రీసిటీలో యూనిట్

- ఏటా 10 లక్షల ఏసీలు తయారు చేసే సామర్థ్యం
- 3,000 మందికి ఉపాధి కల్పించిన జపాన్ కంపెనీ డైకిన్
- గతేడాది ఏప్రిల్‌లో నిర్మాణ పనులు ప్రారంభం
- కేవలం 18 నెలల్లోనే యూనిట్ సిద్ధం.. వేగంగా అనుమతులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ప్రపంచంలోనే అతిపెద్ద ఏసీ తయారీ సంస్థ.. జపాన్‌కు చెందిన డైకిన్ ఇక నుంచి మేడిన్ ఆంధ్రా ఏసీలను విక్రయించనుంది. ఈ మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీసిటీలో జపాన్ కంపెనీ ప్రతినిధులు, రాయబారుల సమక్షంలో నవంబర్ 23న లాంఛనంగా వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు. రూ.1,000 కోట్ల పెట్టుబడితో 75.5 ఎకరాల విస్తీర్ణంలో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

'టీమ్ ఇండియా! మీరు మా హృదయాలను గెలుచుకున్నారు'

'ఎక్స్'లో ట్వీట్ చేసిన సీఎం జగన్



సాక్షి, అమరావతి: ఫైనల్ ఫలితం నిరాశపరిచినా.. ఈ విడత వన్డే ప్రపంచ కప్‌లో భారత్ క్రీడాకారులు అన్ని [illegible] కనబరిచిన ఆట తీరు [illegible] మొత్తంగా వివిధ సందర్భాల్లో జట్టు సభ్యులు కనబరిచిన [illegible] తో స్ఫూర్తినిచ్చాయి. టీమ్ ఇండియా! మీరు [illegible]' అం[illegible]

డిఫెన్స్ కౌన్సెల్స్ నైపుణ్యం పెంపొందించుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చక్రవర్తి



మాట్లాడుతున్న హై కోర్టు జడ్జ్ చక్రవర్తి

[illegible] తెలియజేశారు. క్రిమినల్ చట్టాలు, ఇతర అం[illegible] మెళకువలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు [illegible] రాజు, వెంక[illegible]

రెవెన్యూలో పదోన్నతుల పండుగ

- [illegible]
- ఏపీ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ [illegible] బొప్పరాజు



[illegible] ఏపీ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. [illegible]

పట్టణ ప్రగతి యూనిట్ల ఏర్పాటుపై శిక్షణ

[illegible]

భూ హక్కులకు భరోసా

- ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో పారదర్శకంగా రికార్డుల వ్యవస్థ
- అక్రమ రిజిస్ట్రేషన్లు, రికార్డుల ట్యాంపరింగ్‌కు తెర
- అభ్యంతరాలపై అప్పీల్‌కి రెండేళ్లు అవకాశం
- ఆ తర్వాత కూడా ఎప్పుడైనా హైకోర్టుకి వెళ్లే వెసులుబాటు
- సివిల్, రెవెన్యూ కోర్టులపై తగ్గనున్న కేసుల భారం



సాక్షి, అమరావతి: దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా భూ యాజమాన్య హక్కులకు పూర్తి భరోసా లభించనుంది. భూ యజమానులకే కాకుండా కొనుగోలుదారులకు సైతం భూమి హక్కులపై భద్రత ఏర్పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. భూములకు సంబంధించిన సమస్యలు, మోసాలు పెరిగిపోయిన నేపథ్యంలో వాటికి ఆస్కారం లేకుండా చేయడమే లక్ష్యంగా తెచ్చిన ఈ చట్టం భూముల వ్యవస్థ స్వరూపాన్ని మారుస్తుందని విశ్లేషిస్తున్నారు. బ్రిటీష్ కాలంలో తయారైన భూ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, ఆధునికీకరించకపోవడంతో పలు సమస్యలు తలెత్తాయి. రికార్డుల తారుమారు, నకిలీల కారణంగా భూ యజమానులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. సివిల్ వివాదాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడంతో పరిష్కరించడం కష్టసాధ్యంగా మారింది. వీటివల్ల శాంతి భద్రతల సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. తన సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా వీటిని గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ల్యాండ్ టైట్లింగ్ బిల్లును తేవడంతోపాటు భూముల రీ సర్వేను ప్రారంభించారు. ప్రస్తుతం భూముల రీ సర్వే విజయవంతంగా కొనసాగుతుండగా ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి ఇటీవలే కేంద్రం ఆమోదం తెలపడంతో వెంటనే అమల్లోకి తెచ్చారు.

హైకోర్టులో ఎప్పుడైనా అప్పీల్‌కు అవకాశం

ఈ చట్టం వల్ల భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదు. రీ సర్వే ద్వారా భూముల డిజిటల్ రికార్డులను ఇప్పటికే పక్కాగా తయారు చేస్తున్న విషయం తెలిసిందే. స్థిరాస్తుల శాశ్వత రిజిష్టర్ రూపకల్పనతో ఆ ఆస్తిని యజమాని మినహా మరెవరూ విక్రయించేందుకు అవకాశం ఉండదు. దాని ప్రకారమే రిజిస్ట్రేషన్లు, ఆటో మ్యుటేషన్ జరగడంతో వివాదాలకు ఆస్కారం ఉండదు. ఇప్పటికే రాష్ట్రంలో ఆటో మ్యుటేషన్ అమల్లోకి వచ్చింది. హక్కుల రిజిస్టర్‌లో నమోదైన పేర్లపై ఎవరికైనా అభ్యంతరాలుంటే రెండేళ్లలోపు కొత్తగా ఏర్పడే జిల్లా, రాష్ట్ర స్థాయి ట్రిబ్యునళ్లలో అప్పీల్‌కు అవకాశం ఉంటుంది. అభ్యంతరాలు లేకపోతే రెండేళ్ల తర్వాత ఆ భూములకు శాశ్వత హక్కుదారులుగా గుర్తించి శాశ్వత రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. రెండేళ్ల తర్వాత ట్రిబ్యునళ్లలో అవకాశం లేకపోయినా హైకోర్టులో మాత్రం ఎప్పుడైనా అప్పీల్ చేసుకోవచ్చు. హైకోర్టులో సివిల్ వివాదాలకు సంబంధించి ప్రత్యేకంగా ఒక బెంచ్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనివల్ల వివాదాలు త్వరితగతిన పరిష్కారం కానున్నాయి.

కింది కోర్టులపై తగ్గనున్న భారం

కొత్త చట్టం ద్వారా ఇప్పటి మాదిరిగా కింది స్థాయి సివిల్, రెవెన్యూ కోర్టులకు భూ వివాదాలను పరిష్కరించే అధికారం ఉండదు. ఆయా కోర్టుల్లో వేలాది సివిల్ కేసులు పెండింగ్‌లో ఉండడం విపరీతమైన భారం పడుతున్న విషయం తెలిసిందే. కింది స్థాయి సివిల్ కోర్టుల్లో భూ వివాదాల పరిష్కారానికి ఏళ్ల తరబడి సమయం పడుతోంది. సంవత్సరాలు గడిచినా కొన్ని కేసులు పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఎక్కడైనా ఒక భూమికి సంబంధించిన వివాదం తలెత్తితే ఆర్డీవో, జేసీ కోర్టుల్లో వెంటనే పరిష్కారం కావడంలేదు. ఆ వివాదం సివిల్ కోర్టుకు వెళితే తేలేందుకు ఎన్ని ఏళ్లు పడుతుందో తెలియని పరిస్థితి. రెండు మూడు తరాలు గడిచినా ఇవి తేలకపోవడంతో న్యాయ స్థానాలపై కేసుల భారం పెరుగుతోంది.

చకచకా కరెంటు.. కుళాయి

వైఎస్సార్-జగనన్న కాలనీల్లో ముమ్మరంగా సదుపాయాల కల్పన

- నిర్మాణం పూర్తయిన 5.02లక్షల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు
- ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు
- తాత్కాలికంగా డ్రెయినేజీ కోసం 1.15లక్షల ఇంకుడు గుంతలు



సాక్షి, అమరావతి: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద నిర్మిస్తున్న పేదల ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చకచకా విద్యుత్, కుళాయి కనెక్షన్లను ఇస్తోంది. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు పక్కా గృహయోగం కల్పించేందుకు 30.75లక్షల మంది మహిళల పేరిట విలువైన ఇంటి స్థలాలను ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా 21.75 లక్షల (19.13 లక్షల సాధారణ, 2.62 లక్షల టిడ్కో) ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. గత నెల 12వ తేదీ నాటికి 7.42 లక్షల (5.85 లక్షల సాధారణ, 1.57 లక్షల టిడ్కో) ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసింది. ఇక రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇళ్లు నిర్మిస్తున్న 17వేల కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఏకంగా రూ.32 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది.

6,655 కాలనీల్లో విద్యుత్ పనులు పూర్తి

పేదల ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్న 9,414 వైఎస్సార్-జగనన్న కాలనీల్లో విద్యుత్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 6,655 కాలనీల్లో విద్యుత్ స్తంభాలు నాటడం, వైర్లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పూర్తయింది. ఇక నిర్మాణం పూర్తయినవాటిలో 5,02,654 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. మిగిలిన ఇళ్లకు కనెక్షన్లు ఇస్తున్నారు. అదే విధంగా నిర్మాణం పూర్తయిన ఇళ్లన్నింటికీ తాగునీటి సదుపాయం కల్పించారు.

1.15 లక్షల ఇళ్లకు ఇంకుడు గుంతలు

కాలనీల్లో శాశ్వత మౌలిక సదుపాయాలైన డ్రెయిన్లు, రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించాలంటే ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తికావాల్సి ఉంది. అలా కాకుండా ముందుగానే సదుపాయాలు కల్పిస్తే ఇళ్ల నిర్మాణ సమయంలో భారీ వాహనాల రాకపోకలు, ఇతర సందర్భాల్లో డ్రెయిన్లు, కాలువలు ధ్వంసమవుతాయి. అందువల్ల ప్రస్తుతం నిర్మాణం పూర్తయిన ఇళ్లకు తాత్కాలిక డ్రెయినేజీ అవసరాల కోసం ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 1,15,973 ఇళ్లకు ఇంకుడు గుంతలను నిర్మించారు. అదేవిధంగా వైఎస్సార్, జగనన్న కాలనీలకు స్వాగత ఆర్చ్‌లను ప్రభుత్వం నిర్మిస్తోంది. 2,394 కాలనీలకు ఆర్చ్ నిర్మాణ పనులకు అనుమతులు ఇచ్చింది. ప్రస్తుతం 510 చోట్ల పనులను ప్రారంభించగా, 28 చోట్ల ఆర్చ్‌ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన చోట్ల వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరోవైపు నిర్మించిన ఇళ్లు అన్నింటికీ విద్యుత్, నీటి ఇంకుడు గుంతల ఏర్పాటు చేశారా.. లేదా.. అని ఆడిట్ నిర్వహించాలని ఇటీవల గృహ నిర్మాణ శాఖ అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

డైకిన్.. ఏసీలు.. ఇక మేడిన్ ఆంధ్రా

▶ మొదటి పేజీ తరువాయి

డైకిన్ ఈ యూనిట్‌ను స్థాపించింది. గతేడాది ఏప్రిల్‌లో నిర్మాణ పనులు ప్రారంభించిన డైకిన్ రికార్డు స్థాయిలో కేవలం 18 నెలల్లోనే యూనిట్‌ను సిద్ధం చేసింది. తొలి దశలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌కు ఏటా 10 లక్షల ఏసీలను తయారు చేసే సామర్థ్యం ఉంది. ఈ యూనిట్ ద్వారా సుమారు 3,000 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించింది. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన యూనిట్లలో 75 శాతం నియామకాలు స్థానికులకే ఉండాలన్న ప్రభుత్వ నిబంధనకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)తో డైకిన్ ఒప్పందం కుదుర్చుకుంది. 2020–21లో డిప్లొమా పూర్తి చేసుకున్న విద్యార్థులకు తమ సంస్థలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించామని డైకిన్ వెల్లడించింది. ఎంపికైన ఉద్యోగులకు రూ.1.99 లక్షల వార్షిక వేతనాన్ని అందిస్తున్నట్లు తెలిపింది.

వేగంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు..

రెండో దశలో మరో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా ఈ యూనిట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా 20 లక్షల ఏసీలకు డైకిన్ చేర్చనుంది. 2017లో రాజస్థాన్‌లోని నిమ్రాణాలో రెండో యూనిట్‌ను ప్రారంభించిన డైకిన్ ఏపీలో మూడో యూనిట్‌ను ఏర్పాటు చేసింది. దక్షిణాది రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా వ్యూహాత్మకంగా శ్రీసిటీని ఎంపిక చేసుకున్నట్లు శంకుస్థాపన సమయంలో డైకిన్ ఇండియా చైర్మన్ అండ్ ఎండీ కన్వల్‌జీత్ జావా వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు వేగంగా మంజూరు చేయడంతో రికార్డు స్థాయిలో డైకిన్ ఉత్పత్తికి సిద్ధమైందని తెలిపారు.

ఏసీ తయారీ హబ్‌గా శ్రీసిటీ..

దేశీయ ఏసీ మార్కెట్‌లో బిలియన్ డాలర్ల మార్కును అందుకున్న సందర్భంగా శ్రీసిటీలో మూడో యూనిట్ అందుబాటులోకి రావడంపై శ్రీసిటీ వ్యవస్థాపక ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఏసీ తయారీ హబ్‌గా శ్రీసిటీ ఎదుగుతోందన్నారు. డైకిన్‌తో పాటు బ్లూస్టార్, లాయిడ్ (హావెల్స్), పానాసోనిక్, యాంబర్, ఈప్యాక్ వంటి అనేక సంస్థలు ఇక్కడ యూనిట్లను ఏర్పాటు చేశాయన్నారు.

రాష్ట్రంలో 50 లక్షల ఏసీల ఉత్పత్తి..

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏటా 75 లక్షల గృహవినియోగ ఏసీలు అమ్ముడవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఈ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం 50 లక్షల ఏసీలకు పైనే ఉంటుందని అంచనా. మొత్తం ఈ ఆరు యూనిట్లు, వీటికి సరఫరా చేసే ఉపకరణాల యూనిట్లను చూసుకుంటే ఒక్క ఏసీ తయారీ రంగంలోనే రాష్ట్రం రూ.3,755 కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ యూనిట్లకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్‌లో ప్రత్యేక కోర్సులను సైతం అందుబాటులోకి తెచ్చింది.

ఏపీ ఇంట.. ఈ–వంట



- ఎన్ఈసీపీ, ఈఈఎఫ్‌పీ పథకాలకు ఎంపికైన ఏపీ
- దేశవ్యాప్తంగా 20 లక్షల ఇండక్షన్ కుక్‌స్టవ్‌లు ఏర్పాటు చేయనున్న ఈఈఎస్ఎల్
- సంప్రదాయ సహజ వాయువు, బయోమాస్‌కు ప్రత్యామ్నాయం
- సాంప్రదాయ వంట పద్ధతుల కంటే 25–30% ఖర్చు ఆదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అమలవుతోన్న అనేక సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శమవుతుండటం ఓ విశేషం కాగా..దేశంలో అమలు చేసే ఏ పథకానికైనా రాష్ట్రం ఎంపిక అవుతుండటం మరో విశేషం. తాజాగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన నేషనల్ ఎఫిషియెంట్ కుకింగ్ ప్రోగ్రాం (ఎన్ఈసీపీ), ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్స్ ప్రోగ్రాం (ఈఈఎఫ్‌పీ) పథకాలకు ఏపీ ఎంపికైంది. కుకింగ్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా 20 లక్షల ఇండక్షన్ కుక్‌స్టవ్‌లను ఈఈఎస్ఎల్ సరఫరా చేయనుంది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో చురుకుగా వ్యవహరిస్తున్న యూపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఏపీలోనూ వీటిని పంపిణీ చేయనున్నట్లు ఈఈఎస్ఎల్ తెలిపింది.


ఈ-కుక్కర్‌తో ఆరోగ్యం..

'ఎన్ఈసీపీ' ద్వారా ఇచ్చే ఈ స్టవ్‌లు వంటకు ఉపయోగించే సంప్రదాయ సహజ వాయువు (ఎల్‌పీజీ), బయోమాస్ వంటి ఇంధనాలను ప్రత్యామ్నాయంగా ఉపయోగపడనున్నాయి. వంటకు వినియోగించే ఇంధనాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం, అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సిన అగత్యం తప్పుతుంది. సాంప్రదాయ వంట పద్ధతుల కంటే 25–30% ఖర్చును దీనివల్ల ఆదా చేయవచ్చు. ఈ–కుకింగ్ ద్వారా చేసిన వంటకు, గ్యాస్ ఉపయోగించి వండిన ఆహారానికి ఎలాంటి తేడా ఉండదు. పైగా వంట పొయ్యి వద్ద పొగతో అనారోగ్యానికి గురికావాల్సిన అవసరం రాదు. వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించడం వీలవుతుంది. హానికరమైన బయోమాస్ ఆధారిత వంటకు దూరంగా పరిశుభ్రమైన వంట పద్ధతులను ప్రజలకు అలవాటు చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది.

ఫ్యాన్లతో ఇళ్లలో విద్యుత్ ఆదా..

'ఈఈఎఫ్‌పీ' ద్వారా జగనన్న ఇళ్లలో విద్యుత్ ఆదా ఫ్యాన్లను పంపిణీ చేసేందుకు ఇటీవల గోవాలో జరిగిన జీ20 సదస్సులో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ సంతకాలు చేసి, ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో నిర్మిస్తోన్న ఇళ్లకు 6 లక్షల ఎల్ఈడీ బల్బులు, 3 లక్షల ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, 3 లక్షల బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్ మోటర్(బీఎల్‌డీసీ) సీలింగ్ ఫ్యాన్లు సరఫరా చేయనున్నారు. ఒక్కో ఇంటికీ 4 ఎల్ఈడీ బల్బులు, 2 ట్యూబ్ లైట్లు, 2 ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫ్యాన్‌లను రాయితీపై అందించనున్నారు. రూ.400 కోట్లతో పంపిణీ చేసే ఈ ఉపకరణాల వల్ల ప్రతి ఇంటికీ ఏడాదికి 734 యూనిట్ల ఇంధనం ఆదా అవుతుంది. తొలి దశలో 15.6 లక్షల ఇళ్లలో ఇంధన సామర్థ్య ఉపకరణాలను వినియోగించడం వల్ల ఏడాదికి 1,145 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మిగులుతుందని అంచనా. విద్యుత్ బిల్లుల ఖర్చులను తగ్గించడానికి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడనుంది.

ఏపీ ముందుకు రావడం అభినందనీయం



వంటశాలలలో ఆధునిక ఎలక్ట్రిక్ వంట పరికరాలను వినియోగించడం ద్వారా ఎల్‌పీజీ, కిరోసిన్ ఆధారిత వంటపై ఆధారపడటాన్ని తగ్గించడం మా లక్ష్యం. ఇందుకోసం మోడరన్ ఎనర్జీ కుకింగ్ సర్వీసెస్ (ఎంఈసీఎల్)తో కలిసి ఏపీతో పాటు పలు రాష్ట్రాల్లో ఈ–స్టవ్‌లను పంపిణీ చేయనున్నాం. పాండిచ్చేరి, కేరళ, లడ్డాక్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే పైలట్ ప్రాజెక్టులు ప్రారంభించాం. జగనన్న ఇళ్లలో బీఎల్‌డీసీ ఫ్యాన్లు అందించేందుకు ఏపీ ముందుకు రావడం అభినందనీయం.

– విశాల్ కపూర్, సీఈవో, ఈఈఎస్ఎల్

'దారి'తప్పిన ఈనాడు రాతలు

టీడీపీ హయాంలో రోడ్ల నిర్మాణంపై అంతులేని నిర్లక్ష్యం

- కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా రోడ్ల నిర్మాణం
- బాబు జమానాలో రోడ్ల నిర్మాణానికి రూ.4,325 కోట్లు..
- సీఎం జగన్ పాలనలో రూ.7,340 కోట్లు ఖర్చు
- అప్పట్లో రోడ్ల మరమ్మతులకు ఐదేళ్లలో కేవలం రూ.2,953 కోట్లు..
- ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లలో రూ.4,148 కోట్లు ఖర్చు
- జాతీయ రహదారులకు నిధులు రాబట్టడంలోనూ బాబు విఫలం
- అదే సీఎం జగన్ హయాంలో రూ.25,304 కోట్లతో రోడ్ల నిర్మాణం
- చంద్రబాబు వైఫల్యాలను కప్పిపుచ్చుతూ అవాస్తవాలు, అభూతకల్పనలతో రామోజీ కట్టుకథలు



నాడు..

చంద్రబాబు హయాంలో రోడ్ల నిర్వహణ, నిర్మాణంలో అంతులేని నిర్లక్ష్యం.. అప్పులుచేసి మొదలెట్టిన పనులు అసంపూర్తిగా వదిలేసి కోట్లాది రూపాయల నిధులు మళ్లించిన వైనం.. ఆ ఐదేళ్లలో రోడ్ల నిర్మాణానికి రూ.2,953.81 కోట్లే ఖర్చు.. జాతీయ రహదారులకు నిధులు రాబట్టడంలోనూ అంతంతమాత్రమే.. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ రంగాన్ని గాలికొదిలేసింది.

నేడు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో కంటే అత్యధికంగా నిధులు ఖర్చుచేస్తున్న సీఎం వైఎస్ జగన్ సర్కారు.. చంద్రబాబు వదిలేసిన పనులను పూర్తిచేస్తూనే ఆ సర్కార్ మిగిల్చిన అప్పులనూ తీరుస్తోంది.. ఒక్క పోయినేడాదిలోనే రూ.2,400 కోట్లతో 7,500 కి.మీ. రోడ్లను నిర్మించింది.. మొత్తం మీద ఈ నాలుగేళ్లలో రూ.4,148.59 కోట్లు వెచ్చించింది. జాతీయ రహదారులకూ పెద్ద మొత్తంలో అంటే.. రూ.25,304 కోట్లు రాబట్టి రోడ్లపై అత్యధిక ఫోకస్ పెట్టింది.

సాక్షి, అమరావతి :

అయినా సరే.. రాష్ట్ర ప్రభుత్వంపై 'ఈనాడు' రామోజీరావు వంకర రాతలు రాస్తూనే ఉంటారు. తనకు బాగా అలవాటైన రీతిలో అభూతకల్పనలు, అవాస్తవాలు రంగరించి రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై తాజాగా కట్టుకథలు అల్లారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణను టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్న వాస్తవాన్ని దాచిపెట్టి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు తన శక్తియుక్తుల్ని ప్రదర్శించారు. కానీ, టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి అత్యధికంగా నిధులు వెచ్చిస్తోందన్నది వాస్తవం. చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పనులను పూర్తిచేస్తూనే గత ప్రభుత్వం మిగిల్చిన అప్పులను తీరుస్తోందని రవాణా శాఖ రికార్డులు వెల్లడిస్తున్న పచ్చినిజం. అయిననూ.. రామోజీ కలం కాలకూట విషం చిమ్మవలె.. ఇది ఆయన సహజ లక్షణం కూడా. రాష్ట్రంలో రహదారుల స్థితిగతులపై దారితప్పిన ఈనాడు రామోజీ రాతలపై వాస్తవాలతో కూడిన ఫ్యాక్ట్‌చెక్ ఇది..

రోడ్లపై బాబు సర్కారు అంతులేని నిర్లక్ష్యం..

నిజానికి.. టీడీపీ ప్రభుత్వం తన ఐదేళ్లలో రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఏటా విడుదల చేయాల్సిన రోడ్ల నిర్వహణ నిధులను కూడా కేటాయించలేదు. అంతేకాదు.. 2017–18లో రోడ్ల నిర్మాణం కోసం తీసుకొచ్చిన రూ.3వేల కోట్ల రుణాన్ని కూడా ఇతర అవసరాలకు చంద్రబాబు మళ్లించారు. దాంతో రోడ్ల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది.. అటకెక్కింది కూడా.

రహదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట..

కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే రూ.2,400 కోట్లతో 7,500 కి.మీ. మేర రోడ్లను నిర్మించింది. ప్రస్తుతం వర్షాకాలం ముగియడంతో రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,121.92 కోట్లతో 3,432 కి.మీ. పనులు ప్రారంభించింది. అంతేకాదు.. టీడీపీ ప్రభుత్వంతో కంటే అత్యధికంగా రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తోంది. అలాగే..

- టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్ల నిర్మాణానికి రూ.2,953.81 కోట్లు వెచ్చించింది. అంటే ఏడాదికి సగటున రూ.591 కోట్లు ఖర్చుచేసింది. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే రూ.4,148.59 కోట్లు వెచ్చించింది. అంటే ఏడాదికి సగటున రూ.951కోట్లు చొప్పున ఖర్చు చేసింది. పైగా.. ఈ ఆర్థిక సంవత్సరం.. తొలి నాలుగు నెలల్లోనే రూ.346 కోట్లు ఖర్చుపెట్టింది.
- టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల పునరుద్ధరణకు రూ.4,325 కోట్లే ఖర్చుచేస్తే.. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రోడ్ల పునరుద్ధరణ కోసం రూ.7,340 కోట్లు ఖర్చుచేసింది.
- ఇక రోడ్ల అభివృద్ధి సెస్ ద్వారా వచ్చిన రూ.3వేల కోట్లను టీడీపీ చేసిన అప్పులను తీర్చడానికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించాల్సి వచ్చింది. సెస్ ద్వారా వచ్చిన మరో రూ.2వేల కోట్లకు అదనంగా రూ.2,500 కోట్ల రుణం తీసుకుని మొత్తం రూ.4,500 కోట్లతో 7,600 కి.మీ. మేర రోడ్లను నిర్మించింది.

జాతీయ రహదారులపైనా బాబు నిర్లక్ష్యం..

మరోవైపు.. టీడీపీ ప్రభుత్వ హయాం కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా 2014–19లో రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం రూ.13,353 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. అదే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి అత్యధిక నిధులు రాబట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం నాలుగేళ్లలోనే రూ.25,304 కోట్లతో జాతీయ రహదారులను నిర్మించడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా స్పందించి, త్వరితగతిన భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది.

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి టీడీపీ, వైఎస్సార్‌సీపీ హయాంలో ఖర్చు పెట్టిన మొత్తం.. (రూ.కోట్లలో)

పని	టీడీపీ ఐదేళ్లలో..	వైఎస్సార్‌సీపీ నాలుగేళ్లలో..
రోడ్ల మరమ్మతులకు..	2,953.81	4,148.59
ఏడాదికి సగటున..	591	951
రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి..	4,325	7,340
జాతీయ రహదారుల నిర్మాణానికి..	14,353	25,304

పెరిగిన విద్యుత్‌ వినియోగం కనపడదా!?

ఈ ఏడాది అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యవసాయ, గృహ విద్యుత్‌ రంగంపై తీవ్ర ప్రభావం

- గత ఏడాది కంటే ఈ ఏడాది దాదాపు 10–31 శాతం వరకు ప్రతి నెలా అదనంగా వినియోగం
- ఎనిమిది నెలల్లో దాదాపు 60 శాతం తగ్గిన జల విద్యుదుత్పత్తి
- ఇది గుర్తించే సర్కారు ముందుచూపుతో రాబోయే ఏడు నెలలకు ఆగస్టులోనే వెయ్యి మెగావాట్ల కోసం టెండర్లు
- నిరంతర సరఫరా కోసం నిబంధనల ప్రకారం ప్రభుత్వం విద్యుత్‌ కొనుగోలు
- అయినా, ఇవేవీ పట్టని రామోజీ నిత్యం సర్కారుపై విషప్రచారం
- ఈనాడు రాతలు ఊహాజనితమని కొట్టిపారేసిన విద్యుత్‌ పంపిణీ సంస్థల సీఎండీలు



22% పెరిగిన గ్రిడ్‌ విద్యుత్‌ వినియోగం

సాక్షి, అమరావతి: విద్యుత్‌ కొనుగోలు చేసి ప్రజలకు నిరంతరం కోతలు లేకుండా సరఫరా చేయడం కూడా తప్పే అన్నట్లుగా ఉంది రామోజీ తీరు చూస్తుంటే. ఈ ఏడాది రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం.. దానివల్ల విద్యుత్‌ వినియోగం అనూహ్యంగా పెరిగిన విషయం కళ్లకు కనిపిస్తున్నా ఆయన ఇవేమీ పట్టనట్లు అడ్డగోలుగా రాసిపారేస్తూ జనం మెదళ్లను కలుషితం చేసేందుకు తెగ ఆరాటపడుతున్నారు. ఈ పెరుగుదల వ్యవసాయ, గృహ విద్యుత్‌ రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. అయినా.. 'ప్రజలపై మరో రూ.1,723 కోట్ల భారం' అంటూ ఆదివారం ఈనాడు పెట్టిన రంకెల్లో ఎప్పటిలాగే ఏమాత్రం పసలేకపోగా అదంతా పూర్తి ఊహాజనితమని ఆంధ్రప్రదేశ్‌ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు ఐ. పృథ్వీతేజ్‌, జె. పద్మజనార్దనరెడ్డి, కె. సంతోష రావు కొట్టిపడేశారు. ఈ మేరకు వారు 'సాక్షి'కి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి..

వర్షాభావంతో అదనంగా వినియోగం..

నిజానికి.. ఈ ఏడాది వాతావరణంలో ఏర్పడిన అసాధారణ పరిస్థితులవల్ల వర్షాభావం, తీవ్ర ఎండ, ఉక్కపోతతో విద్యుత్‌ వినియోగం అనూహ్యంగా పెరిగిపోయింది. ఈ పెరుగుదల వ్యవసాయ విద్యుత్‌ రంగంలోను, గృహ విద్యుత్‌ రంగంలోను స్పష్టంగా కనిపిస్తోంది. మొన్న ఏప్రిల్‌ నుంచి అక్టోబరు వరకు వినియోగం దాదాపు 10–31 శాతం వరకు ప్రతి నెలా అదనంగా నమోదవుతోంది. అలాగే, గతేడాది మార్చి నుంచి అక్టోబరు కాలానికి జల విద్యుదుత్పత్తి దాదాపు 3 వేల మిలియన్‌ యూనిట్లు ఉంటే ఈ సంవత్సరం అది కేవలం 1,260 మిలియన్‌ యూనిట్లు మాత్రమే ఉంది. ఇది దాదాపు 60 శాతం తక్కువ. సాధారణంగా ఏటా వినియోగం 7–8 శాతం వరకూ పెరగవచ్చని భావించి ముందస్తు విద్యుత్‌ సేకరణ ప్రణాళిక తయారుచేస్తారు. కానీ, డిమాండ్‌ అనుకున్న దానికంటే ఎక్కువగా పెరగడం, దీర్ఘకాలిక వనరుల నుంచి లభ్యత అనుకున్నంత రాకపోవడంవల్ల విద్యుత్‌ కొనుగోళ్లు అనివార్యమయ్యాయి.

సర్కారు ముందుచూపు..

ఇలా నెలవారీ విద్యుత్‌ డిమాండ్‌లో మునుపెన్నడూ లేనంత పెరుగుదలను గమనించి రాబోయే 7నెలల కాలానికి (సెప్టెంబర్‌ నుంచి వచ్చే సంవత్సరం మార్చి వరకు) వెయ్యి మెగావాట్ల కోసం కేంద్ర ప్రభుత్వ విద్యుత్‌ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని డీప్‌ ఈ–బిడ్డింగ్‌ పోర్టల్‌ ద్వారా ఆగస్టులోనే టెండర్లు ఆహ్వానించారు. ఈ ప్రక్రియలో రివర్స్‌ ఆక్షన్‌ కూడా పూర్తయ్యాక మనకు కావలసిన విద్యుత్‌ పరిమాణం లభించేంత వరకు అంటే బిడ్లలో పిలిచిన వెయ్యి మెగావాట్ల వరకు నిబంధనల ప్రకారం వివిధ విద్యుత్‌ ఉత్పత్తి సంస్థలకు, ట్రేడర్లకు కొనుగోలు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. నెలలో మొత్తంగా ఒకశాతం వరకు విద్యుత్‌ కొనుగోలును తగ్గించుకునే అవకాశం ఈ టెండర్లలో ఉంది. ఈ ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా నిబంధనలకు లోబడి చేపట్టారు. ఎవరైనా సరే ఈ వివరాలు పోర్టల్‌ వెబ్‌సైట్‌ ద్వారా కానీ, దరఖాస్తు ద్వారా కానీ పొందవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత, ఆదేశాల ప్రకారం.. ఇంతటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లో కూడా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని, నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ సరఫరా జరగాలనే భావనతో, స్వల్పకాలిక మార్కెట్‌లో నిబంధనలకు లోబడి విద్యుత్‌ కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత నవంబరులో కూడా రికార్డు స్థాయిలో రోజువారీ విద్యుత్‌ వినియోగం 220 మిలియన్‌ యూనిట్ల వరకు నమోదవుతోంది. కిందటి ఏడాది నవంబరులో ఇదే కాలానికి సరాసరి విద్యుత్‌ వినియోగం దాదాపు 180 మిలియన్‌ యూనిట్లుగా వుంది. అలాగే, కిందటి సంవత్సరంతో పోలిస్తే గ్రిడ్‌ విద్యుత్‌ వినియోగం పెరుగుదల దాదాపు 22 శాతం. ఈ పరిస్థితుల్లో కూడా రోజుకి దాదాపు 50 మిలియన్‌ యూనిట్లను స్వల్పకాలిక మార్కెట్‌ నుండి కొనాల్సి వస్తోంది. ఇందులో దాదాపు 20 మిలియన్‌ యూనిట్లు ఆగస్టులో చేపట్టిన టెండర్ల ప్రక్రియ ద్వారా సమకూరుతోంది. ఇలా దేశవ్యాప్తంగా నెలకొన్న విద్యుత్‌ కొరత పరిస్థితుల కారణంగా వాటిని అధిగమించడానికి తమిళనాడు, రాజస్థాన్‌ వంటి రాష్ట్రాలు కూడా ముందస్తుగా ఈ స్వల్పకాలిక ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నాయి. రోజువారీ వివిధ వనరుల నుంచి అందుబాటులో వున్న విద్యుత్‌ను గ్రిడ్‌ డిమాండ్‌కు అనుగుణంగా డిస్కంలు బేరీజు వేసుకుంటున్నాయి. గ్రిడ్‌ డిమాండ్‌ బాగా పడిపోయిన రోజుల్లో రోజువారీగా దాదాపు 50శాతం వరకు విద్యుత్‌ సేకరణ నిలుపుదల, బ్యాక్‌డౌన్‌ చేసి విద్యుత్‌ కొనుగోలు వ్యయాన్ని తగ్గించుకుంటున్నాయి. విద్యుత్‌ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్‌ కొంటే ఈ బ్యాక్‌డౌన్‌ సౌకర్యం అందుబాటులో ఉండదు.

పరిమితులు, నియంత్రణ లేవు

ఇక స్వల్పకాలిక కొనుగోళ్లకు సంబంధించి ప్రతీ యూనిట్‌కు రాష్ట్ర విద్యుత్‌ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) అనుమతి ఉంది. మండలి నిర్దేశించిన ఇంధన, విద్యుత్‌ కొనుగోలు ఖర్చు సర్దుబాటు నిబంధన నియమావళి ప్రకారం.. ఉచిత వ్యవసాయ విద్యుత్‌ వినియోగానికి ఈ అదనపు వ్యయం సర్దుబాటు ఏదైనా ఉంటే దానిని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తయ్యాక విద్యుత్‌ కొనుగోలులో ఉచిత వ్యవసాయ విద్యుత్‌ వినియోగానికి సంబంధించి జరిగిన అదనపు విద్యుత్‌ కొనుగోలు వ్యయం లెక్కించి ఆ నివేదికను ప్రభుత్వానికి పంపుతారు. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో దేశం మొత్తం విద్యుత్‌కు కటకటలాడుతుండగా రాష్ట్రంలోని విద్యుత్‌ పంపిణీ సంస్థలు మాత్రం వినియోగదారులకు ఎలాంటి వినియోగ పరిమితి, నియంత్రణలు అమలుచేయకుండా వారి డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా చేస్తున్నాయి. కానీ, రామోజీకి ఇవన్నీ తెలియనివి ఏమీకాదు. తన ఆత్మబంధువు చంద్రబాబును ఉన్నపళంగా సీఎం కుర్చీలో కూర్చోబెట్టడమే ఆయన లక్ష్యం. అందుకే రోజూ సీఎం జగన్‌, రాష్ట్ర ప్రభుత్వంపై తన విషపుత్రిక ఈనాడులో నిత్యం విషం కక్కుతున్నారు. అంతే..!

ఇవ్వకపోతే అలా.. ఇస్తే ఇలానా రామోజీ..?

ఎప్పుడైనా ఒకసారి కరెంట్‌ ఇవ్వకపోతే కోతలు ఎక్కువైయ్యాయంటూ గగ్గోలు పెడతారు. అదే నిరంతరాయంగా సరఫరా చేస్తే అధిక మొత్తం పెట్టి కొనేస్తున్నారంటూ నానా యాగీ చేస్తారు. ఇదెక్కడి నీతి రామోజీ. నిజానికి.. మార్కెట్‌లో విద్యుత్‌ రేటు ఎంత ఉంటే అంతకు కొనితీరాల్సిందే. ఏ రాష్ట్రానికైనా ఇదే పరిస్థితి. ఎక్కువ రేటు, తక్కువ రేటు అన్నది మన చేతిలో ఉండదు కదా.. అవసరమైనప్పుడు ఎవరైనా మార్కెట్‌ రేటును చెల్లించి కొనాల్సిందే.. అదే అవసరంలేనప్పుడు ఎవరూ కొనరు. టెండర్లు కూడా చాలా పారదర్శకంగా నిర్వహిస్తారు. మన ఒక్కరి కోసం రేట్లు పెంచడం లేదా తగ్గించడం అనేది ఉండదు. ఇదంతా మీకు తెలీదా!? చంద్రబాబు అధికారంలో లేడన్న ఒకే ఒక్క కారణంతో ఇంత అడ్డగోలుగా.. దారుణంగా పిచ్చి రాతలు రాసిపారేస్తారా ఏంటి రామోజీ..?

టీడీపీ యాప్‌లో ప్రజల వ్యక్తిగత సమాచారం

ఓటర్ల పరిశీలన పేరుతో వివరాలు సేకరిస్తున్న తెలుగు తమ్ముళ్లు

- ఓటీపీ నెంబర్‌ కూడా తీసుకుంటుండడంతో గొడవలు
- రాజంపేటలో ఇంటింటికీ వెళ్లి సమాచారం తీసుకుంటూ దొరికిన 'దేశం' కార్యకర్తలు
- ఆక్రోశంతో దౌర్జన్యానికి దిగిన తమ్ముళ్లు.. ఉద్రిక్తత



మర్రి రవి ఇంటి వద్ద పోలీసుల సమక్షంలో టీడీపీ నేతల వీరంగం

సాక్షి, అమరావతి/రాజంపేట: ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అడ్డదారుల్లో సేకరిస్తుండడం వివాదాస్పదంగా మారింది. ఓటర్ల వెరిఫికేషన్‌ నిర్వహిస్తున్నామంటూ ఇళ్లకు వెళ్లి యాప్‌లో వారి వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తున్నారు. ఇందుకోసం వారి ఫోన్‌ నెంబర్లు తీసుకుని దాని ద్వారా వచ్చే ఓటీపీని అడుగుతున్నారు. ఓటీపీ నెంబర్‌ చెప్పకపోతే బలవంతంగా తెలుసుకునేందుకు బరితెగిస్తున్నారు. దీంతో గొడవలు జరుగుతున్నాయి. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఒక మహిళా టీడీపీ కార్యకర్త ఒక ఇంట్లోకి వెళ్లి వారి వివరాలు సేకరించి ఓటీపీ తీసుకోవడంతో గందరగోళం నెలకొంది. స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేయడంతో టీడీపీ కార్యకర్తలు వారిపై దౌర్జన్యానికి తెగబడ్డారు.

రెచ్చిపోతున్న టీడీపీ కార్యకర్తలు

అలాగే, ఇదే పట్టణంలోని ఆకుల వీధిలో కొందరు తెలుగు తమ్ముళ్లు ఓటర్ల వెరిఫికేషన్‌ పేరుతో సమాచారం సేకరిస్తూ ఎందుకని ప్రశ్నించిన వారిపై గొడవకు దిగి గందరగోళం సృష్టించారు. ఆ వీధిలోని ఒక ముస్లిం మహిళ ఇంటికి వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్‌ పేరుతో ఆమె ఫోన్‌ నెంబర్‌, ఆధార్‌ కార్డు ఇతర వివరాలన్నీ తీసుకున్నారు. ఫోన్‌ నెంబర్‌ ద్వారా ఓటీపీ కూడా తీసుకోవడంతో ఇరుగుపొరుగు వాళ్లు అడ్డుకున్నారు. ఓటీపీ నెంబర్‌తో మోసాలకు పాల్పడుతున్నారని, ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించగా టీడీపీ కార్యకర్తలు గందరగోళం సృష్టించారు. ఈలోపు సమీపంలోనే ఉంటున్న రాజంపేట మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ మర్రి రవి అక్కడికి రావడంతో టీడీపీ కార్యకర్తలు మరింత రెచ్చిపోయారు. ప్రజలకు ఇష్టంలేకుండా వారి వ్యక్తిగత సమాచారాన్ని ఎలా యాప్‌లో నమోదు చేస్తారని అడిగినందుకు వారు గొడవకు దిగారు. సమాచారం తెలుసుకుని పోలీసులు రావడంతో టీడీపీ కార్యకర్తలు మాటమార్చి వైఎస్సార్‌సీపీ నేత రవిపై రకరకాల ఫిర్యాదులు చేశారు. దీనిపై పోలీసులు లోతుగా ఆరా తీయగా.. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం కింద టీడీపీ కార్యకర్తలు ప్రజల పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తేలింది. ప్రజల ఫోన్‌ నెంబర్లను యాప్‌కి అనుసంధానం చేసుకుని దాని ద్వారా వారి వివరాలు తెలుసుకుంటున్నట్లు స్పష్టమైంది. కానీ, ఆ విషయం చెప్పకుండా తాము తహసీల్దార్‌ కార్యాలయం నుంచి ఓటర్ల వెరిఫికేషన్‌ కోసం వచ్చామని చెబుతూ ఇళ్లల్లోకి వెళ్లి వివరాలు సేకరిస్తూ ప్రశ్నించిన వారిపై ఎదురుదాడికి దిగుతున్నారు.

అడ్డంగా బుక్కవడంతో వీరంగం..

టీడీపీ తమ్ముళ్లు అడ్డంగా దొరికిపోవడంతో దీనిని జీర్ణించుకోలేక వారు ఆదివారం వీరంగం సృష్టించారు. అక్కడి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు స్వయంగా రాజంపేట, నందలూరు మండలాల నుంచి కార్యకర్తలను సమీకరించి ఆకుల వీధికి వెళ్లారు. అక్కడ మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ ఇంటి వద్ద కవ్వింపు చర్యలకు దిగారు. విషయం తెలుసుకుని పోలీసులు అక్కడకు రావడంతో వారిని సైతం తోసేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మరోవైపు.. టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా ఇలాగే ఓటర్ల వెరిఫికేషన్‌ పేరుతో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తుండడంతో గొడవలు జరుగుతున్నాయి. ఎవరైనా సమాచారం చెప్పడానికి నిరాకరిస్తే వారిపై ఆ పార్టీ కార్యకర్తలు దౌర్జన్యం చేస్తున్నారు.

మహేంద్ర మృతిని రాజకీయం చేయొద్దు

వీడియో విడుదల చేసిన మహేంద్ర కుటుంబ సభ్యులు

కొవ్వూరు: బొంతు మహేంద్ర మృతిపై ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించారని, తమ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలిచారని మృతుడి కుటుంబ సభ్యులు ప్రకటించారు. మహేంద్ర మరణాన్ని ఎవరూ రాజకీయం చేయొద్దని కోరారు. ఈ అంశంలో కొందరు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరులో జరిగిన ఫ్లెక్సీ వివాదంలో బొంతు మహేంద్ర బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై గత ఐదు రోజులుగా కొనసాగుతున్న పరిణామాలపై మృతుడు మహేంద్ర తల్లి శ్రీదేవి, అన్న సురేష్‌, వదిన మరియమ్మతో కలిసి అతడి చిన్నాన్న భార్య, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతు వెంకటలక్ష్మి ఆదివారం ఒక వీడియోను విడుదల చేశారు. సీఎం వైఎస్‌ జగన్‌ వెంటనే స్పందించి మంత్రి మేరుగు నాగార్జున, రాజీవ్‌కృష్ణలను తమ ఇంటికి పంపించి తమకు ఎంతో ఓదార్పును, భరోసాను కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించడమే కాకుండా, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అంతేకాకుండా తమ కుటుంబానికి ఏ అవసరమొచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం జగన్‌ చెప్పమన్నారని మంత్రి మేరుగు తమకు తెలిపారన్నారు. శాసనమండలి చైర్మన్‌ కొయ్యే మోషేన్‌రాజు కూడా తమను పరామర్శించి ధైర్యం చెప్పారని చెప్పారు. తమ కుటుంబానికి ఎంతో అండగా ఉన్న సీఎం జగన్‌, ప్రభుత్వానికి బొంతు మహేంద్ర కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు తమ కుటుంబం రుణపడి ఉంటుందన్నారు.



'ఆకాశ' ప్రయాణానికి ప్రజల ఆసక్తి!

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గణనీయమైన వృద్ధి

గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన ప్రయాణికుల సంఖ్య

గన్నవరం: గతంలో పోల్చుకుంటే విమాన ప్రయాణం పట్ల ప్రజలు విపరీతమైన ఆసక్తి పెంచుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలోనే ప్రయాణికుల సంఖ్య పరంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) గణనీయమైన వృద్ధి సాధించడమే ఇందుకు నిదర్శనం. గడిచిన ఆరు నెలల్లో ఈ విమానాశ్రయం నుంచి 5,41,814 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. వీరిలో దేశీయ ప్రయాణికులు 5,18,883 మంది ఉండగా, అంతర్జాతీయ ప్రయాణికులు 22,931 మంది ఉన్నారు. గతేడాదితో పోల్చితే ఆరు నెలల్లోనే అదనంగా 66,231 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ప్రయాణికుల రద్దీ ఇదే విధంగా కొనసాగితే ఈ ఆర్థిక ఏడాది ఒక మిలియన్‌ దాటే అవకాశం ఉందని ఎయిర్‌పోర్ట్‌ వర్గాలు పేర్కొంటున్నారు. కాగా, కోవిడ్‌ పరిస్థితుల కారణంగా రెండేళ్ల పాటు విమానాల రద్దు, ఆంక్షల కారణంగా ప్రయాణికుల రద్దీ గణనీయంగా పడిపోయింది. తిరిగి 2022–23లో భారీగా పుంజుకుంది.

పెరిగిన సర్వీసులు..

పెరుగుతున్న ప్రయాణికుల ఆసక్తికి అనుగుణంగా ఎయిర్‌లైన్స్‌ సంస్థలు కూడా విమాన సర్వీసులను పెంచుతున్నాయి. ప్రస్తుతం దేశీయంగా న్యూఢిల్లీ, హైదరాబాద్‌, బెంగళూరు, చెన్నై, వైజాగ్‌, షిరిడీ, కడప, తిరుపతికి రోజువారి 42 సర్వీసులు నడుస్తున్నాయి. అంతర్జాతీయంగా వారానికి కువైట్‌కు ఒకటి, షార్జాకు రెండు సర్వీసులు సేవలందిస్తున్నాయి. దేశీయంగా న్యూఢిల్లీ, హైదరాబాద్‌, బెంగళూరు సర్వీసులకు ప్రయాణికుల నుంచి మంచి డిమాండ్‌ ఉంది. కొత్తగా ముంబయి, వారణాసి సర్వీసులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మాదిగల అభ్యున్నతికి కృషిచేస్తున్న సీఎం జగన్‌

రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత



విజయవాడరూరల్‌: మాదిగల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ఎనలేని కృషిచేస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. విజయవాడ రూరల్‌ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మాదిగల ఆత్మీయ వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వనిత మాట్లాడుతూ మాదిగ జాతికి మేలు చేసిన ఏకైక సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. మాదిగల కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత చదువులు చదవాలని విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చి.. పీజీ వరకు ఉచితంగా విద్యనందిస్తున్నారని తెలిపారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ స్ఫూర్తి, బాబూ జగ్జీవన్‌రామ్‌ ఆలోచనలకు అనుగుణంగా తనను హోంమంత్రిని చేశారని చెప్పారు. మాదిగ సామాజికవర్గాన్ని సీఎం జగన్‌ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమెను గజమాలతో ఘనంగా సత్కరించారు.

బాబు ఓటు బ్యాంకుగా చూశారు: నందిగం

బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ మాట్లాడుతూ చంద్రబాబు మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకుని కాళ్ల కింద కూర్చోబెట్టారని చెప్పారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన వర్ల రామయ్యను రాజ్యసభ సభ్యుడిగా ప్రకటించి, తర్వాత తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి నుంచి రూ.100 కోట్లు తీసుకుని అతనికి కేటాయించిన నమ్మకద్రోహి చంద్రబాబని ధ్వజమెత్తారు. మరోసారి వైఎస్‌ జగన్‌ను గెలిపించుకుంటేనే మనకు మంచి భవిష్యత్‌ ఉంటుందన్నారు. ఎన్నడూలేని విధంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన తానేటి వనితను హోంశాఖ, ఆదిమూలపు సురేష్‌ను మున్సిపల్‌ శాఖ మంత్రులుగా చేయడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్‌, మొండితోక అరుణ్‌ కుమార్‌, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ ప్రసంగించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్‌, విజయవాడ నగర మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర లిడ్‌క్యాప్‌ చైర్మన్‌ కాకుమాను రాజశేఖర్‌, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పేటెంట్‌గా పురందేశ్వరి: కొడాలి నాని



గుడివాడ టౌన్‌: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి టీడీపీకి పేటెంట్‌గా వ్యవహరిస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక దోపిడీ జరుగుతోందంటూ ఆమె చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. చంద్రబాబు పాలనలో ఇసుక దోపిడీ జరిగిందని.. దానిపై ప్రస్తుతం కేసులు కూడా నడుస్తున్నాయన్నారు. అందులో ఆమె లంచాలు తీసుకుని ఆ నాడు నోరు మెదపకుండా మిన్నకున్నారని ఆరోపించారు. అప్పట్లో చంద్రబాబు చేసిన దోపిడీల్లో ఆమెకు కూడా వాటా ఉందని తెలిపారు. బాబు పాలనలో ఇసుక నుంచి ప్రభుత్వానికి పైసా ఆదాయం రాలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వమే ఇసుక అమ్మడం వలన ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని, అది ప్రజల సేవకు ఉపయోగపడుతోందని తెలిపారు. గతంలో తండ్రికి వెన్నుపోటు పొడిచి బావకు వత్తాసు పలికిందని, తిరిగి కాంగ్రెస్‌లో చేరి.. ఆపై సోనియాగాంధీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలో చేరిందని, ఇప్పుడు బీజేపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీకి లాభం చేకూర్చేలా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.

బెయిల్‌ కోసం బాబు దొంగ వేషాలు

చంద్రబాబు విషయానికి వస్తే అతను ఒక 420 అన్నారు. గతేడాది 'నేను 25 ఏళ్ల యువకుడిగా పని చేస్తున్నా.. విజన్‌ 2050 నా ధ్యేయం' అని చెప్పిన ఆయన ఇప్పుడు.. బెయిల్‌ కోసం దొంగ వేషాలు వేస్తున్నాడని దుయ్యబట్టారు. కొత్తగా కన్ను, పళ్లు, గుండెకు బొక్కలు పడ్డాయని, లివర్‌ పాడైందని, కిడ్నీ రాలిపోయిందని, బ్రెయిన్‌ దెబ్బతిందంటూ తప్పుడు అఫిడవిట్‌ ఇచ్చి కోర్టును తప్పుదారి పట్టించే యత్నం చేస్తున్నారని చెప్పారు.

పశు సంవర్థక శాఖలో పోస్టుల భర్తీకి

నేడు నోటిఫికేషన్‌

▶ మొదటి పేజీ తరువాయి

చెల్లించాలి. దరఖాస్తులను డిసెంబర్‌ 11వ తేదీ అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుంది.

ఇప్పటికే రెండు విడతల్లో 4,643 పోస్టుల భర్తీ

సచివాలయాలకు అనుబంధంగా గ్రామ స్థాయిలో 10,778 వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రాలు సేవలందిస్తున్న విషయం తెలిసిందే. స్థానికంగా ఉండే పశు సంపద ఆధారంగా 9,844 వీఏహెచ్‌ఏలు అవసరమని గుర్తించి ఆ మేరకు నోటిఫికేషన్‌ జారీ చేశారు. రెండు విడతల్లో 4,643 ఆర్బీకేల్లో వీఏహెచ్‌ఏలను నియమించారు. రేషనలైజేషన్‌ ద్వారా గ్రామ పరిధిలో 2–3 ఆర్బీకేలు ఉన్న చోట గ్రామాన్ని యూనిట్‌గా వీఏహెచ్‌ఏలను నియమించి, అదనంగా ఉన్న వీఏహెచ్‌ఏలను లేనిచోట్ల సర్దుబాటు చేశారు. మిగిలిన 1,896 ఆర్బీకేల పరిధిలో వీఏహెచ్‌ఏల నియామకానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్‌ ఇవ్వడంతో పోస్టుల భర్తీకి పశు సంవర్థక శాఖ నోటిఫికేషన్‌ జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాల వారీగా భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు

జిల్లా	పోస్టుల సంఖ్య
అనంతపురం	473
చిత్తూరు	100
కర్నూలు	252
వైఎస్సార్‌	210
నెల్లూరు	143
ప్రకాశం	177
గుంటూరు	229
కృష్ణా	120
పశ్చిమ గోదావరి	102
తూర్పు గోదావరి	15
విశాఖపట్నం	28
విజయనగరం	13
శ్రీకాకుళం	34

తెలంగాణ



బిగ్‌స్క్రీన్‌పై మ్యాచ్‌ చూస్తున్న నాయకులు, కార్యకర్తలు

ప్రచారం మాని.. ప్రసారాలు

ఆస్ట్రేలియా – భారత్‌ మధ్య ఆదివారం జరిగిన క్రికెట్‌ ప్రపంచ కప్‌ పోటీ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికి తీవ్ర అంతరాయం కలిగించింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు, పార్టీ శ్రేణులే కాదు.. స్వతంత్రులు సైతం ఆదివారం మధ్యాహ్నం వరకే ప్రచారం చేశారు. ఆ తర్వాత క్రికెట్‌ మ్యాచ్‌ తిలకించడంలో నిమగ్నమయ్యారు.

క్లుప్తంగా...

నేడు అనకాపల్లి, పల్నాడు, వైఎస్సార్‌ జిల్లాల్లో సామాజిక సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్‌ జగన్‌ చేసిన మంచిని వివరించడానికి వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా యలమంచిలి, పల్నాడు జిల్లా నరసరావుపేట, వైఎస్సార్‌ జిల్లా మైదుకూరు నియోజకవర్గాల్లో సామాజిక సాధికార యాత్ర జరగనుంది.

పేదలకు మంచి జరిగితే ఓర్చుకోలేరు

చంద్రబాబు, పవన్‌పై మంత్రి కారుమూరి ఆగ్రహం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

ఉండి: పేదలకు మంచి జరిగితే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ ఓర్చుకోలేరని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం ఉణుదుర్రు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని డీసీసీబీ చైర్మన్‌ పీవీఎల్‌ నర్సింహరాజుతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌ తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేదల కొనుగోలు శక్తి పెరిగిందని నీతి ఆయోగ్‌ తెలిపిందన్నారు. రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుంచి 6 శాతానికి తగ్గిందని కేంద్రమే తెలియజేసిందని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో పంచాయతీ భవనాల శ్లాబులు కారిపోతున్నా కనీసం మరమ్మతులకు కూడా డబ్బులు మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పేద పిల్లల అభివృద్ధి కోసం ఇంగ్లిష్‌ మీడియం తీసుకువస్తే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ వ్యంగ్యంగా మాట్లాడటంతోపాటు వివిధ రూపాల్లో అడ్డుకునేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. గతంలో చంద్రబాబుకు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రజల సొమ్మును దోచుకున్నారని, అందువల్లే జైలుకు వెళ్లారని విమర్శించారు. ఇప్పటివరకు చంద్రబాబు సుమారు 25 కేసుల్లో స్టే తెచ్చుకుని బయట ఉన్నారని మండిపడ్డారు.

దొంగ ఉద్యమాన్ని ఆపకుంటే ప్రజలు తరిమికొడతారు

బహుజన పరిరక్షణ సమితి నాయకులు



దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అమరావతి పేరుతో జరుగుతున్న దొంగ ఉద్యమాన్ని కట్టిపెట్టకపోతే ఈ ప్రాంత ప్రజలు తరిమికొడతారని బహుజన పరిరక్షణ సమితి నేతలు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 1,148వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు ప్రసంగిస్తూ అవినీతిపరుడైన చంద్రబాబుకు అండగా మాట్లాడుతున్న కులవాదులు ఎప్పుడైనా రైతుల ప్రయోజనాల కోసం పాటుపడిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. నిజంగా రైతుల ప్రయోజనాలే ముఖ్యమైతే అన్ని పార్టీల్లోని కులవాదులు, నేతలు ప్రభుత్వానికి రాజధాని వ్యవహారంలో తమ డిమాండ్‌ తెలియజేయాలే కానీ అవినీతి చేసిన వారికి అండగా నిలిచి ప్రభుత్వాలను విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు తమని నమ్మడం లేదని గ్రహించిన చంద్రబాబు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. నేతలు మాదిగాని గురునాథం, పల్లె బాబు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరించొద్దు..!

ఎల్లో మీడియాకు సీపీఎం, సీపీఐ లేఖ

సాక్షి, అమరావతి: వినోబా భావే లక్షల ఎకరాలను పంపిణీ చేశారంటూ అబద్ధాలు రాయడం సరికాదని, వాస్తవాలు తెలియకుండా చరిత్రను వక్రీకరించొద్దని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కే.రామకృష్ణలు ఆంధ్రజ్యోతికి హితవు పలికారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఎడిటర్‌కు వారిద్దరు ఆదివారం సంయుక్త లేఖ రాశారు. సీఎం జగన్‌ చేపట్టిన భూ పంపిణీ కార్యక్రమాన్ని విమర్శిస్తూ ఈ నెల 18న ఆంధ్రజ్యోతి ఏపీ ఎడిషన్‌లో 'భూములపై బొంకులు' అంటూ ప్రచురించిన బ్యానర్‌ కథనంలో అబద్ధాలను ప్రచారం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌ను విమర్శించే క్రమంలో ఏపీలో వినోబా భావే సమయంలో లక్షల ఎకరాలు పంపిణీ చేసినట్లు రాయడం వాస్తవాలను వక్రీకరించడమే అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ వినోబా భావే భూములు పంచారో, అవి ఇప్పుడు ఎవరి స్వాధీనంలో ఉన్నాయో ఒక ఉదాహరణ ఇచ్చినా తాము సంతోషిస్తామని తెలిపారు. అబద్ధాన్ని ప్రజలపై రుద్దడం న్యాయం కాదని, చరిత్రను వక్రీకరించకుండా ప్రజలకు వాస్తవాలు అందించాలని సూచించారు.



ప్రేమ లేకపోవడం కాదు, స్నేహం లేకపోవడం సంతోషం లేని పెళ్లిళ్లకు కారణం.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 20 నవంబర్ 2023

పుస్తకం కర్ణభూషణం

పుస్తకం హస్తభూషణమన్నారు; అది చదివే పుస్తకాల గురించి! ఇప్పుడు వినే పుస్తకాలు ప్రాచుర్యాన్ని తెచ్చుకుంటూ కర్ణభూషణంగా మారుతున్నాయి. కాలం చేసే తమాషాలలో ఇదొకటి. మన జీవితమూ, ఊహలూ, ప్రణాళికలూ కాలం వెంబడి సరళరేఖలా సాగుతాయనుకుంటాం. కానీ, దృష్టి వైశాల్యాన్ని పెంచుకుని చూస్తే కాలం మళ్ళీ మళ్ళీ బయలుదేరిన చోటికే వచ్చే చక్రంలా కూడా కనిపిస్తుంది. 'కాలచక్ర'మనే మాట సర్వత్రా ప్రసిద్ధమే. పుస్తక ప్రపంచంలోకే కనుక ఒకసారి తొంగి చూస్తే, 'చదువు' అనే మాట పుస్తకంతో ముడిపడే ప్రచారంలోకి వచ్చింది. పుస్తకాలు లేని కాలంలో; లేదా, అవి జనసామాన్యానికి విరివిగా అందుబాటులోకి రాని రోజుల్లో కథలూ, కవిత్వాలూ, ఇతరేతర జ్ఞానాలూ అన్నీ వినుకలి ద్వారానే అందేవి. దీర్ఘకాలంపాటు ప్రపంచవ్యాప్తంగా సమస్త వాఙ్మయమూ చక్షురక్షరాల మధ్య కాకుండా; వక్తకీ, శ్రోతకీ మధ్య ప్రవహిస్తూ మౌఖిక వాఙ్మయమనే ముద్ర వేసుకుంది. పుస్తక వ్యాప్తితోనే లిఖిత సాహిత్యమన్న మాట వాడుకలోకి వచ్చింది.

కాలచక్రం మళ్ళీ మొదటికొచ్చి, పుస్తకమనే 'పఠన' మాధ్యమం స్థానాన్ని, ఇయర్ ఫోన్ రూపంలో తిరిగి వెనకటి 'శ్రవణ' మాధ్యమం ఆక్రమించుకుంటున్నట్టు తోస్తోంది. నేటి యువత పుస్తకాన్ని చదవడం కన్నా, వినడాన్ని ఎక్కువ ఇష్టపడుతున్నట్టు కనిపిస్తోంది. ఆ విధంగా, 'పుస్తకాలు లేని గది ఆత్మలేని దేహ'మన్న సిసిరో సూక్తిని కొంత సవరించుకోవలసిన అవసరమూ కలుగుతోంది. కనుకలి నుంచి వినుకలికి మారినప్పుడు పుస్తకం కలిగించే అనుభూతి గాఢతలోనూ మార్పు వస్తుందా అన్నది అనుభవంతో మాత్రమే చెప్పగలం. ఏదైనాసరే అంతిమంగా అలవాటు పడడంలోనే ఉంటుంది. మాధ్యమం ఎలాంటిదైనా పుస్తకానికీ మస్తకానికీ పడిన పీటముడి స్థిరమూ, శాశ్వతమనీ మాత్రం నిస్సంశయంగా చెప్పవచ్చు. రాబోయే కాలం అనూహ్యంగా మన అంచనాలను తలకిందులు చేస్తే తప్ప పుస్తకాలతో మన సహజీవనం మరికొన్ని తరాలపాటు నిరాఘాటంగా కొనసాగుతుందనే అనుకోవచ్చు.

కాపురంలోలానే పుస్తకాలతో కాపురంలోనూ చేదూ, తీపీ కలగలిసే ఉంటాయి. పుస్తక ప్రియులు వియ్యమందితే ఒక్కోసారి సొంతింటి పుస్తక వారసత్వానికీ, సొంత సేకరణకూ అదనంగా అత్తింటి పుస్తక వారసత్వమూ అంది, పుస్తకాలు ఇబ్బడి ముబ్బడై అల్మైరాలను దాటిపోయి నేల మీద పరచుకుంటూ ఉంటాయి. పుస్తెతోపాటు సంక్రమించిన పుస్తక సంపదా ఇల్లాలికి దినదిన సమస్య అవుతూ ఉంటుంది. పుస్తకాలతో జీవించడం కూడా ఒక పుస్తకానికి సరిపోయే ఇతివృత్తమవుతుంది. బాల్యం నుంచి, వార్ధక్యం వరకూ మనతో ఉండే పుస్తకాలు, ఒక్క పుట కూడా తెరవకుండానే, ఆయా వయోదశల మీదుగా మన అభిరుచులలో వచ్చే తేడాలను బోధిస్తాయి. మనకు పనికిరానివని పక్కన పెట్టిన పుస్తకాలే క్రమంగా మన చదువుల బల్లకెక్కి వెక్కిరిస్తాయి. మన హస్తస్పర్శ కోసం ఏళ్ల తరబడి మౌన తపస్సు చేసే పుస్తకాలే, ఒక్కసారి తెరవగానే అద్భుత ప్రపంచంలోకి మనల్ని లాక్కుపోతాయి. మన ప్రయాణం ఆగినా పుస్తక ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది.

కవిత్వానికి ఏదీ అనర్హం కాదని మహాకవి ఉగ్గడించినట్టుగా, చరిత్ర శోధనకూ ఏదీ అనర్హం కాదు. పుస్తక చరిత్రనే తవ్వితే అది కూడా ఎన్నో అవతారాలు ఎత్తుతూ నేటి దశకు వచ్చిన సంగతి అర్థమై రేపటి అవతారం గురించిన దిగులు, గుబుళ్లను తగ్గిస్తుంది. పుస్తకం గురించిన ఊహ క్రీస్తుపూర్వం నాలుగవ సహస్రాబ్ది నాటికే ఉండేది. ప్రాచీన ఈజిప్టు వాసులు మధ్య ఆఫ్రికా, నైలునదీ లోయల్లో పెరిగే 'పెపారస్' అనే నీటిమొక్క నుంచి తీసిన మెత్తని బెరడును రాతకు, చిత్రలేఖనానికి ఉపయోగించేవారు. ఈ 'పెపారస్' పేరే 'పేపర్'గా మారి ఇప్పటికీ వ్యవహారంలో ఉంది. ఆంగ్లంలో 'బుక్' అనే మాట పుట్టుకా ఇంతే ఆసక్తికరం. యూరప్, ఆసియా అడవుల్లో పెరిగే 'బచ్' అనే చెట్టు తాలూకు తెల్లని బెరడును రాతకు ఉపయోగించేవారు. నేటి ఇండో–యూరోపియన్ భాషలకు మాతృక అయిన ప్రోటో–ఇండో–యూరోపియన్ లోని 'భెరెగ్', 'భగో' అనే మాటలే వివిధ పుత్రికాభాషల్లో 'బచ్' గానూ, 'బీచ్' గానే కాక; ఇంకా అనేక రూపాంతరాలు చెందుతూ చివరికి 'బుక్'గా మారాయి. ప్రాచీన భారతదేశంలో రాతకు ఉపయోగించిన 'భూర్జపత్ర'మనే సంస్కృత శబ్ద మూలాలు కూడా 'భెరెగ్' అనే ప్రోటో–ఇండో–యూరోపియన్ పదంలోనే ఉన్నాయి. క్రీస్తుశకం తొలి శతాబ్దంలో రోమన్లు శిక్షాస్మృతుల రాతకు గొర్రె, మేక చర్మాన్ని వినియోగించేవారు. క్రమంగా తాటియాకులు, రాగిరేకులు రాతకు ఆలంబనమయ్యాయి. క్రీస్తుశకం 2–5 శతాబ్దుల మధ్యలో వచ్చినట్టు చెబుతున్న 'డైమెండ్ సూత్ర' తొలి ముద్రితగ్రంథమంటారు. ఇక 15వ శతాబ్దిలో జోహానెస్ గూటెన్‌బర్గ్ కనిపెట్టిన ముద్రణ యంత్రం పుస్తక ప్రచురణను విప్లవీకరించడం, 16వ శతాబ్దిలో రిచర్డ్ ముల్‌కాస్టర్ అనే పండితుడు ఎనిమిదివేల మాటలతో తొలి నిఘంటువును ప్రచురించడం వగైరాలు ఇటీవలి చరిత్ర. ఎప్పటికప్పుడు పరిమిత సంఖ్యలో పుస్తకాలను ప్రచురించుకునే నేటి అవకాశాన్ని (ప్రింట్–ఆన్ –ఆర్డర్) ఫ్రెడరిక్ ఫో అనే సైన్సు ఫిక్షన్ రచయిత 1966లోనే ఊహించాడు.

ఇంతకీ ఈ పుస్తక స్మరణ దేనికంటే, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పుస్తకాల పండుగ సమీపిస్తోంది. కొన్ని రోజులపాటు జరిగే ఈ పండుగకు ముద్రాపకులు, విక్రేతలు, రచయితలు సమధికోత్సాహంతో సిద్ధమవుతున్నారు. ముద్రిత గ్రంథాల భవిష్యత్తు పట్ల ప్రస్తుతానికి అదే కొండంత భరోసా.

కాలశకలమై మిగిలిన జ్ఞాపకం

కామెంట్



కరణ్ థాపర్

సీజర్ విషయంలో జరిగినట్లే ఇందిరా గాంధీకీ జరిగింది! ఆమె మంచి అంతా ఆమె చితాభస్మంతో పాటుగా నీటిలో కలిసిపోయింది. మనం గుర్తుపెట్టుకున్నది చెత్తను మాత్రమే! ఇండో–పాక్ యుద్ధంలో పాకిస్తాన్‌ను భారత్ ఓడించిందనీ, బంగ్లాదేశ్ ఆవిర్భవించిందనీ శ్రీమతి గాంధీ ప్రకటించిన రోజు ఈనాటికీ ఎంతో ఉత్తేజభరితమైనది. ఆ తర్వాతి రోజో, లేక ఆ మర్నాడో ఆమె పీఎల్–480 ఆహార సహాయ ఒప్పందాన్ని నిష్కర్షగా తిరస్కరిస్తూ ప్రెసిడెంట్ నిక్సన్‌కు లేఖ రాయడం అమెరికా పక్షపాత వైఖరికి దీటైన సమాధానం. అయినప్పటికీ నాటి ఇండో–పాక్ యుద్ధంలో భారత్ ఘన విజయానికి కారకుడిగా ఈరోజున మనం శామ్ మానెక్‌షాను సరిగ్గానే కీర్తిస్తున్నాం కానీ, అందులో శ్రీమతి గాంధీ పాత్రను మాత్రం అన్యాయంగా తిరస్కరిస్తున్నాం.

ఒకవేళ నేటికీ ఆమె సజీవంగా ఉండి ఉంటే, తన 106 ఏళ్ల వయసులో ఉండేవారు (నవంబర్ 19న జయంతి). ఆమె హత్యకు గురయ్యారన్న నాలుగు దశాబ్దాల నాటి వాస్తవం నేడొక వెలిసిపోయిన జ్ఞాపకంగా మాత్రమే మిగిలినప్పుడు ఇందిరాగాంధీని నేనిలా గుర్తు చేసుకోవడం చిత్రమైన సంగతే. అయితే సఫ్దర్‌జంగ్ రోడ్డులోని ఆమె స్మారక చిహ్నాన్ని సందర్శించే అసంఖ్యాక జనసమూహానికి అదొక పర్యాటక ఆకర్షణ. తక్కిన మనందరికీ గతించి పోయిన కాల శకలం. ఎమర్జెన్సీ (అత్యవసర పరిస్థితి) తప్ప, మరేదీ మన మదిలో లేనిది.

తొలిసారి నేనామెను నిబిడాశ్చర్యంతో చూశాను. అది 1975. ఎమర్జెన్సీ పరిస్థితులు పరాకాష్ఠకు చేరుకుని ఉన్న సమయం. నిజానికి నేనొక పురుషాధిపత్య స్వభావం కలిగిన ఒక మహిళను చూడబోతున్నాననే అనుకున్నాను. కానీ ఆమె సొగసుగా, స్నిగ్ధంగా ఉన్నారు. ఆమెలో నాకు అత్యంత స్పష్టంగా గుర్తున్నవి ఆమె చేతులు. అవి సన్నగా, కోమలమైన ఆకృతిని కలిగి ఉన్నాయి. ఒక నియంతలో అవి నేను ఊహించనివి. అప్పటికి నాలుగేళ్ల క్రితం 'ది ఎకనమిస్ట్' ఆమెను భారత సామ్రాజ్ఞి అని అభివర్ణించింది. ఆమె మణికట్టుకు మగవారి చేతివాచీ ఉన్నప్పటికీ ఒక రాకుమారిలోని సౌకుమార్యం ఆమెలో ఉట్టిపడుతూ ఉంది.

అయినప్పటికీ ఆమె అతి సామాన్యంగా ఉండేవారు. ఎమర్జెన్సీ సమయంలో ఒక ఆదివారం నేను, మా అక్కచెల్లెళ్లు... గాంధీలతో కలిసి రాష్ట్రపతి భవన్‌లో 'ద పింక్ పాంథర్'ను చూసేందుకు వెళ్లడానికి ముందు అంతా కూర్చొని అల్పాహారం తీసుకుంటూ, పూర్తిగా మాటల్లో మునిగిపోయాం. శ్రీమతి గాంధీ ఒక్క ఉదుటన ''పదండి, పదండి...'' అనేంత వరకు కూడా సమయం మించిపోతున్నట్లు మేము గమనించనే లేదు. ''ఇప్పటికే మనం లేట్ అయ్యాం. ఎవరైనా ఒకటికి వెళ్లాలనుకుంటే ఇప్పుడే వెళ్లిరండి'' అని కూడా ఆమె అన్నారు.

అప్పుడు మా ప్రమీలక్క, ''ప్రచారంలో ఉండగా ఒకటికి వెళ్ల వలసి వచ్చినప్పుడు మీరేం చేశారు?'' అని శ్రీమతి గాంధీని అడిగారు. మా మాటకు ఆమె... ''రాత్రి పడుకునే ముందు చివరిగా నేను చేసే పని కడుపునిండా నీళ్లు తాగడం. దాంతో ఉదయానికంతా నా సిస్టమ్ ఖాళీ అయిపోతుంది. తర్వాత ఒకటికి వెళ్లే అవసరమే ఉండదు'' అని చెబుతూ, ''మగవాళ్లలా నేను చెట్టు వెనక్కు వెళ్లలేను కదా'' అని నవ్వారు.

ఏమైనా సీజర్ విషయంలో జరిగినట్లే, ఆమె మంచి అంతా ఆమె చితాభస్మంతో పాటుగా నీటిలో కలిసిపోయింది. మనం గుర్తు పెట్టుకున్నది చెత్తను మాత్రమే! నా జ్ఞాపకాలలో 1971 డిసెంబర్ 16 నాటి ఉత్తేజం నేటికింకా స్పష్టంగా ఉంది. ఇండో–పాక్ యుద్ధంలో పాకిస్తాన్‌ను భారత్ ఓడించిందనీ, బంగ్లాదేశ్ ఆవిర్భవించిందనీ శ్రీమతి గాంధీ ప్రకటించిన రోజు అది. ఆ తర్వాతి రోజో, లేక ఆ మర్నాడో ఆమె పీఎల్–480 ఆహార సహాయ ఒప్పందాన్ని నిష్కర్షగా తిరస్కరిస్తూ ప్రెసిడెంట్ నిక్సన్‌కు లేఖ రాసినప్పుడు అమెరికా పక్షపాత వైఖరికి దీటైన సమాధానం ఇచ్చారని నా పదహారేళ్ల వివేచనకు అనిపించింది. నాటి ఇండో–పాక్ యుద్ధంలో భారత్ ఘన విజయానికి కారకుడిగా ఈరోజున మనం శామ్ మానెక్‌షాను సరిగ్గానే కీర్తిస్తున్నాం కానీ, అందులో శ్రీమతి గాంధీ పాత్రను మాత్రం అన్యాయంగా తిరస్కరిస్తున్నాం.



లండన్‌లో మార్గరెట్ థాచర్‌తో ఇందిరా గాంధీ



ఇందిరతో సేనాపతి శామ్ మానెక్‌శా

విదేశాలలో ఇందిరా గాంధీ నెలకొల్పిన భారతదేశ ప్రతిష్ఠను చూసి గర్వించిన తరం నాది. 1960ల మధ్యలో లిండన్ జాన్సన్ పక్కన చక్కటి దుస్తులలో, తీరుగా కత్తిరించిన ఒత్తయిన జుత్తుతో ఇందిరా గాంధీ నిలబడి ఉండగా ఫొటో తియ్యడం ఆ ఫొటోగ్రాఫర్ జన్మకు ధన్యత అనే చెప్పాలి. శ్వేతసౌధం పచ్చిక బయళ్లలో తీసిన ఆ ఫొటోల కంటే మెరుగ్గా మళ్లీ ఎవరైనా తియ్యడం అసాధ్యం అనుకున్నాను.

అయితే అది 1982లో లండన్‌లో జరిగిన ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ప్రారంభోత్సవంలో నేను ఆమెను చూసేంత వరకే! ఆ కార్యక్రమంలో మార్గరెట్ థాచర్‌తో కలిసి నడుస్తున్నప్పుడు ఇందిరా గాంధీ ఆహార్యాన్ని చూసి ప్రేక్షకులు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. జామావర్ షాల్‌తో తయారైన అద్భుతమైన కోటును ధరించి ఉన్నారామె. ఆమెను అలా చూసి నా మనసు పాఠశాల రోజులలో నేను చదువుకున్న ఎనోబార్బస్ వర్ణనను గుర్తు చేసింది. ''వయసు ఆమెను వడలిపోనివ్వదు. సంప్రదాయం ఆమె అనంతమైన వైవిధ్యాన్ని సణించనివ్వదు'' అంటాడు ఎనోబార్బస్, క్లియోపాత్ర గురించి!

1977లో ఇందిరా గాంధీ సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడానికి కారణం ఏమిటి? బహుశా అది ఆమె గురించి ఎప్పటికీ విడివడని ముడి కావచ్చు. ఆ ఎన్నికలకు ఇంకో ఏడాది సమయం ఏమీ లేకపోవచ్చు. కానీ వాటిని వాయిదా వేయగల సామర్థ్యం ఆమెకు లేకపోతే కదా! ఎన్నికలకు ఆమెను బలవంతం చేసే బయటి శక్తులు కూడా ఏమీ లేవు. కాబట్టి ఆమె తన మనస్సాక్షి ప్రకారం ముందుకు వెళ్లారని అనుకోవాలా? లేక ఎమర్జెన్సీ విధించినందుకు ఆమెలో పశ్చాత్తాపం కలిగిందా? లేదంటే, ఎమర్జెన్సీ చాలా కాలం సాగిందన్న విషయాన్ని ఆమె అంగీకరించి ఉంటారా? వేర్వేరు వ్యక్తులు ఈ ప్రశ్నలకు భిన్నమైన సమాధానాలు ఇచ్చారు. వాటిల్లో ఒక్కటి కూడా సబబైన జవాబుగా అనిపించదు.

నిజానికి ఇంకా లోతైన ప్రశ్న ఉంది. ఆ ఎన్నికలలో తను విజయం సాధించగలనని ఆమె భావించి ఉంటారా, లేదా తనొక ఘోర పరాజయం వైపు వెళుతున్నానన్న అవగాహనను ముందే కలిగే ఉన్నారా? జరగబోయేదేమిటో తెలిసి కూడా విధిని ఆమె స్వాగతించారా? అది తనకు తను విధించుకున్న శిక్షా? ఎమర్జెన్సీ అనే పాపానికి చేసుకున్న పరిహారమా?

ఇందిరా గాంధీ తర్వాత కూడా మనకు బలమైన పాలకులు వచ్చారు. చక్కటి వస్త్రధారణతో మనల్ని ముగ్ధుల్ని చేసిన అనేకమంది ప్రధానులూ ఉన్నారు. అందరిలోకి ఇందిరా గాంధీ ఒక్కరే ప్రత్యేకమైన వారిగా ఎందుకు నిలిచారు? బహుశా అలా అనిపించడం యవ్వనంలోని జ్ఞాపకాలు జమ చేసుకుని ఉంచుకున్న అవ్యక్త గతానుభూతులు ప్రతిధ్వనించడం వల్లనా? మనోవైజ్ఞానిక నిపుణులు, తత్త్వవేత్తలు దీనికి మెరుగైన వివరణ ఇవ్వగలరనుకుంటాను. నేను చెప్పగలిగింది మాత్రం ఒక్కటే – అలాగని ఏదో చెప్పాలని చెప్పడం కాదు – నేను ఏమనుకుంటానంటే ఆమెలో ఏదో లేకుండానైతే లేదని!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోవద్దా?



కొన్నేళ్ల క్రితం, ప్రిన్స్ అనే చిన్న బ్బాయి లోతైన బోరు బావిలో చిక్కుకున్నప్పుడు, వెలికితీత గురించి భారత మీడియా నాన్‌స్టాప్‌గా నివేదించింది. ఇప్పుడు 40 మంది కార్మికులు చార్‌ధామ్ ప్రాజెక్టు(ఉత్తరాఖండ్)లోని సొరంగంలో వారం రోజులుగా చిక్కుకుని ఉన్నారు. అయినా ఎక్కువ శాతం మీడియా మౌనంగా ఉంది. భద్రతా నియమాలను ఉల్లంఘించి, సొరంగం పనులు చేశారు. నిజంగా ఇండియా మారిపోయింది.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

కారణమేంటి?



ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ (జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే)–5 (నాది కాదు) ప్రకారం, 'మహిళల కన్నా పురుషులు చికెన్, మాంసం, చేపలు తినకుండా ఉండటం తక్కువ'. మొత్తంగా 29 శాతం మహిళలు, 17 శాతం పురుషులు తమను తాము 'శాకాహారులు'గా గుర్తించుకుంటున్నారు. అంటే మహిళలు ఎక్కువ 'పవిత్రులా'? లేదా ఇది వివక్షకు సంబంధించినదా? పరిశోధకులు దీన్ని ఎందుకు అధ్యయనం చేయరు?

– సిల్వియా కర్పగం, వైద్యురాలు

స్వీయ విమర్శ మేలు



ఆధ్యాత్మికత అసలు ఉద్దేశం స్వీయ క్రమశిక్షణ. ఇతరులను విమర్శించే బదులు మనల్ని మనం తరచి చూసుకోవాలి. నా కోపం, నా అనురక్తి, నా గర్వం, నా అసూయ గురించి నేను ఏం చేస్తున్నాను అని ప్రశ్నించుకోవాలి. రోజువారీ జీవితంలో మనం పరిశీలించుకోవాల్సిన విషయాలు ఇవి.

– దలై లామా, బౌద్ధగురువు

అనారోగ్య ప్రపంచం



మనకు అవసరమైన విటమిన్లు, ఖనిజ లవణాలను ఇచ్చే ఆహార వ్యవస్థను క్రిమిసంహారకాలపై ఆధారపడే విషపూరిత ఆహార వ్యవస్థగా మార్చారు. అయినా ఎవరూ దీని గురించి చింతించడం లేదు. ఎందుకు?

– విజయ్ పటేల్, వ్యాఖ్యాత

మిగులుతాయా?



ఇండిగో విమానంలో ప్రయాణించినప్పుడల్లా, సీట్లలోంచి కొంచెం మెత్తను ఎవరో తీసేస్తున్నట్టూ, మునుపటి కంటే సీట్లు చదును అవుతున్నట్టూ అనిపిస్తుంటుంది. బడుల్లోని గట్టి కలప బెంచీల్లా ఎప్పుడు అవుతాయా అని ఎదురు చూస్తున్నా.

– మేఘనాథ్, రచయిత

మానవ శ్రేయోభిలాషి

స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పేరు ప్రఖ్యాతులు గడించిన తెలుగువారు ఎందరో ఉన్నారు. వారిలో డాక్టర్ గరిమెళ్ల నారాయణ ఒకరు. 1933 నవంబర్ 18న ప్రస్తుతం కాకినాడ జిల్లాలోని పెదపూడి మండలం గండ్రేడు గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధులైన తండ్రి సత్యవీరభద్రరావు జంధ్యం తీసేసిన సామాజిక వాది. 1930 ఉప్పు సత్యాగ్రహ ఉద్యమ సమయంలో బ్రిటిష్ పోలీసుల చేత చిక్కినప్పుడు, ఆయన గుప్పెట్లో ఉప్పు ఉంది. ఆ ఉప్పును పడవేయమని పోలీసులు చితకబాదినా ఆ పని చెయ్యలేదు. అటువంటి కుటుంబం నుంచి వచ్చారు నారాయణ.



డా॥ గరిమెళ్ల నారాయణ

ఆయనకు ఫ్రెంచ్ విప్లవం అంటే మక్కువ. భగత్‌సింగ్ అంటే ఎంతో ప్రేమ. సేవాగ్రామ్‌లో గాంధేయ సంస్థలలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల మేనేజ్‌మెంట్ కోర్సు చేసి హైదరాబాద్‌లో 'ఖాదీ గ్రామోద్యోగ్'లో చేరారు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీని వ్యతిరేకించారు. లోకనాయక్ జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించిన 'సంపూర్ణ క్రాంతి విప్లవం' చాలా అవసరమని భావించారు.

నారాయణ కుల నిర్మూలన, భాషల మధ్య సుహృద్భావం; లింగ వివక్ష, అవినీతి వ్యతిరేక, మద్యపాన నిషేధ, అశ్లీల వ్యతిరేక, హరిజన గిరిజన, వికలాంగుల సంక్షేమానికి సంబంధించిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు చాలా అవసరమనే వీరు అరుణా రాయ్‌తో సమాచార హక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. వీరు 'జై మానవ్' ఉద్యమంలో పాల్గొని సమాజం సమూలంగా మారాలి, మరింత ఉన్నతంగా మనిషి ఎదగాలి; ఆ దిశలో మనం యువతను తీర్చిదిద్దాలి అని తపించేవారు! దాదాపు 90 సంవత్సరాలు నిండు జీవితాన్ని గడిపిన గరిమెళ్ళ నారాయణ తన 90వ జన్మదినానికి కాస్త ముందుగా ఇటీవల 2023 అక్టోబర్ 6న ముంబైలో కన్నుమూశారు. నాకు మాత్రం ఆయన ఎన్నో సార్లు చెప్పిన ఓ సంగతి పదే పదే గుర్తుకు వస్తుంది. గాంధీజీ ఎంపిక చేసిన, దండి సత్యాగ్రహంలో పాల్గొన్న 78 మంది బృందం ఫోటోలు ముంబైలోని ఐఐటీలో ఉన్నాయి కానీ, ఒకే ఒక తెలుగు వ్యక్తి ఎర్నేని సుబ్రహ్మణ్యం చిత్రం మాత్రం అందులో లేదట!

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి విశ్రాంత ఉన్నతాధికారి

యుద్ధజ్వాలల్లో బుగ్గి అవుతున్న బాల్యం

అభిప్రాయం



డా॥ మహ్మద్ హసన్

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు బాలలకు ప్రాణ సంకటం అయ్యాయి. రష్యా – ఉక్రెయిన్, హమాస్ – ఇజ్రాయెల్ యుద్ధాలు ఇందుకు తాజా ఉదాహరణలు. పాలస్తీనాలోని 'గాజా' కేంద్రంగా పరిపాలిస్తున్న 'హమాస్' అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా సుమారు ఆరు వేల మోర్టార్ షెల్స్‌ను, రాకెట్లను ప్రయోగించటం వల్ల ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనాపై యుద్ధం ప్రకటించింది. ఈ నెలన్నర రోజుల యుద్ధంలో చిన్నపిల్లలే అధికంగా చనిపోయారు. ఇప్పటి వరకు అధికారికంగా పాలస్తీనా నుండి పది వేల మందికి పైగా మరణించారని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలియజేసింది. అందులో చిన్న పిల్లల మరణాలు సుమారు ఐదు వేలు దాటినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి.

ప్రస్తుతం గాజాలో డెబ్బై ఐదు శాతం భవనాలు పూర్తిగా ధ్వంసం కాగా, యాభై శాతం పైగా పాఠశాల భవనాలు ధ్వంసం అయినట్లు అధికారుల అంచనా. శిబిరాలలోని బాధితులకు తాగునీరు, ఆహారం దొరకక ఆహార నిల్వల కేంద్రాలను లూటీ చేస్తున్నారంటే పరిస్థితి ఎంత హృదయ విదారకంగా ఉందో గమనించవచ్చు. ప్రస్తుతం పాలస్తీనాలోని ఆస్పత్రులు, అంబులెన్సులు, శరణార్థి శిబిరాలు, పాఠశాలలపై బాంబుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం అంతర్జాతీయంగా ఒత్తిడి ఎదుర్కొంటోంది. పత్రికా విలేకరులనూ, ఐక్యరాజ్య సమితి నిర్వహించే శరణార్థి శిబిరాలలో సహాయం చేస్తున్న ఉద్యోగులనూ, స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లను కూడా వదలకుండా బాంబుల వర్షం కురిపిస్తోందంటే ఇజ్రాయెల్ సైన్యం ఎంతటి మానవ విధ్వంసానికి పాల్పడుతోందో అర్థం చేసుకోవచ్చు.



ఈ యుద్ధంలో బాంబుల దాడిలో వికలాంగులుగా మారిన పిల్లల, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల మానసిక స్థితి దారుణంగా మారుతోందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది. యుద్ధం కారణంగా కూలిపోయిన తమ ఇండ్లనూ, అక్కడే వదిలిన పుస్తకాలనూ, వారు ఆడుకున్న ఆట వస్తువులనూ, చనిపోయిన తల్లితండ్రులనూ బడులలోని జ్ఞాపకాలనూ తలచుకుంటూ చాలామంది నిద్రకు దూరమవుతున్నారనీ, చికిత్స పొందేటప్పుడు కూడా అక్కడి హాహాకారాలతో కూడిన దృశ్యాలు చూసి శాశ్వత నిద్రలోకి జారుకొంటున్నారనీ చెబుతున్నారు. బ్రతికున్న పిల్లలు ప్రస్తుతం ప్రత్యక్ష నరకం చూస్తున్నారని యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ అంటున్నారు.

పాలస్తీనా కోలుకోవడానికి కొన్ని దశాబ్దాలు పట్టవచ్చు. చనిపోయిన చిన్నారుల ప్రాణాలను మాత్రం ఎవరూ తిరిగి తీసుకొని రాలేరు. ఆ పిల్లలు ఆ ప్రాంతంలో పుట్టడమే నేరమా? తరగతి గదిలోనో, అమ్మ ఒడిలోనో ప్రశాంతంగా ఆడుకునే పసికూనలు వారు. ప్రస్తుతం గాజాలో 16 ఏళ్లలోపు చిన్నారులు 8 లక్షల దాకా ఉండొచ్చని అంచనా. వారంతా యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న వారే! అంటే భవిష్యత్తులో వారి మానసిక స్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధంలో మరణించిన తల్లితండ్రులను మర్చిపోవటం వారికి అంత సులువైన విషయం కూడా కాదు. భవిష్యత్తులో వారి రక్షణ, పోషణ ఎవరు చూసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది. అలానే పిల్లల్ని కోల్పోయిన తల్లితండ్రులు కూడా మానసికంగా కుంగుబాటుకు లోనయ్యే ప్రమాదం ఉంది.

గాజాలో ఈ నెల రోజుల్లోనే సుమారు 5,500 మంది చిన్నారులు జన్మించినట్లు, ప్రస్తుతం ఆసుపత్రుల్లో 50 వేల మంది గర్భిణులు ఉన్నట్లు 'యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్' వెల్లడించింది. బాలింతలకు పౌష్టికాహారం మాట అటుంచితే రెండు పూటలా తిండి దొరకడం కష్టంగా ఉందనీ, ఈ పరిస్థితుల్లో పుట్టిన శిశువులు భవిష్యత్తులో పౌష్టిక ఆహార లోపాన్నీ, ఇతర రుగ్మతలనూ ఎదుర్కోవాల్సి వస్తుందనీ, అలాగే యుద్ధం ద్వారా వెలువడిన వివిధ రకాల రసాయనాలు కూడా పిల్లలపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉందనీ డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వం కోల్పోయిన ఈ పిల్లలు భవిష్యత్తులో మళ్ళీ హింసాత్మక మార్గం వైపు మళ్ళే అవకాశం కూడా లేకపోలేదని మానసిక విశ్లేషకుల అంచనా. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం ఏం చేయాలనేది ప్రశ్న. ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమింపజేసేలా ప్రపంచ దేశాలు ఇద్దరిపై ఒత్తిడి చేయాలి. వినని పక్షంలో ఆంక్షలు విధించే ఏర్పాటు చేయాలి. అంతర్జాతీయ చట్టాలకు లోబడి పాలస్తీనా వారు, ఇజ్రాయెల్ ప్రభుత్వం కట్టుబడి ఉండేలా ఐక్య రాజ్యసమితి చొరవ తీసుకొని శాంతి స్థాపనకు కృషి చేయాలి. 1947లో ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన 181వ తీర్మానం ప్రకారం ఇజ్రాయెల్ ఆక్రమించిన పాలస్తీనా భూభాగాలను అప్పగించి యథాతథ స్థితిని అమలు చేసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టాలి. ఒక వైపు ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా తన యుద్ధనౌకలను పంపి మరొక వైపు శాంతి చర్చల పేరిట హడావిడి చేయడం దాని ద్వంద్వ నీతికి తార్కాణం.

వ్యాసకర్త రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ı 99080 59234

పరోపకారం

ఓ ఆశ్రమంలో గురువుగారు శిష్యులకు ఈ భూమిపై జన్మించినందుకు ఎంతో కొంత ఇతరులకు ఉపయోపడాలని బోధిస్తూ 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్న మన ప్రాచీన సూక్తిని ఉద్ఘాటించారు.

''నాయనలారా! ప్రకృతిలో ప్రతి జీవీ తాను బతుకుతూ తనకు తెలియకుండానే ఇతర జీవులకు సాయం చేస్తోంది. చెట్లు ఇతర జీవులకు ఆహారాన్ని ఇవ్వడమే కాక నీడనూ ఇస్తున్నాయి. ఆ విధంగా ప్రతి జీవీ సృష్టి మనుగడలో తన వంతు పాత్రను పోషిస్తున్నాయి. కానీ ఆలోచించగలిగిన మనిషి మాత్రం పరోపకారం పట్ల అశ్రద్ధగా ఉంటున్నాడు. ఈ శరీరం పరోపకారార్థానికే అనే నిజాన్ని తెలుసుకుని చేతనైన రీతిలో సాయం చేస్తూ గడిపితేనే జీవితానికో అర్థం, పరమార్థం ఉంటాయి. ఈ విషయంలో మనందరం మయూరధ్వజుని ఆదర్శంగా తీసుకోవాలి.



జ్యోతిర్మయం

ధర్మరాజు అశ్వమేధయాగం చేస్తూ వదిలిన యాగాశ్వాన్ని మయూరధ్వజుడనే రాజు బంధించాడు. అతడు కృష్ణ భక్తుడు. అలాగే గొప్ప పరోపకారి కూడా! అందువల్లనే అతడిని యుద్ధంలో శ్రీకృష్ణార్జునులు ఇరువురూ జయించలేకపోయారు. అతడిని ఎందుకు జయించలేకపోతున్నామని అర్జునుడు కృష్ణుణ్ణి అడిగాడు.

సమాధానంగా మరుసటి రోజు పేద బ్రాహ్మణుని రూపంలోకి మారిన కృష్ణుడు అర్జునుణ్ణి కూడా మారువేషంలో మయూరధ్వజుని దగ్గరకు తీసుకువెళ్లాడు. తన ఆతిథ్యాన్ని స్వీకరించమని మయూరధ్వజుడు వారిని కోరాడు. అప్పుడు అడవిలో ప్రయాణిస్తున్న తన కుమారునిపై దాడి చేసిన పులి సగం శరీరాన్ని తినేసిన తర్వాత అశరీరవాణి వినిపించిందనీ, సగం శరీరం ఎవరిదైనా తీసుకొచ్చి ఆ పులికి పెడితే తన కుమారుడు బతుకుతాడని చెప్పిందనీ కృష్ణుడు అంటాడు. 'ఈ నాటికి కదా ఈ దేహానికి సార్థకత ఏర్పడింది' అని సంతసించి వెంటనే తన భార్యాబిడ్డలను తన శరీరాన్ని రెండు సమాన భాగాలుగా ఖండించమని చెబుతాడు మయూరధ్వజుడు. వారు అలా చేస్తున్న సందర్భంలో ఆ రాజు ఎడమ కన్ను నుంచి నీరు కారడం చూసిన కృష్ణుడు 'బాధపడుతూ దానం చేయడం వల్ల ఫలితం ఉండద'ంటాడు. అందుకు 'నా కుడి భాగం మాత్రమే ఆ పసి బాలుని ప్రాణాలు రక్షించడం కోసం ఉపయోగపడుతోంది. తాను ఉపయోగపడనందుకు ఎడమ భాగం బాధపడుతోంద'ని చెప్పాడు మయూరధ్వజుడు. అర్జునునికి అతడి గొప్పదనం అర్థమయ్యింది. కృష్ణార్జునులు ఇరువురూ నిజరూపం ధరించారు. మయూర ధ్వజుణ్ణి కృష్ణుడు బతికించాడు. అతడు వారికి నమస్కరించి యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు''.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.అష్టమి రా.3.18 వరకు తదుపరి నవమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.10.16 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.4.56 నుండి 6.25 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.09 నుండి 12.57 వరకు, తదుపరి ప.2.24 నుండి 3.12 వరకు, **అమృతఘడియలు:** ప.12.31 నుండి 2.01 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.09, **సూర్యాస్తమయం:** 5.21.

క్లుప్తంగా...

కనుల పండువగా గుడికట్ల సంబరాలు



అనంతపురం టౌన్: కురుబల గుడికట్ల సంబరాలు ఆదివారం అనంతపురంలో కనుల పండువగా జరిగాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన 250 మంది గుడికట్ల బీరప్పస్వాములతో అనంతపురం నగరంలోని టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో బీరప్ప స్వాములను కొలువు దీర్చి వారిపై బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కురుబలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆరాధ్య దైవాలైన బీరప్ప స్వాములను ఒకే వేదికపై దర్శించుకుని తరించారు. సంబరాలకు పలువురు ప్రజాప్రతినిధులతో పాటు కురుబ సంఘం నాయకులు హాజరయ్యారు.

30 మంది ఎర్రచందనం కూలీలు అరెస్టు

చీమకుర్తి: తమిళనాడుకు చెందిన 30 మంది ఎర్రచందనం కూలీలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో అరెస్ట్ చేశారు. తమిళనాడు, చిత్తూరు సరిహద్దుల్లో ఎర్రచందనం కూలీలను తమిళనాడు పోలీసులు వెంబడించడంతో వారు రైలెక్కి ఒంగోలులో దిగారు. పోలీసులు వెంటాడుతున్న విషయం గమనించి లారీని బాడుగకు తీసుకుని సంతనూతలపాడు వైపు వచ్చారు. తిరుపతికి చెందిన టాస్క్‌ఫోర్స్ ఎస్సై వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడు మెయిన్ రోడ్డులో స్పీడ్‌బ్రేకర్ వద్ద లారీ స్లో కావడంతో కూలీలను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో కొంతమంది కూలీలు పారిపోగా, 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తిరుపతి తీసుకెళ్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై వినోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అంగరంగ వైభవంగా పుష్పయాగం



తిరుమలలో పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు

తిరుమల/తిరుచానూరు(చంద్రగిరి): తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తీక మాసం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని పుష్పయాగ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమలలోని కల్యాణ వేదిక వద్ద గల ఉద్యానవన విభాగంలో ముందుగా పుష్పాలకు ప్రత్యేక పూజలు జరిపారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, అధికారులు పుష్పాలను ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకువచ్చారు. తొలుత ఉదయం 9 నుంచి 11 గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శోభాయమానంగా పుష్పయాగం జరిపారు. ఇందుకోసం 17 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలను వినియోగించారు. తమిళనాడు నుంచి నాలుగు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి రెండు టన్నులు కలిపి మొత్తం ఎనిమిది టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారు. అలాగే తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆదివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. పుష్పయాగానికి వివిధ రాష్ట్రాల నుంచి దాతలు సుమారు నాలుగు టన్నుల పుష్పాలను సమకూర్చినట్లు టీటీడీ ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

భర్తను వదిలేసి ప్రియుడితో కాపురం

- తమతో కలిసి ఉండాలని భార్య షరతు..
- మనస్తాపంతో భర్త ఆత్మహత్య

ముదిగొండ: కట్టుకున్న భార్య ఇంకొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుని వేరు కాపురం పెట్టడమేకాక.. భర్తనూ తమతో పాటు కలిసి ఉండాలని షరతు విధించింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన గుండాల వంశీ (29)కి ఐదేళ్ల క్రితం మండలంలోని గోకినేపల్లికి చెందిన యువతితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు జన్మించాక, సదరు మహిళ ఇంకో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని వేరుగా ఉంటోంది. పలుమార్లు హెచ్చరించినా ప్రియుడిని విడిచిపెట్టలేనని చెప్పిన ఆమె, భర్తనూ తమతో కలిసి ఉండాలని సూచించింది. దీంతో మనస్తాపానికి గురైన వంశీ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తీసుకున్న సెల్ఫీ వీడియోను వాట్సాప్‌లో పంపించడంతో విషయం ఆదివారం బయటపడింది. మృతుడి తండ్రి గుండాల శివయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ముదిగొండ ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

పగటి పూటా ఓ కునుకేయండి



మధ్యాహ్నం వేళ 15 నుంచి 30 నిమిషాల నిద్రతో ఆరోగ్యానికి ఎంతో మేలు

- వృద్ధాప్య ఛాయలు ఏడేళ్ల వరకు తగ్గింపు
- లండన్ వర్సిటీ, ఉరుగ్వే వర్సిటీ పరిశోధనల్లో వెల్లడి
- నిద్ర లేమితో అల్జీమర్స్, చిత్త వైకల్యం వచ్చే ప్రమాదం
- అధిక నిద్రతోనూ అనారోగ్య సమస్యలు

సాక్షి, అమరావతి: చక్కటి నిద్ర దివ్యౌషధంగా పని చేస్తుంది. అందులోనూ పగటిపూట తీసే చిన్నపాటి కునుకు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రోజూ మధ్యాహ్నం 15–30 నిమిషాలు రెప్పవాల్చితే చిత్తవైకల్య ప్రమాదం తగ్గడంతో పాటు వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరవని తాజా అధ్యయనంలో వెల్లడైంది. సాధారణ వ్యక్తులతో పోలిస్తే పగటిపూట నిద్రించే వారిలో 2.6–7 సంవత్సరాల వరకు వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. యూనివర్సిటీ కాలేజ్ లండన్, ఉరుగ్వేలోని యూనివర్సిటీ ఆఫ్ రిపబ్లిక్ పరిశోధకులు క్రమం తప్పకుండా పగటిపూట నిద్రపోవడం వల్ల మెదడు కుచించుకుపోయే ప్రమాదాన్ని తగ్గిస్తుందని.. చురుకుదనాన్ని ప్రేరేపిస్తుందని తేల్చారు. ఫలితంగా జ్ఞాన సామర్థ్యం, జ్ఞాపక శక్తి పెరుగుతాయని గుర్తించారు. అయితే.. పగటిపూట 90 నిమిషాల కంటే ఎక్కువసేపు నిద్రపోవడం ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి 7 గంటల నిద్ర

సంపూర్ణ ఆరోగ్యానికి సుమారు 7 గంటల మంచి నిద్రను శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు ప్రతిపాదిస్తున్నారు. ఇందుకు విరుద్ధంగా భారత్‌లోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలో నిద్ర లేమితో బాధపడుతున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిద్ర లేకపోవడం వల్ల కలిగే సమస్య కేవలం అలసట ఒక్కటే కాదని.. తీవ్ర దీర్ఘకాలిక అనారోగ్యానికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. రాత్రిపూట కలతలేని నిద్రతో అలసట, తలనొప్పి, మూడ్ స్వింగ్స్ నియంత్రణలో ఉండి మానసిక ఉత్సాహంతో పని చేస్తారని చెబుతున్నారు. అయితే.. తక్కువ నిద్రపోయే వారిలో అల్జీమర్స్ వచ్చే అవకాశం 40 శాతం ఎక్కువని అధ్యయనం వెల్లడించింది.

అతి నిద్ర ప్రమాదకరం

తక్కువ నిద్రతోనే కాదు.. అతి నిద్రతోనూ ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు చెబుతున్నారు. రోజంతా అదే పనిగా నిద్రపోతే అధిక రక్తపోటు, స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తేల్చారు. అతి నిద్ర అంతర్లీన నిద్ర రుగ్మతకు సంకేతమని భావిస్తున్నారు. ఈ రుగ్మతతో ఒత్తిడి, బరువును నియంత్రించే హార్మోన్లపై ప్రభావం చూపుతుందని తేల్చారు. ఫలితంగా చిన్న వయసులోనే ఊబకాయం, బీపీ, టైప్–2 డయాబెటిస్, గుండె జబ్బులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్క్రీనింగ్ సమయంతోనే ముప్పు

స్క్రీనింగ్ సమయం నిద్రలేమి స్థాయిని పెంచుతుందని అధ్యయనం చెబుతోంది. నిద్రలేమితో బాధపడే వారిలో దాదాపు 54 మంది డిజిటల్, సోషల్ మీడియాను విరివిగా వినియోగిస్తున్నట్టు గుర్తించింది. దాదాపు 87 శాతం మంది భారతీయులు పడుకునే ముందు తమ ఫోన్లను ఉపయోగిస్తుండటంతో తీవ్రమైన నిద్ర సమస్యకు దారి తీస్తుందని పేర్కొంది. ఫలితంగా 56 శాతం మంది పురుషులతో పోలిస్తే 67 శాతం మంది మహిళలు పని సమయంలో నిద్రపోతున్నారని వెల్లడించింది. వీలైనంత వరకు మధ్యాహ్నం 2 గంటలలోపు కెఫిన్ ఉండే పదార్థాలను తగ్గించాలని.. మద్యం తాగి నిద్రపోవడం/నిద్రపోయే మూడు గంటల ముందు మద్యం తీసుకోవడం కూడా ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు. ముఖ్యంగా నిద్రవేళకు దగ్గర సమయంలో వ్యాయామం చేయడం కూడా నిద్రలేమికి కారణంగా భావిస్తున్నారు.

మైక్రోప్లాస్టిక్‌పై ప్రత్యక్ష పరిశోధన

- ఇందుకోసం ఆంధ్రా యూనివర్సిటీలో ప్రత్యేక శిక్షణ
- సహకారం అందిస్తున్న యూరోపియన్ కమిషన్
- సముద్ర జీవుల్లో భారీ ఎత్తున మైక్రో ప్లాస్టిక్ గుర్తింపు



శిక్షణ పొందుతున్న పరిశోధకులు, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ప్రపంచాన్ని కలవరపెడుతున్న అంశాల్లో ప్లాస్టిక్ కూడా ఒకటి. ఇప్పటి దాకా కంటికి కనిపించే ప్లాస్టిక్ ఒక ఎత్తయితే, కనిపించని సూక్ష్మ కణాలుగా మారిన మైక్రో ప్లాస్టిక్ మరింత భయపెడుతోంది. దీనికి కారణం సముద్రాలు సూప్ ఆఫ్ మైక్రోప్లాస్టిక్స్‌గా మారడమే. ఏళ్ల తరబడి పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులు సూక్ష్మ కణాలుగా విభజన చెంది, జలచరాల శరీరంలో చేరుతున్నాయి. సీఫుడ్‌ను మానవులు పెద్ద ఎత్తున ఆహారంగా తింటున్న క్రమంలో మైక్రో ప్లాస్టిక్ క్రమేణా మానవుల శరీరాల్లోకి కూడా వచ్చి చేరుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం, యూరోపియన్ కమిషన్ సహాయంతో పరిశోధనలు చేపట్టింది.

విస్తృత పరిశోధనకు శిక్షణ

ఈ పరిశోధనల్లో భాగంగా సముద్ర జీవుల్లో చేరే మైక్రో ప్లాస్టిక్‌ను గుర్తించడం, గణించడం, అధ్యయనం చేయడం ప్రధానంగా జరుగుతోంది. ఈ రంగంలో నిపుణులను తయారు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం శిక్షణ ఇచ్చేందుకు ఆంధ్రా యూనివర్సిటీ 50మందిని ఎంచుకుంది. విశ్వవిద్యాలయం పరిశోధకులు, అధ్యాపకులు, మత్స్య శాఖ సిబ్బంది, అధికారులు, జీవీఎంసీ అధికారులను భాగస్వాముల్ని చేసింది.

ప్రత్యక్ష నైపుణ్య శిక్షణ

అయితే ఈ శిక్షణను ఏయూ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తోంది. కేవలం పాఠాలకే పరిమితం కాకుండా ప్రత్యక్ష నైపుణ్య శిక్షణతో ప్రతి ఒక్కరిలో దీనిపై విస్తృత అవగాహన ఏర్పడుతోంది. మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండు రకాల చేపల్లో మైక్రో ప్లాస్టిక్స్‌ని అధ్యయనం చేశారు. ఐదు మైక్రాన్స్ కంటే తక్కువ మందం కలిగిన సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు సముద్రపు నీటిలో, ఇసుకలో, చేపల్లో ఉండటాన్ని ఈ శిక్షణలో ప్రత్యక్షంగా అధ్యయనం చేశారు.

చేపల శరీర భాగాల్లో మైక్రోప్లాస్టిక్ గుర్తింపు

నాచుపై చేరినప్పుడు చేపలు తినడంతో నాచు, మైక్రోప్లాస్టిక్ వాటి శరీరంలోని లివర్, కిడ్నీ, పేగుల్లో పెద్ద ఎత్తున చేరుతోంది.

మూడు అంశాలపై శిక్షణ

సేకరించిన సముద్రపు నీటిని వడబోసి, వ్యర్థాలను వేరుచేసి ఫొరియర్ ట్రాన్స్‌ఫామ్ ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రోస్కోపీ (ఎఫ్‌టీఐఆర్) సహాయంతో మైక్రోప్లాస్టిక్ పరిమాణాన్ని గణిస్తారు. ఇసుకలో ఉన్న మైక్రోప్లాస్టిక్‌ను ఇలాగే గణిస్తారు. చేపల్లో గుర్తించేందుకు శరీర భాగాలను వేరుచేసి జీవ పదార్థం జీర్ణమయ్యేలా రసాయనాల ప్రక్రియ చేపడుతున్నారు. మిగిలిన పదార్థాలను ఎండబెట్టి ఎఫ్‌టీఐఆర్‌లో పరీక్షిస్తారు. అయితే ప్రజలు ఎక్కువగా తింటున్న పండుగప్ప, కవ్వళ్ల చేపలతో ఈ ప్రయోగం చేయగా, లివర్, కిడ్నీల్లో పెద్ద ఎత్తున మైక్రో ప్లాస్టిక్‌ను గుర్తించారు.

మంచి ఆలోచన



ఎంఎల్ఆర్ విభాగంలో మూడు రోజుల శిక్షణ మంచి ఆలోచన. వర్తమాన సమస్యల్లో ఇది ప్రధానమైన అంశం. మైక్రోప్లాస్టిక్ ప్రమాదం అన్ని జీవులపై ఉంటుంది. సముద్ర జీవుల్లో ఈ అధ్యయనం ఎంతో అభినందనీయం.

– డాక్టర్ వి.హేమ శైలజ, ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగం

విలువైన సమాచారం



మూడు రోజుల శిక్షణలో విలువైన సమాచారం, జ్ఞానం పొందాం. నిపుణుల ప్రసంగాలు, ప్రత్యక్ష శిక్షణ ఎంతో ఉపయోగపడ్డాయి. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

– డాక్టర్ జి.శ్రావణ్ కుమార్, అధ్యాపకులు, జీవీపీ కళాశాల

కమిషన్ సహకారం మరువలేం



యూరోపియన్ కమిషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్నాం. సమాజ ఉపయుక్త అంశంలో పరిశోధన చేపట్టాలని యూరోపియన్ యూనియన్ సూచించిన విధంగా పరిశోధనలు చేస్తున్నాం. అదే సమయంలో కొంత మందికి శిక్షణ ఇస్తూ అవగాహన పెంచుతున్నాం.

– ఆచార్య పి.జానకీరామ్, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్

బిగ్ స్క్రీన్‌ల వద్ద క్రీడాభిమానులు






భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగిన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు విజయవాడ, విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్స్ వద్ద క్రీడాభిమానుల కేరింతలు

బెరైటీస్ ఎగుమతుల జోష్

విదేశాలకు ఎగుమతుల్లో కొనసాగుతున్న ఏపీఎండీసీ హవా

- అమెరికా మార్కెట్‌లో మరింత పెరిగిన వాటా
- 44శాతం నుంచి 54శాతానికి పెరుగుదల
- ప్రపంచంలో ఏ దేశానికి దక్కని ఇంత వాటా
- రూ.900కోట్ల నుంచి రూ.1,300కోట్లకు పెరిగిన ఆదాయం
- మంగంపేట బెరైటీస్‌కు ఫుల్ డిమాండ్



సాక్షి, అమరావతి: బెరైటీస్ ఎగుమతుల్లో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) హవా కొనసాగుతోంది. ప్రపంచంలో ఏ సంస్థ చేయని విధంగా అమెరికాకు బెరైటీస్ ఎగుమతి చేస్తున్న ఏపీఎండీసీ... ప్రతి సంవత్సరం గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. అమెరికా(యూఎస్ఏ) బెరైటీస్ మార్కెట్‌లో రెండేళ్ల కిందట ఏపీఎండీసీ వాటా 30 శాతం కాగా, గత ఏడాది 44 శాతానికి పెరిగింది. ఈ ఏడాది ఏకంగా 54 శాతానికి చేరింది. తాజాగా ఈ విషయాన్ని అంతర్జాతీయ బెరైటీస్ అసోసియేషన్ ప్రకటించింది. అమెరికా మార్కెట్‌లో ఒక దేశంగానీ, సంస్థగానీ ఇంత శాతం మార్కెట్‌ను చేజిక్కించుకోవడం ఇదే ప్రథమం అని తెలిపింది. గతంలో అమెరికాకు 60శాతానికి పైగా బెరైటీస్‌ను చైనా ఎగుమతి చేసేది. అయితే 2015 నుంచి చైనా ఎగుమతులు క్రమంగా తగ్గుతూ ఉండగా, మన దేశం నుంచి పెరుగుతూ వచ్చాయి. ఇప్పుడు మన బెరైటీస్ పైనే అమెరికా మార్కెట్ ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. మన దేశం నుంచి ఎగుమతయ్యే బెరైటీస్‌లో 90శాతానికి పైగా వైఎస్సార్ జిల్లా మంగంపేట గనుల నుంచే ఉత్పత్తి అవుతోంది.

ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం కృషి

బెరైటీస్‌కు అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి, మార్కెటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలను కొత్తగా నిర్దేశించుకుంది. మంగంపేట బెరైటీస్‌కు అంతర్జాతీయ బ్రాండింగ్ తీసుకువచ్చేందుకు అమెరికాలోని పలు చమురు ఉత్పత్తి సంస్థలతో ఏపీఎండీసీ ద్వారా ఒప్పందాలు చేసుకుంది. గతంలో కొన్ని ప్రైవేటు ఏజెన్సీల ద్వారా బెరైటీస్‌ను అంతర్జాతీయ మార్కెట్‌కు విక్రయించేది. బెరైటీస్ అవసరం ఉన్న చమురు సంస్థలకే నేరుగా ఖనిజాన్ని విక్రయించేందుకు ఏపీఎండీసీ ద్వారా ఒప్పందం చేసుకోవడం ద్వారా ప్రభుత్వం మార్కెటింగ్ వ్యూహాన్ని మార్చుకుంది. గత ప్రభుత్వంలో ఉన్న ఎగుమతుల ఒప్పందాన్ని ఏడాది నుంచి మూడేళ్లకు పొడిగించింది. ఒకసారి ఒప్పందం చేసుకుంటే మూడేళ్లు స్థిరంగా ఎగుమతులు చేసే అవకాశాన్ని సృష్టించింది. గత ఏప్రిల్‌లో 25శాతం ధర పెంచినా ఎగుమతులపై ఎటువంటి ప్రభావం చూపలేదు. దీంతో చైనా, మెక్సికో, మొరాకో వంటి బలమైన పోటీదారులను కూడా దాటి అత్యధిక శాతం వాటాను ఏపీ దక్కించుకుంది. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరంలో 3 మిలియన్ టన్నుల బెరైటీస్ ఉత్పత్తి లక్ష్యాన్ని పెట్టుకుని సాధించింది. గత సంవత్సరం బెరైటీస్‌పై ఏపీఎండీసీకి రూ.900 కోట్ల ఆదాయం రాగా, ఈ సంవత్సరం రూ.1,300 కోట్లకు పెరిగింది. తాజా వ్యూహాలతో డిమాండ్ లేని సీ, డీ గ్రేడ్ బెరైటీస్ ఖనిజానికి సైతం డిమాండ్ ఏర్పడింది.

సరికొత్త మార్కెటింగ్ వ్యూహాలతో మంచి ఫలితాలు



బెరైటీస్ ఎగుమతులకు సంబంధించి గతంలో అమలు చేసిన వ్యూహాన్ని మార్చుకుని కొత్తగా ముందుకెళ్లడం ద్వారా మంచి ఫలితాలు సాధించాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గనులు, ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాల వల్లే ఇది సాధ్యమైంది. అంతర్జాతీయ బెరైటీస్ మార్కెట్‌లో ఏపీఎండీసీ అగ్రస్థానంలో నిలవడం ఎంతో ముఖ్య పరిణామం.

– వీజీ వెంకటరెడ్డి, వీసీ అండ్ ఎండీ, ఏపీఎండీసీ

అత్యంత నాణ్యత

అన్నమయ్య జిల్లా మంగంపేటలో బెరైటీస్ నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. ఇక్కడ లభిస్తున్న గ్రే బెరైటీస్ ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైనదిగా గుర్తింపు పొందింది. మన దేశంలో ఉన్న బెరైటీస్ నిక్షేపాల్లో 98శాతం మంగంపేటలోనే ఉండటం విశేషం. మంగంపేటలో గనుల్లో సుమారు 74 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా సుమారు 30దేశాలకు బెరైటీస్ ఎగుమతి అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు, సహజవాయువు ఉత్పాదక కంపెనీలకు మంగంపేట నుంచి వెళ్లే బెరైటీస్ వాటా 25 శాతంగా ఉంది. చమురు, సహజవాయువుల రంగానికి బెరైటీస్ అత్యంత కీలకం కావడం, అతి తక్కువ దేశాల్లో మాత్రమే ఇది దొరకడంతో అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

- నిర్వహించిన వ్రతాలు 5,200
- సమకూరిన ఆదాయం రూ.60 లక్షలు
- వ్రతమాచరించిన మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ దంపతులు



నిత్యకల్యాణ మండపంలో స్వామివారి వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 60 వేల మంది తరలిరావడంతో రత్నగిరిపై వ్రత మండపాలు, ఆలయ ప్రాంగణం, దర్శనం క్యూ లైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజామున 4 గంటలకు సత్యదేవుని ఆలయం తెరచి, వ్రతాలు ఆచరించేందుకు, స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. అప్పటి నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సత్యదేవుని వ్రతాలు సుమారు 5,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో రామచంద్ర మోహన్ దేవస్థానంలోని పలు విభాగాలను సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్తీక సోమవారం పర్వదినం కావడంతో నేడు కూడా రత్నగిరిపై తీవ్ర రద్దీ నెలకొనే అవకాశం ఉంది. సుమారు 80 వేల మందికి పైగా భక్తులు రత్నగిరికి వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ సతీసమేతంగా ఆదివారం వచ్చారు. సత్యదేవుని వ్రతమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘన స్వాగతం పలికారు.

భారత్ ఓటమిని జీర్ణించుకోలేక అభిమాని మృతి



జ్యోతికుమార్ యాదవ్ (ఫైల్)

తిరుపతి రూరల్: ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్స్‌లో ఇండియా ఓటమిని జీర్ణించుకోలేక తిరుపతిలో క్రికెట్ అభిమాని జ్యోతికుమార్ యాదవ్ (35) గుండెపోటుతో మృతి చెందాడు. తిరుపతి మండలం దుర్గసముద్రానికి చెందిన జ్యోతికుమార్ యాదవ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. టీమిండియా ఓటమి చెందటంతో క్రికెటర్ రోహిత్ శర్మ కన్నీటితో గ్రౌండ్ నుంచి వస్తున్న దృశ్యాలను చూస్తూ చలించిపోయాడు. ఆకస్మాత్తుగా గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. స్నేహితులు అతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. క్రికెట్ అంటే విపరీతంగా అభిమానించే జ్యోతికుమార్ యాదవ్ మృతి పట్ల గ్రామస్తులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. జ్యోతికుమార్ యాదవ్ మృతి పట్ల ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి సంతాపం తెలిపారు.

ప్రియుడిపై మోజు.. భర్త హత్య

- తొలుత అదృశ్యమయ్యాడంటూ భార్య ఫిర్యాదు
- పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ షేక్ గఫూర్

యలమంచిలి(అనకాపల్లి రూరల్): ప్రియుడి మోజులో కట్టుకున్నవాడిని ఓ మహిళ హత్య చేయించింది. ఆనక ఏమీ ఎరగనట్టు అదృశ్యమయ్యాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానం వచ్చిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా నిజాలు బయటపడ్డాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధికి చెందిన తాడేల కొండలరావు(49)కు 20 ఏళ్ల కిందట యలమంచిలి మండలం పులపర్తికి చెందిన ఉమ(36)తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొండలరావు ప్రైవేటు కాంట్రాక్టరు వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. 2021లో ఉమకు తుని సమీపంలోని సూరవరం గ్రామానికి చెందిన ప్రగడ చిరంజీవి (38)తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. ఇది తెలుసుకున్న కొండలరావు భార్యను మందలించాడు. దీంతో అతడిని కడతేర్చాలని ప్రియుడితో పథకం వేయించి, చిరంజీవి స్నేహితుడు, సూరవరానికి చెందిన సాయిదుర్గ(23)తో కలిసి భర్తను హత్య చేయించింది.

ఇలా హత్య... ఈనెల 7వ తేదీన చిరంజీవి, అతని స్నేహితుడు సాయి దుర్గ కారులో పులపర్తి వచ్చారు. విశాఖలో కుమారుడిని చూసి రమ్మని భర్తకు చెప్పిన ఉమ... ఇందుకోసం తన స్నేహితుడి కారు వస్తుందంటూ స్కూటీపై కొండలరావును పులివర్తి హైవే వద్దకు తీసుకొచ్చింది. కారులో విశాఖ వెళ్లిన వీరు, తిరిగి వస్తూ దార్లో కొండలరావుకు పూటుగా మద్యం తాగించారు. ఈక్రమంలోనే తుని సమీపంలోని రాజుల కొత్తూరు వద్ద చిరంజీవి, సాయిదుర్గ గొడవపడుతున్నట్టు నటించి, కొండలరావుపై దాడి చేసి హత్య చేశారు. ఈ నెల 8న మృతదేహాన్ని గోదావరిలో పడేశారు. ఈ నెల 12న భర్త అదృశ్యమైనట్టు ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉమ వ్యవహార శైలిపై అనుమానం కలిగిన వారు ఆ దిశగా విచారణ చేపట్టగా అక్రమ సంబంధం బయటపడింది. చిరంజీవిని, సాయిదుర్గను గుర్తించి విచారణ చేయగా ఎట్టకేలకు వారు నేరం అంగీకరించారు. రావులపాలెం సమీపంలోని గౌతమి వంతెన వద్ద శనివారం కొండలరావు మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మొదట అదృశ్యం కేసు నమోదు చేయగా, దాన్ని హత్య కేసుగా మార్చారు. చిరంజీవి, సాయిదుర్గ, కొండలరావు భార్య ఉమను అరెస్టు చేసి, ఆదివారం యలమంచిలి కోర్టులో హాజరు పరిచారు. నిందితులను రిమాండ్ నిమిత్తం విశాఖ తరలించారు.

శ్రీపీఠం.. భక్తజనసంద్రం

కాకినాడ రూరల్: మహాశక్తియాగం జరుగుతున్న కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం భక్తజనసంద్రంగా మారుతోంది. ఈ మహాయాగానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ పర్యవేక్షణలో ఈ యాగం ఈ నెల 14న ప్రారంభమైన విషయం తెలిసిందే. యాగంలో భాగంగా అష్టాదశ శక్తి పీఠాల్లో కొలువై ఉన్న ఆదిపరాశక్తిని ఒకేచోట మహాశక్తిగా ఆవిష్కరించే అద్భుత ఘట్టంగా శతకోటి లలితా కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. రోజూ 10 వేల నుంచి 12 వేల మందితో నెల రోజుల పాటు కుంకుమార్చనలు నిర్వహించాలని తలపెట్టారు. అయితే 15 వేలకు మందికి పైగా మహిళలు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. యాగం ఆరో రోజైన ఆదివారం యాగశాలలో ఉదయం నక్షత్ర పూజ, తిథి దేవత పూజ నిర్వహించారు. అనంతరం జరిగిన లలితా కుంకుమార్చనలకు పెద్ద సంఖ్యలో మహిళలతో పాటు పురుషులు కూడా హాజరయ్యారు. మూడుసార్లు లలితా నామార్చనలతో కుంకుమార్చనలు చేశారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. దీనికోసం వలంటీర్లు శ్రమిస్తున్నారు. దీపోత్సవ వేదికపై సాయంత్రం శోభారాజ్ బృందం ఆలపించిన కర్నాటక సంగీతం శ్రోతలను అలరించింది. పార్వతీ పరమేశ్వరులను పల్లకీ సేవతో ఊరేగింపుగా దీపోత్సవ వేదిక వద్దకు తీసుకువచ్చిన అనంతరం పరిపూర్ణానంద స్వామి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భక్తుల చేతులు మీదుగా దీపోత్సవం చేశారు. దీపకాంతులతో శ్రీపీఠం వెనుక ఉన్న గోశాల ప్రాంగణం వెలుగులతో నిండిపోయింది.

క్లుప్తంగా...

ఇంఫాల్ విమానాశ్రయంలో డ్రోన్ల కలకలం

ఇంఫాల్: గగనతలంలో డ్రోన్లు ఆదివారం మణిపూర్ రాజధాని ఇంఫాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కలకలం సృష్టించాయి. రెండు గుర్తు తెలియని వస్తువులు మధ్యాహ్నం 2.30 నుంచి నాలుగింటి దాకా రన్‌వే పరిసరాల్లో ఎగురుతూ కన్పించినట్టు అధికారులు తెలిపారు. దాంతో ముందుజాగ్రత్త చర్యగా విమానాశ్రయాన్ని మూసేశారు. విమానాల రాకపోకలను కూడా నిలిపేశారు. రెండు విమానాలను దారి మళ్లించగా అక్కణ్నుంచి బయల్దేరాల్సిన మూడు విమానాలు ఆలస్యమయ్యాయి. మూడు గంటల విరామం అనంతరం సేవలను పునరుద్ధరించారు. తూర్పున మయన్మార్‌తో మణిపూర్ అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటుంది.

పాక్‌కు సాయం ఆపండి

బైడెన్‌కు అమెరికా కాంగ్రెస్ సభ్యుల విజ్ఞప్తి

ఇస్లామాబాద్: అమెరికా అందిస్తున్న భారీ ఆర్థిక సాయాన్ని మానవ హక్కుల ఉల్లంఘనకు పాకిస్తాన్ వినియోగిస్తోందని యూఎస్ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పాక్‌లో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగి రాజ్యాంగబద్ధమైన రీతిలో ప్రభుత్వం ఏర్పాటయ్యేదాకా ఆ దేశానికి ఎలాంటి ఆర్థిక సాయమూ అందించొద్దని అధ్యక్షుడు జో బైడెన్‌కు విజ్ఞప్తి చేశారు. ఇలాన్ ఒమర్‌తో పాటు మరో 10 మంది కాంగ్రెస్ సభ్యులు ఈ మేరకు అమెరికా విదేశాంగ మంత్రి అంటోనీ బ్లింకెన్‌కు లేఖ రాశారు. దైవ దూషణ చట్టాన్ని మరింత కఠినతరం చేయడం తదితర చర్యలకు పాక్ పాల్పడుతున్న వైనాన్ని అందులో ప్రస్తావించారు. ''ఇవన్నీ పాక్‌లోని మతపరమైన మైనారిటీలను మరింతగా అణచివేసేందుకు తీసుకుంటున్న చర్యలే. ఎందుకంటే దైవదూషణ బిల్లును పాక్ పార్లమెంటు ఆమోదించిన కొద్ది రోజులకే మతోన్మాద మూకలు చర్చిలను ధ్వంసం చేయడంతో పాటు క్రైస్తవుల ఇళ్లకు నిప్పు పెట్టాయి'' అంటూ వారు ఆందోళన వెలిబుచ్చారు.

విమాన టికెట్ కంటే ఎక్కువా?

రైలు చార్జీలపై మమత ధ్వజం

కోల్‌కతా: రైళ్లలో డైనమిక్ ప్రైసింగ్‌ను తక్షణం ఉపసంహరించాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆదివారం డిమాండ్ చేశారు. పండుగలు తదితర రద్దీ సందర్భంగా గత వారం దేశవ్యాప్తంగా పలు రూట్లలో రైలు టికెట్ల ధరలు విమాన టికెట్లను కూడా మించిపోతున్నాయని విమర్శించారు. ఇలాగైతే అత్యవసర పరిస్థితిలో రైల్లో ప్రయాణించాల్సిన వారి గతి ఏమిటని ఆమె ప్రశ్నించారు. డైనమిక్ ప్రైసింగ్‌ను తక్షణం రద్దు చేయడంతో పాటు ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మమత గతంలో రైల్వే మంత్రిగా కూడా చేయడం తెలిసిందే. రైలు టికెట్లకు డైనమిక్ ప్రైసింగ్‌ను 2016లో రైల్వే శాఖ ప్రవేశపెట్టింది. ఛత్ పూజ తదితరాల నేపథ్యంలో బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని పలు ముఖ్య నగరాలకు రైలు టికెట్ల ధరలు విమాన టికెట్లను కూడా మించినట్టు వార్తలొచ్చాయి.

పంజరంలో చిలుకలా ఈసీ: రౌత్

ముంబై: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికల సంఘం కూడా పంజరంలో చిలుకలా మారిందని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. అన్ని విషయాల్లోనూ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. ''ఉచితంగా అయోధ్య రామ మందిర దర్శనం కల్పిస్తామని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదేపదే చెబుతున్నా ఈసీ పట్టించుకోవడం లేదు. అదే హామీ విపక్షాలు ఇస్తే వెంటనే షోకాజ్ నోటీసులిచ్చేది'' అంటూ పార్టీ పత్రిక సామ్నాకు రాసిన వ్యాసంలో రౌత్ విమర్శించారు. మోదీ హయాంలో భారత క్రికెట్ పూర్తిగా ఆయన స్వరాష్ట్రం గుజరాత్‌కు తరలిపోయిందని ఆరోపించారు. ''గతంలో దేశ క్రికెట్‌కు ముంబై ప్రధాన కేంద్రంగా ఉండేది. ఇప్పుడంతా అహ్మదాబాద్‌మయం! ప్రపంచ కప్ ఫైనల్ కూడా అక్కడే జరుగుతోంది! స్వీయ రాజకీయ లబ్ధి కోసం చివరికి క్రికెట్‌ను కూడా కూడా మోదీ సర్కారు పొలిటికల్ ఈవెంట్‌గా మార్చేసింది'' అని ఎద్దేవా చేశారు.

లంచం తీసుకున్నట్టు నిరూపిస్తే... రాజకీయాలకు గుడ్‌బై

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: ప్రభుత్వ శాఖల్లో పోస్టింగులు, బదిలీల్లో తన కుమారుడు యతీంద్ర భారీగా లంచాలు తీసుకున్నారన్న జేడీ(ఎస్)చీఫ్ హెచ్‌డీ కుమారస్వామి ఆరోపణలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం తీవ్రంగా ఖండించారు. తాను గానీ, యతీంద్ర గానీ లంచాలు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. లంచాలు తీసుకున్న చరిత్ర కుమారస్వామిదేనని ఎద్దేవా చేశారు. ఆయన హయాం పొడవునా అలాంటి వ్యవహారాలే జరిగాయని ఆరోపించారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సిద్ధరామయ్య-యతీంద్ర ఫోన్ సంభాషణ పోస్టింగులు, బదిలీల్లో లంచాల గురించేనని కుమారస్వామి ఆరోపిస్తుండటం తెలిసిందే. యతీంద్ర సూపర్ సీఎంగా మారారంటూ ఆయన మండిపడ్డారు.

మధ్యప్రదేశ్‌లో 77.15% పోలింగ్

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తుది పోలింగ్ శాతం 77.15 శాతమని కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం పేర్కొంది.2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇది 1.52 శాతం ఎక్కువ. రాష్ట్రంలో 230 అసెంబ్లీ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. 2018లో బీజేపీకి 41.02 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 40.89 శాతమే వచ్చాయి.



అల్ షిఫా ఆస్పత్రి నుంచి తరలించిన అనంతరం రఫాలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

అల్–షిఫా నుంచి 31 మంది శిశువుల తరలింపు

ఈజిప్టుకు తరలించి, మెరుగైన చికిత్స అందిస్తాం: గాజా ఆరోగ్య శాఖ

బందీల విడుదలకు హమాస్‌తో ఖతార్ ప్రతినిధుల చర్చలు

ఖాన్ యూనిస్: అల్–షిఫా ఆసుపత్రిలోని హృదయ విదారక దృశ్యాలు ప్రపంచాన్ని కదిలించాయి. ఇజ్రాయెల్ నిర్బంధంలో ఉన్న ఆ ఆసుపత్రిలో శిశువుల దీన స్థితిని చూసి ప్రజలు చలించిపోయారు. వారి ప్రాణాలు కాపాడాలని ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఇజ్రాయెల్ సానుకూలంగా స్పందించింది. శిశువుల తరలింపునకు అంగీకరించింది. నెలలు నిండకుండా పుట్టిన 31 మంది శిశువులను అల్–షిఫా హాస్పిటల్ నుంచి దక్షిణ గాజాలోని మరో ఆసుపత్రికి తరలించారు. వారిని పొరుగు దేశమైన ఈజిప్టుకు చేర్చి, మెరుగైన చికిత్స అందించనున్నట్లు గాజా ఆరోగ్య శాఖ ఆదివారం వెల్లడించింది. ఇంకా చాలామంది రోగులు, క్షతగాత్రులు, సామాన్య జనం ఇంకా అల్–షిఫా ఆసుపత్రిలోనే ఉన్నారు. ఇజ్రాయెల్ సైన్యం వారిని బయటకు వెళ్లనివ్వడం లేదు. ఇక్కడ ప్రాణాధార ఔషధాలు, ఆహారం, నీరు, విద్యుత్ లేకబాధితులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అత్యవసర చికిత్స అవసరమైన శిశువులను అల్–షిఫా నుంచి అంబులెన్స్‌ల్లో దక్షిణ గాజాలోని రఫా హాస్పిటల్‌కు తరలిస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ చెప్పారు.

జబాలియా శరణార్థి శిబిరంపై క్షిపణుల వర్షం

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం భూతల, వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. అల్–షిఫా ఆసుపత్రిని పూర్తిగా దిగ్బంధించింది. సాధారణ జనావాసాలతోపాటు పాఠశాలలు, శరణార్థి శిబిరాలపైనా క్షిపణుల వర్షం కురిపిస్తోంది. ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై శనివారం అర్ధరాత్రి నుంచి దాడులు కొనసాగించింది. పదుల సంఖ్యలో జనం మరణించినట్లు తెలుస్తోంది. ఉత్తర గాజా నుంచి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం పదేపదే హెచ్చరిస్తోంది. హమాస్ మిలిటెంట్ల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగిస్తున్నామని, సాధారణ ప్రజలకు నష్టం వాటిల్లకూడదన్నదే తమ ఉద్దేశమని వెల్లడించింది. ఉత్తర గాజాలో ప్రస్తుతం తమ దళాలు చాలా క్రియాశీలకంగా పని చేస్తున్నాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో గాజాలో ఇప్పటిదాకా 12,000 మందికిపైగా మృతి చెందారు. మరో 2,700 మంది శిథిలాల కింద గల్లంతయ్యారు.

బందీల విడుదలకు యత్నాలు

గాజాలో హమాస్ చెరలో దాదాపు 240 మంది బందీలుగా ఉన్నారు. వారిలో ఇప్పటిదాకా నలుగురి బందీలను మిలిటెంట్లు విడుదల చేశారు. మరో ఇద్దరు బందీల మృతదేహాలు ఇటీవల్ అల్–షిఫా ఆసుపత్రి సమీపంలో లభ్యమయ్యాయి. మిగిలిన బందీల విడుదలకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఈ విషయంలో ఇజ్రాయెల్, అమెరికాతోపాటు పర్షియన్ గల్ఫ్ దేశమైన ఖతార్ చొరవ తీసుకుంటున్నాయి. ఖతార్ ప్రతినిధులు హమాస్ నేతలతో చర్చలు జరుపుతున్నారు. బందీలను క్షేమంగా విడుదల చేయాలని కోరుతున్నాయి.

ఉత్తరాఖండ్ సొరంగంలో డ్రిల్లింగ్ నిలిపివేత

అమెరికా యంత్రానికి అడ్డంకులు

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలోని సిల్క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన 41 మంది కార్మికులు ఇంకా బయటకురాలేదు. వారం రోజుల క్రితం సొరంగం కూలిపోవడంతో వారు అందులో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. కార్మికులు బయటకు రావడానికి వీలుగా ఎస్కేప్ మార్గాన్ని సిద్ధం చేయడానికి తలపెట్టిన డ్రిల్లింగ్ పనులను ఆదివారం నిలిపివేశారు. డ్రిల్లింగ్ యంత్రానికి అడ్డంకులు ఎదురు కావడమే ఇందుకు కారణం. గట్టి రాళ్ల రప్పలు ఎదురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. సహాయక చర్యలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదివారం సమీక్షించారు. బాధితులను క్షేమంగా బయటకు తీసుకురావడానికి భారీ డయామీటర్ స్టీల్ పైపులైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సొరంగం శిథిలాల గుండా ఈ పైపులైన్‌ను పంపించనున్నట్లు తెలిపారు. సొరంగంలో కార్మికులు ఉన్న చోటుకి చేరుకోవడానికి నిట్టనిలువుగా కంటే అడ్డంగా తవ్వడమే సరైందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికా యంత్రానికి ఎలాంటి అడ్డంకులు ఎదురు కాకుంటే రెండున్నర రోజుల్లో కార్మికులు ఉన్న చోటుకి చేరుకోవచ్చని వెల్లడించారు. సొరంగంలో కార్మికులు స్వేచ్ఛగా అటూ ఇటూ తిరగగలుగుతున్నారని, వారికి ఆహారం, నీరు, విద్యుత్, ఆక్సిజన్ అందుతున్నాయని, ప్రాణాపాయం లేదని నితిన్ గడ్కరీ స్పష్టంచేశారు.అమెరికా యంత్రంతో అతిత్వరలో డ్రిల్లింగ్ ప్రారంభిస్తామని ప్రభుత్వ అధికారులు చెప్పారు. సొరంగంలో ఉన్న కార్మికులకు మల్టీ విటమిన్ మాత్రలు, ఎండు ఫలాలు తదితరాలు అందిస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ ఆదివారం తెలిపారు.



విశ్వసుందరిగా నిలిచిన క్షణంలో పలాసియోస్ హర్షాతిరేకాలు

విశ్వసుందరి పలాసియోస్

- నికరాగ్వా సుందరికి తొలిసారిగా మిస్ యూనివర్స్ కిరీటం
- ఫస్ట్ రన్నరప్‌గా థాయ్‌లాండ్ భామ ఆంటోనియా పోర్సిల్డ్
- సెకండ్ రన్నరప్‌గా ఆస్ట్రేలియా యువతి మొరాయా విల్సన్
- టాప్–20 జాబితాలో మిస్ ఇండియా శ్వేత శారద

న్యూఢిల్లీ: నికరాగ్వా సుందరి షెన్నిస్ పలాసియోస్ ప్రతిష్టాత్మకమైన మిస్ యూనివర్స్–2023 కిరీటం దక్కించుకుంది. నికరాగ్వా నుంచి ఒకరికి ఈ అంతర్జాతీయ గౌరవం దక్కడం ఇదే మొదటిసారి. 72వ ఎడిషన్ మిస్ యూనివర్స్ పోటీలు శనివారం రాత్రి ఎల్ సాల్వెడార్‌లోని శాన్ సాల్వెడార్‌లో జోస్ అడాల్ఫో పినెడా ఎరేనాలో ఘనంగా జరిగాయి. ఫస్ట్ రన్నరప్‌గా మిస్ థాయ్‌లాండ్ ఆంటోనియో పోర్సిల్డ్, సెకండ్ రన్నరప్‌గా మిస్ ఆస్ట్రేలియా మొరాయా విల్సన్ నిలిచారు. విశ్వ సుందరిగా నిలిచిన న షెన్నిస్ పలాసియోస్‌కు గతేడాది మిస్ యూనివర్స్ అమెరికా సుందరి ఆర్ బోనీ గాబ్రియెల్ కిరీటం అలంకరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. నికరాగ్వాలోని మనాగ్వాకు చెందిన 23 ఏళ్ల పలాసియోస్ మానసిక ఆరోగ్య కార్యకర్తగా బాధితులకు సేవలందిస్తున్నారు. ఆడియో విజువల్ ప్రొడ్యూసర్‌గానూ పని చేస్తున్నారు. ఈసారి మిస్ యూనివర్స్ పోటీల్లో 84 దేశాల నుంచి యువతులు పాల్గొన్నారు. భారత్ నుంచి మిస్ ఇండియా శ్వేత శారద పోటీపడ్డారు. ఆమె టాప్–20 జాబితాలో స్థానం దక్కించుకున్నారు.

కోట్లకు పడగలెత్తారు

- రాజస్తాన్ అభ్యర్థుల్లో 651 మంది కోటీశ్వరులే
- బీజేపీలో 176 మంది, కాంగ్రెస్ 167 మంది కూడా
- 8 మంది అభ్యర్థులకు రూపాయి కూడా ఆస్తి లేదట
- 326 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థుల్లో ఏకంగా 35 శాతం మంది కోటీశ్వరులే! బరిలో నిలిచిన 1,875 మంది అభ్యర్థుల అఫిడవిట్లను విశ్లేషించి అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), రాజస్తాన్ ఎలక్షన్ వాచ్ ఈ మేరకు తేల్చాయి. వారి ఆస్తులు, క్రిమినల్ కేసుల వివరాలతో శనివారం నివేదిక విడుదల చేశాయి.

బీజేపీ, కాంగ్రెస్‌ల్లో కోటీశ్వరులదే హవా

ఏడీఆర్ నివేదిక ప్రకారం రాజస్తాన్‌లో బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 651 (35%) మంది కోటీశ్వరులున్నారు. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ కూడా వారికే ఎక్కువగా టికెట్లిచ్చాయి. మొత్తం 200 అసెంబ్లీ స్థానాకలు గాను బీజేపీ నుంచి 176 మంది, కాంగ్రెస్ నుంచి 167 మంది రూ.కోటికి మించి ఆస్తులు ప్రకటించారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి 29 మంది, బీఎస్పీ నుంచి 36 మంది కూడా కోటీశ్వరులే. చురు కాంగ్రెస్ అభ్యర్థి రఫీక్ మండేలియా రూ.166 కోట్లతో అందర్లోనూ సంపన్నుడిగా నిలిచారు. రూ.123 కోట్లతో నీమ్ కా థానా బీజేపీ అభ్యర్థి ప్రేమ్ సింగ్ బజోర్ రెండో స్థానంలో ఉన్నారు. అయితే 8 అభ్యర్థులు తమకు ఒక్క రూపాయి ఆస్తి కూడా లేదని పేర్కొనడం విశేషం. 922 మంది తమకు అప్పులున్నట్టు వెల్లడించారు. ఇక 326 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులున్నాయి. బీజేపీ 61 మందికి, కాంగ్రెస్ 47, ఆప్ 18, బీఎస్పీ 12 మంది నేర చరితులకు టికెట్లిచ్చాయి. క్రిమినల్ కేసులున్న ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది బరిలో ఉన్న రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు రాష్ట్రంలో 45 ఉన్నాయి. 643 మంది, 34 శాతం మంది అభ్యర్థులు 25–40 ఏళ్ల మధ్య వయస్కులు. 80 ఏళ్ల పై చిలుకు అభ్యర్థులు 8 మంది ఉన్నారు. 183 మంది, అంటే 10 శాతం మంది పోటీలో ఉన్నారు. 137 మంది అభ్యర్థులు కేవలం అక్షరాస్యులు కాగా 11 మంది నిరక్షరాస్యులమని ప్రకటించారు. కోటీశ్వరుల్లో చాలామంది కోట్లలో అప్పు కూడా చూపించారు.

ఐదేళ్లుగా పరస్పరం రనౌట్‌కు కుట్రలు

- రాజస్తాన్ కాంగ్రెస్ నేతల తీరుపై ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా
- అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలే కాంగ్రెస్ సంప్రదాయం
- రాజస్తాన్‌లోని చురు జిల్లాలో మోదీ ఎన్నికల ప్రచారం

జైపూర్: దేశమంతటా ఎక్కడ చూసినా క్రికెట్ ప్రపంచకప్ ముచ్చట్లే. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్తాన్‌లో కాంగ్రెస్ పార్టీ తీరును క్రికెట్ టీమ్‌తో పోల్చారు. రాజస్తాన్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరినొకరు రనౌట్ చేసుకొనేందుకు గత ఐదేళ్లుగా కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. తద్వారా ఆ పార్టీలో నేతల మధ్య రగులుతున్న అంతర్గత విభేదాలను, సీఎం అశోక్ గహ్లోత్, సీనియర్ నాయకుడు సచిన్ పైలట్ మధ్య ఆధిపత్య పోరును ప్రస్తావించారు. వారు పరుగులు చేయడానికి బదులు, సొంత టీమ్‌లోని ప్రత్యర్థులను పడగొట్టాలని చూశారని చెప్పారు. వారి టీమ్ సరిగ్గా లేనప్పుడు ఇక ప్రజల కోసం ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆదివారం రాజస్తాన్‌లోని చురు జిల్లాలోని ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని మండిపడ్డారు. అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు అనే సంప్రదాయాన్ని కాంగ్రెస్ అభివృద్ధి చేసిందని, దాని వల్ల దేశం భారీగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తీరు వల్ల దేశంలో యువతకు ఎదిగే అవకాశాలు రాలేదని చెప్పారు.

పేపర్ లీక్ మాఫియాపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తాం..

రాజస్తాన్‌లో బీజేపీకి అధికారం అప్పగిస్తే అవినీతిపరుల భరతం పడతామని, వేగవంతమైన అభివృద్ధికి శ్రీకారం చుడతామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు ఎంత దూరంగా ఉంటే రాజస్తాన్‌కు అంత మేలు జరుగుతుందని, భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ప్రజలకు సూచించారు. వెలుతురికి, చీకటికి మధ్య ఉన్న సంబంధం లాంటిదే మంచికి, కాంగ్రెస్‌కు మధ్య కూడా ఉందని అన్నారు. రాష్ట్రంలో జల జీవన్ మిషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ప్రజలకు తాగు నీరు సరఫరా చేయడానికి ఉద్దేశించిన పథకంలోనూ నిధులు కొల్లగొట్టారని దుయ్యబట్టారు. కాంగ్రెస్, అభివృద్ధి అనేవి పరస్పరం శత్రువులని, ఆ శత్రుత్వం ఎప్పటికీ కొనసాగుతుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పేపర్ లీక్ మాఫియా యువత భవిష్యత్తును లక్షలాది రూపాయలకు అమ్మేసిందని ధ్వజమెత్తారు. ఎరువుల కుంభకోణంతో రైతులను విచ్చలవిడిగా లూటీ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే పేపర్ లీక్ మాఫియాపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని తేల్చిచెప్పారు.

2047 నాటికి 'అభివృద్ధి చెందిన భారత్'

రాజస్తాన్‌లో కాంగ్రెస్ పాలనలో ధరలు భారీగా పెరిగిపోయాయని మోదీ గుర్తుచేశారు. హరియాణా, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ లీటర్ పెట్రోల్ ధర రూ.13 అధికంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ధరలను సమీక్షిస్తామని, ప్రజలకు ఊరట కల్పిస్తామని వెల్లడించారు. కొన్నేళ్లలో అన్ని రంగాల్లోనూ భారత్ అద్భుతాలు చేసిందన్నారు. ఎటు చూసినా నూతనోత్సాహం, ఆత్మవిశ్వాసం కనిపిస్తున్నాయని, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



విస్కీ బాటిల్ రూ. 22.5 కోట్లు!

ప్రపంచంలోనే ఖరీదైనదిగా రికార్డు

లండన్: అవున్నిజమే. మెకాలన్ బ్రాండ్‌కు చెందిన ప్రీమియం స్కాచ్ బాటిల్ ఒకటి ఏకంగా రూ.22.5 కోట్లు పలికింది! శనివారం సోత్‌బే వేలంలో ఇది అక్షరాలా అంత మొత్తానికి అమ్ముడైంది! దాంతో ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన విస్కీగా కొత్త రికార్డు సృష్టించింది. దీని ప్రత్యేకతలే ఇంతటి ధరకు కారణమయ్యాయి. ఈ సింగిల్ మాల్ట్ విస్కీ 1926 నాటిది. మెకాలన్ కంపెనీ ఇలాంటి 40 బాటిళ్లను మాత్రమే తయారు చేసింది. వాటిని ఏకంగా 60 ఏళ్ల పాటు డార్క్ ఓక్‌వుడ్ పెట్టెల్లో నిల్వ చేసి ఉంచి 1986లో బయటికి తీశారట. కొన్నింటిని మెకాలన్ తన వీఐపీ కస్టమర్లకు విక్రయించిందట.

పిల్లలపై లైంగిక వేధింపులు... కామాంధునికి 707 ఏళ్ల శిక్ష

కాలిఫోర్నియా: అమెరికాలో పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ మాథ్యూ జక్ర్‌జెవ్‌స్కీ అనే కామాంధునికి ఏకంగా 707 ఏళ్ల జైలు శిక్ష పడింది. కాలిఫోర్నియాకు చెందిన అతను పిల్లల బాగోగులు చూసుకునే నానీగా పని చేసేవాడు. ఆ క్రమంలో 2014–19 మధ్య 2 నుంచి 12 ఏళ్ల వయసున్న కనీసం 16 మంది పిల్లలను లైంగికంగా వేధించాడు. మరో బాలునికి అశ్లీల చిత్రాలు చూపించాడు. తన కొడుకును మాథ్యూ అభ్యంతకర రీతిలో తాకుతూ ఇబ్బంది పెట్టాడంటూ 2019లో ఒక వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విదేశాలకు పారిపోతుండగా అతన్ని అరెస్టు చేశారు. 17 మంది అమాయకుల బాల్యాన్ని మాథ్యూ ఛిద్రం చేశాడని తీర్పు సందర్భంగా జడ్జి అన్నారు.

రాజస్తాన్‌లో రోడ్డు ప్రమాదం... ఆరుగురు పోలీసుల దుర్మరణం

చురు: రాజస్తాన్‌లో చురు జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో భద్రతా విధుల నిమిత్తం వెళ్తున్న ఆరుగురు పోలీసు సిబ్బంది ఈ ఘటనలో దుర్మరణం పాలయ్యారు. వారంతా నగౌర్ నుంచి ఎన్నికల ర్యాలీ జరగనున్న ఝుంఝును వెళ్తుండగా తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారు దట్టమైన పొగ మంచు కారణంగా ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొంది. దాంతో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు ఆస్పత్రిలో కన్నుమూశారు. తీవ్రంగా గాయపడ్డ మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

హిందూ మత విశ్వాసమే స్ఫూర్తి: వివేక్ రామస్వామి

వాషింగ్టన్: హిందూ మత విశ్వాసం తనకు అన్ని విషయాల్లోనూ సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఇచ్చిందని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి చెప్పారు. అధ్యక్ష రేసులో నిలిచేందుకు కూడా ఆ విశ్వాసమే తనకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రతి జీవిలోనూ దేవుడున్నాడన్నది హిందూ మత మౌలిక విశ్వాసమని 38 ఏళ్ల వివేక్ చెప్పారు.

మోదీ నినాదం.. అదానీజీ కీ జై

- నిత్యం 24 గంటలూ అదానీ సేవలో తరిస్తున్న ప్రధానమంత్రి
- రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజం

బుంది/దౌసా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బడా పారిశ్రామికవేత్త అయిన గౌతమ్ అదానీ సేవలో తరిస్తున్నారని, ఆయన కోసమే పని చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'భారత్ మాతా జై' అని చెప్పే మోదీ అదానీ కోసం నిత్యం 24 గంటలూ పరితపిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'భారత్ మాతాకీ జై' అనడానికి బదులు 'అదానీజీ కీ జై' అని నినదించాలని మోదీకి హితవు పలికారు. భరతమాత అంటే పేదలు, రైతులు, కార్మికులేనని స్పష్టం చేశారు. ఆదివారం రాజస్తాన్‌లోని బుంది, దౌసా జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా రాహుల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. ప్రధాని మోదీ రెండు హిందూస్తాన్‌లను సృష్టించాలని భావిస్తున్నారని, అందులో ఒకటి అదానీ కోసం, మరొకటి పేదల కోసం ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా కుల గణన ఎందుకు నిర్వహించడం లేదని మోదీని నిలదీశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశమంతటా కుల గణన ప్రారంభిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. రాజస్తాన్‌లోనూ అధికారంలోకి రాగానే కులగణనకు మొట్టమొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కులగణనతోనే భరతమాత విజయం సాధిస్తుందని వివరించారు.



రోజుకు మూడుసార్లు దుస్తులు మారుస్తారు

మనదేశంలో బడా పారిశ్రామికవేత్తల్లో ఎవరైనా ఓబీసీలు, దళితులు, గిరిజనులు ఉన్నారా అని రాహుల్ ప్రశ్నించారు. రాజస్తాన్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోతాయన్నారు. మోదీ రూ.12,000 కోట్లతో విమానం కొనుక్కున్నారని, రోజుకు మూడు సార్లు దుస్తులు మారుస్తారని, రూ.12 కోట్ల విలువైన కారులో ప్రయాణిస్తుంటారని మోదీపై ధ్వజమెత్తారు. తమ జనాభా ఎంత ఉందో చెప్పాలని ఓబీసీ, దళిత, గిరిజన యువత అడిగితే మాత్రం కులాలు లేవని ప్రధానమంత్రి అంటున్నారని దుయ్యబట్టారు. మోదీ 90 మంది ఐఏఎస్ అధికారులతో పరిపాలన నడిపిస్తున్నారని, వారిలో ఓబీసీలు ముగ్గురే ఉన్నారని వెల్లడించారు. దేశంలో ఓబీసీల జనాభా 50 శాతం ఉందని, ఐఏఎస్‌లు మాత్రం జనాభాకు తగ్గట్టుగా లేరని తెలిపారు.

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌తో ముప్పు

- ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా 50 లక్షల మంది
- 2050 నాటికి మృతుల సంఖ్య కోటికి పెరిగే అవకాశం
- దక్షిణాఫ్రికా, యూకేలో జరిగిన అధ్యయనంలో వెల్లడి

ఆక్స్‌ఫర్డ్(యూకే): కంటికి కనిపించని సూక్ష్మమైన బ్యాక్టీరియా, వైరస్‌లు, పారాసైట్లు, ఫంగస్ వంటివి మనిషి శరీరం లోపల, బయట, చుట్టూ ఉంటాయి. వీటిని మైక్రోబ్స్ అని పిలుస్తుంటారు. మన నిత్య జీవితంలో ఇవన్నీ ఒక భాగమే. కొన్ని రకాల జీవ క్రియలకు మైక్రోబ్స్ అవసరం. జీర్ణకోశ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండడానికి, రోగ నిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయడానికి, ఆహారంలోని పోషకాలను శరీరం శోషించుకోవడానికి బ్యాక్టీరియా, వైరస్‌లు తోడ్పడుతుంటాయి. వ్యవసాయం, పరిశ్రమల్లోనూ వీటి ప్రాధాన్యం ఎక్కువే. అయితే, ఈ మైక్రోబ్స్ కేవలం మేలు చేయడమే కాదు, కొన్ని సందర్భాల్లో కీడు చేస్తుంటాయి. అనారోగ్యం కలిగిస్తుంటాయి. మనుషులతోపాటు జంతువులు, మొక్కలకు హాని కలిగిస్తాయి. అందుకే యాంటీ మైక్రోబియల్ టీకాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇవి మైక్రోబ్స్‌ను అంతం చేయడం లేదా వాటిని వ్యాప్తిని తగ్గించడం చేస్తుంటాయి. కాలానుగుణంగా మైక్రోబ్స్ ఔషధ నిరోధక శక్తిని పెంచుకుంటాయి. అంటే టీకాలను లొంగకుండా తయారవుతాయి. అంతిమంగా 'సూపర్‌బగ్స్'గా మారుతాయి. అప్పుడు టీకాలు, ఔషధాలు ప్రయోగించిన ఫలితం ఉండదు. ఈ పరిణామాన్ని యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అంటారు. ఈ ఏఎంఆర్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా 50 లక్షల మంది మరణిస్తున్నారని తాజాగా దక్షిణాఫ్రికా, యూకేలో జరిగిన అధ్యయనంలో వెల్లడయ్యింది. హెచ్‌ఐవీ/ఎయిడ్స్, మలేరియా సంబంధిత మరణాల కంటే ఇవి చాలా అధికం. ఏఎంఆర్‌తో ఏటా మృత్యువాత పడే వారి సంఖ్య 2050 నాటికి ఏకంగా కోటికి చేరుతుందని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే క్యాన్సర్ సంబంధిత మరణాలను కూడా త్వరలో ఏఎంఆర్ మరణాలు అధిగమిస్తాయని అంటున్నారు.

- ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్స్ వాడకం మితిమీరుతోంది.
- 2000 నుంచి 2015 మధ్య ఇది 65 శాతం పెరిగిపోయిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.
- మొత్తం యాంటీ మైక్రోబియల్స్ 73 శాతం ఔషధాలను ఆహారం కోసం పెంచే జంతువులపైనే ఉపయోగిస్తున్నట్లు తేలింది.
- ఇలాంటి జంతువులను భుజిస్తే మనుషుల్లోనూ మైక్రోబ్స్ బలోపేతం అవుతున్నాయని, ఔషధాలకు లొంగని స్థితికి చేరుకుంటున్నాయని నిపుణులు గుర్తించారు.
- యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అనేది కేవలం కొన్ని దేశాల సమస్య కాదని, ఇది ప్రపంచ సమస్య అని నిపుణులు చెబుతున్నారు.
- దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. యాంటీబయోటిక్స్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు కూడా దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొంటున్నారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
సోమవారం ; 20 ; నవంబర్ ; 2023

క్రికెట్ మోజు



భారత్- ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన క్రికెట్ ప్రపంచ కప్ ఆఖరి మ్యాచ్‌ను మొబైల్‌ఫోన్లో వీక్షిస్తున్న ఆటో డ్రైవర్లు. రాచనగరి మైసూరులో కనిపించిన దృశ్యం

న్యూస్‌రీల్

3 నెలల్లో రూ.25 లక్షల డ్రగ్స్ వ్యాపారం



యశవంతపుర: సిలికాన్ సిటీలో డ్రగ్స్ అమ్ముతున్న నైజీరియా పౌరున్ని బెంగళూరు అమృతహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వ్యాపారం నెలకు రూ. 8 లక్షల పైనేనని తెలిసి పోలీసులు ఆశ్చర్యపోయారు. నిందితుడు డేనియల్ నుంచి పెద్ద మొత్తంలో ఎండిఎంఎ అనే డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాట్సాప్ ద్వారా సంప్రదించి మత్తు పదార్థాలను వినియోగదారులకు అమ్మేవాడు. వచ్చిన డబ్బులను బ్యాంక్ అకౌంట్ నుంచి తక్షణమే డ్రా చేసేవాడు. దీనిపై సమాచారం అందడంతో అతన్ని అరెస్టు చేసి విచారించగా డ్రగ్స్ దందా చేస్తున్నట్లు బయటపడింది. గత మూడు నెలల్లో రూ.25 లక్షలు డబ్బులు డ్రా చేసినట్లు పోలీసుల విచారణలో బయట పడింది.

తోటలో గంజాయి స్వాధీనం

మైసూరు: ఇంటిలో, తోటలో ఆవరణలో గంజాయిని పెంచుతున్న కేసులు తరచూ బయట పడుతున్నాయి. కొడగు జిల్లా విరాజపేటి తాలూకాలోని కండంగాల గ్రామంలో ఈ ఘటన జరిగింది. నంబుడమాడ విజయ్ భీమయ్య (39) అనే వ్యక్తి తమ తోటలో ఉన్న ఇంటి వెనుకాల గంజాయి మొక్కలను పెంచుతున్నాడు. ఇది తెలిసి పోలీసులు తనిఖీలు చేసి మొక్కలను పీకివేసి స్వాధీనం చేసుకున్నారు. వాటి బరువు 1.6 కేజీలుగా ఉంది. నిందితున్ని అరెస్టు చేశారు.

ప్రమాదంలో కొడవ నేత మృతి

మైసూరు: కొడగు జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు, అమ్మత్తి కొడవ సముదాయం మాజీ అధ్యక్షుడు మూకొండ బోస్ దేవయ్య ఆదివారం ఉదయం ప్రమాదంలో చనిపోయారు. ఇంటికి ఇటుకల లోడుతో వచ్చిన లారీ రివర్స్ తీసుకుంటున్న సమయంలో లారీ వెనుకల నిలబడి ఉండగా ఆయన మీదకు దూసుకెళ్లింది. తీవ్ర గాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. దేవయ్య బీజేపీతో పాటు కొడవ సముదాయం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. గోణికొప్ప ఎపిఎంసి అధ్యక్షునిగా, అఖిల కొడవ సముదాయం డైరెక్టర్‌గా పని చేశారు.

వరుసగా కార్లు ఢీ



దెబ్బతిన్న ఒక కారు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారి హరిపురం వై జంక్షన్ వద్ద, మూడు కార్లు ఢీకొన్న సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. వివరాల మేరకు, బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు హరిపురం వై జంక్షన్ స్పీడు బ్రేకర్ల వద్దకు రాగానే డ్రైవర్ నెమ్మది చేశాడు. ఆ కారు వెనుకనే వేగంగా వస్తున్న విజయవాడవాసుల కారు దానిని ఢీకొట్టింది. దాని వెనుక వస్తున్న మరో కారు అదుపు తప్పి ఆ కారు ఢీకొట్టింది. కార్లు దెబ్బతినగా అదృష్టవశాత్తు అందులోనివారు క్షేమంగా ఉన్నారు.

అబద్ధం కుమార ఇంటిదేవుడు: సీఎం



ఇందిరాగాంధీకి సీఎం, డీసీఎం నివాళులు

శివాజీనగర: జేడీఎస్ నేత హెచ్.డీ.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవం. అబద్ధం ఆయన ఇంటి దేవుడని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆరోపించారు. ఆదివారం నగరంలో కేపీసీసీ ఆఫీసులో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుమారస్వామి ఇప్పటివరకు ఏ ఆరోపణ రుజువు చేయలేదన్నారు. ఎలాగైనా కాని తమకు మసి పూయాలని బీజేపీ, జేడీఎస్‌ల ప్రయత్నమన్నారు. బదిలీల్లో సొమ్ము చేసుకొన్నది వారే అని అన్నారు. పరిపాలన కోసం బదిలీలు చేయడం సహజమని, అక్రమాలు జరిగాయని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకొంటానని సిద్దరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా బెంగళూరు సహా పలు జిల్లాల కాంగ్రెస్ నూతన అధ్యక్షులు బాధ్యతలను స్వీకరించారు.

కాటేసిన కరెంటు తీగ

- రోడ్డు పక్కన తెగిపడిన కరెంటు వైర్ తగిలి తల్లీ బిడ్డ దుర్మరణం
- మంటల్లో పాక్షికంగా దహనం
- బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో ఘోరం
- భర్త కళ్లముందే సంఘటన
- ఐదుగురు విద్యుత్ అధికారులపై కేసు



కరెంటు షాక్ కొట్టి తల్లీ బిడ్డ కాలిపోతున్న బాధాకర దృశ్యం



మృతురాలు సౌందర్య (ఫైల్)



కూతురు సుభిక్ష (ఫైల్)

కృష్ణరాజపురం: బెస్కాం అధికారుల నిర్లక్ష్యం వల్ల కరెంటు తీగ తెగి పడి ఉండగా, దానిని తొక్కిన తల్లీ, బిడ్డ ఇద్దరు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు వదిలారు. ఈ ఘోరం ఎక్కడో మారుమూల గ్రామంలో కాదు, సిలికాన్ సిటీలో జరిగింది. మహాదేవపుర నియోజకవర్గంలోని వైట్‌ఫీల్డ్‌లో ఉన్న హోప్ ఫార్మ్ సర్కిల్‌లో చోటు చేసుకుంది. మృతులు సౌందర్య (23), ఆమె కూతురు సుభిక్ష లియా(9 నెలలు).

నడిచి వెళ్తుండగా

వివరాలు.. సౌందర్య భర్త సంతోష్ ప్రైవేటు ఉద్యోగి, సంతోష్ స్వస్థలం తమిళనాడులోని డూటీ కావడంతో అక్కడే ఉంటున్నారు. సౌందర్య ఆదివారం డిప్లొమా పరీక్ష రాయాల్సి ఉండడంతో భర్త, కూతురితో కలిసి బెంగళూరుకు వచ్చారు. ఉదయం 5 గంటలప్పుడు ఏకేజీ కాలనీలో ఉండే సౌందర్య అమ్మవారి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ సమయంలో హోప్‌ఫార్మ్ కూడలిలో రోడ్డు పక్కన కరెంటు స్తంభం వైరు తెగి పడి ఉంది, దానిని చూడకుండా సౌందర్య తొక్కడంతో విద్యుదాఘాతం తగిలి మంటలు లేచాయి. సౌందర్య, ఆమె ఎత్తుకుని ఉన్న చిన్నారి బిడ్డ కరెంటు షాక్, మంటలతో క్షణాల్లోనే విగతజీవులయ్యారు. ఇద్దరూ పాక్షికంగా కాలిపోయారు. ఇదంతా భర్త కళ్ల ముందే జరిగిపోయింది. సంతోష్ గట్టిగా కేకలు వేయడంతో జనం పోగయ్యారు. వారి కుటుంబ సభ్యులు కూడా పరుగున అక్కడికి చేరుకుని ఎంత ఘోరం జరిగిపోయిందని విలపించారు. కాడుగోడి పోలీసులు చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

మంత్రి జార్జ్ విచారం

బనశంకరి: కరెంటు షాక్‌తో తల్లీబిడ్డ మృతి ఘటనపై ఇంధన శాఖ మంత్రి కేజే.జార్జ్ ట్విట్టర్లో స్పందిస్తూ దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం అందిస్తామని తెలిపారు. ప్రమాదంపై విచారణ చేపడతామని, నిర్లక్ష్యానికి కారణమైన సంబంధిత ఏఈ, ఏఈఈని సస్పెండ్ చేశామన్నారు. ఇంకా ఎవరైనా కారకులు ఉంటే నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బెస్కాం సిబ్బందిపై కేసు, విచారణ

ఆ పరిధిలోని ఐదు మంది బెస్కాం అధికారులపై కేసు నమోదైంది. లైన్‌మెన్, ఏఈ, ఈఈ, ఏఈఈ, జేఈ తదితరులపై హత్యానేరం కేసు నమోదు చేశారు. డీసీపీ శివకుమార్ గుణారె మాట్లాడుతూ బాధ్యులైన బెస్కాం అధికారులపై విచారణ చేపడతామని చెప్పారు. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సాధారణంగా రోడ్డు పక్కల ప్రైవేటు టెలికాం కంపెనీల ఫైబర్ ఆప్టిక్ తీగలు తెగిపడి ఉంటాయి, వాటిని తొక్కినా ఏమీ కాదు. సౌందర్య కూడా అలాగే అనుకుని ఉంటారని పోలీసులు అన్నారు. గతేడాది కూడా కరెంటు తీగలు తగిలిన ప్రమాదాల్లో ఓ మహిళ, యువకుడు మరణించారు.



త్వరలోనే జాతీయ రెడ్డి సమావేశం



ఆదివారం బెంగళూరులో రెడ్డి జన సంఘం సమావేశం ప్రారంభిస్తున్న ప్రముఖులు

- రెడ్డిసంఘం డిమాండ్లపై సర్కారు సానుకూలం
- మంత్రి రామలింగారెడ్డి వెల్లడి

బొమ్మనహళ్లి: కర్ణాటక రెడ్డి సముదాయం నుంచి కొన్ని డిమాండ్లు ఉన్నాయని, తీర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వచ్చే పార్లమెంటు ఎన్నికల కంటే ముందుగానే బెంగళూరులో అఖిల భారత రెడ్డి సమావేశం జరుగుతుందని రాష్ట్ర రవాణశాఖ మంత్రి, రెడ్డి సముదాయ నాయకుడు రామలింగారెడ్డి చెప్పారు. ఆదివారం నగరంలోని కోరమంగళలో ఉన్న కర్ణాటక రెడ్డి జన సంఘం ఆవరణలో సంఘం సమావేశం జరిగింది. మంత్రి మాట్లాడుతూ వేమన, హేమారెడ్డి మల్లమ్మ జయంతుల నిర్వహణ, అధ్యయన పీఠాలను ఏర్పాటు చేయడానికి సీఎం సిద్దరామయ్య అనుమతి ఇచ్చారన్నారు. రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కేసీ రెడ్డి విగ్రహం విధానసౌధ ముందు ఏర్పాటు చేశారని, అలాగే మొత్తం సంఘం పెట్టిన 8 డిమాండ్లలో ఆరింటిని అమలు చేశారని చెప్పారు.

శక్తి సామర్థ్యాలను చాటాలి

వేమనానంద స్వామీజీ మాట్లాడుతూ అతి త్వరలో నిర్వహించే జాతీయస్థాయి రెడ్డిజన సంఘం సమావేశానికి ప్రతి ఒక్కరు సహకారం ఇవ్వాలని, సంఘం శక్తి సామర్థ్యాలను దేశానికి చూపించాలని అన్నారు. అఖిల భారత రెడ్డి ఫెడరేషన్ స్థాపించడానికి మన సముదాయం చేయూతనివ్వాలన్నారు. జనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జయరామరెడ్డి, మాట్లాడుతూ ఈ భేటీకి తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశాల నుంచి రెడ్డి సముదాయం ప్రముఖ నాయకులు హాజరయ్యారని చెప్పారు. ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి సంఘం ప్రముఖులు, నేతలు తరలివచ్చి పలు అంశాలపై చర్చించారు.

విమానంలో మద్యం మత్తులో వీరంగం

దొడ్డబళ్లాపురం: ఇండిగో విమానంలో సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తించిన ప్రయాణికున్ని బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌కు చెందిన రణదీర్ సింగ్ నిందితుడు. జైపూర్ నుంచి ఇండిగో విమానంలో బెంగళూరుకు వస్తున్న రణదీర్ సింగ్ మద్యం మత్తులో సిబ్బందితో గొడవపడ్డాడు. సీట్లో కూర్చొని మద్యం తాగుతూ గట్టిగా అరుస్తూ దుర్భాషలాడుతూ తోటి వారికి ఇబ్బంది కలిగించాడు. క్యాబిన్ లోపలకు వెళ్లి మహిళా సిబ్బంది చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో సిబ్బంది వెంటనే పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా, విమానం దిగిన తరువాత నిందితున్ని అరెస్టు చేశారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు.

బిసి ఊటలో విషాదం



మొదట గాయాలతో బాలిక మహంతమ్మ



విక్టోరియాలో విషమ పరిస్థితిలో బాలిక

- సాంబారులో పడిన బాలిక
- మూడు రోజులు మృత్యువుతో పోరాడి మృతి

శివాజీనగర: బడిలో నాణ్యత లేని మధ్యాహ్న భోజనం, సిబ్బంది అలసత్వం వంటి ఆరోపణలు తరచూ వినిపిస్తుంటాయి. ఇదే రీతిలో సిబ్బంది నిర్లక్ష్యానికి బిసి ఊట సాంబారు పాత్రలో పడి తీవ్రంగా గాయపడిన రెండో తరగతి బాలిక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. వివరాలు.. ఈ నెల 16న కల్బుర్గి జిల్లా అఫ్జల్‌పుర తాలూకా చిణమగేరా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం సిద్ధం చేసిన సాంబారు పాత్రలో మహంతమ్మ (8) అనే విద్యార్థిని పడిపోయింది. సాంబారు వేడితో మసులుతుండగా, పాపకు తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. కల్బుర్గి బసవేశ్వర ఆసుపత్రిలో ముందుగా చికిత్స చేసి, బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. ఒంటిపై యాభై శాతం పైగా కాలిన గాయాలు ఉండగా, పరిస్థితి విషమించి బాలిక చికిత్స పొందుతూ ఆస్పత్రిలో కన్నుమూసింది. దీంతో అప్పటివరకు కూతురు ఆరోగ్యంగా తిరిగి వస్తుందని అనుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనికి బిసి ఊట సిబ్బంది నిర్లక్ష్యం కారణమని బాలిక తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్‌ఎం, టీచర్ సస్పెండ్

ఈ సంఘటనలో నిర్లక్ష్యం వహించారని పాఠశాల హెడ్‌మాస్టర్ లాల్‌బి నదాఫ్, ఉపాధ్యాయుడు రాజు చౌహాన్‌లను కల్బుర్గి డీడీపీఐ సక్రప్పగౌడ బిరాదార సస్పెండ్ చేశారు. వంటమనిషి కస్తూరిబాయి తళకేరిని పని నుంచి తీసేశారు.

ప్రతిమ హత్య కేసులో విచారణ

యశవంతపుర: రాష్ట్రంలో సంచలనం కలిగిన గనుల అధికారి కేఎస్ ప్రతిమా హత్యలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. సుబ్రహ్మణ్యపుర పీఎస్ పరిధిలోని దొడ్డకల్లసంద్రలో ఈ నెల 4వ తేదీ రాత్రి ఆమె ఫ్లాటులోకి చొరబడిన మాజీ డ్రైవర్ కిరణ్ ఆమెను కత్తితో గొంతుకోసి హత్య చేయడం తెలిసిందే. మరుసటి రోజున నిందితున్ని అరెస్టు చేశారు. తనను ఉద్యోగం తీసేశారన్న కోపంతో పాటు ప్రతిమ ఫ్లాటులో ఉన్న నగలు, డబ్బుపై కన్నేసిన కిరణ్ ఫ్లాటులోకి చొరబడి హత్య చేశాడని పోలీసులు చెబుతున్నారు. నిందితుడు పోలీసుల కస్టడీలో ఉన్నాడు. కానీ హత్య జరిగిన రోజు పోలీసులు, బంధువులు ఆమె ఫ్లాటులో డబ్బు, బంగారం ఏదీ పోలేదని ప్రకటించారు.

● పిలుస్తోంది.. బెళగావి చట్టసభ



బెళగావిలోని సువర్ణ విధానసౌధ అసెంబ్లీ భవనం. డిసెంబరు 4వ తేదీ నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు మొదలవుతాయి. దీంతో ఇక్కడ సుందరీకరణ పనులు ఊపందుకున్నాయి

పెళ్లికూతురు మిస్సింగ్, తండ్రి ఆత్మహత్య

- చామరాజనగర జిల్లాలో పెళ్లింట ఘోరం

మైసూరు: బంధువులతో ఇల్లంతా సందడిగా ఉంది. కొన్ని గంటలు గడిస్తే తలంబ్రాల వేడుక. కానీ అంతలోనే పిడుగులాంటి వార్త వధువు తండ్రి చెవిన పడింది. పెళ్లికూతురు ప్రియునితో వెళ్లిపోయింది, ఇది తట్టుకోలేక ఆవేదనతో ఆమె తండ్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న దారుణ ఘటన చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేటె తాలూకాలోని హొరదహళ్లి గ్రామంలో జరిగింది.

ఏం జరిగిందంటే..

వివరాలు.. పుట్టేగౌడ (55) కుమార్తె అయిన సుచిత్రకు ఈ నెల 18, 19వ తేదీన గుండ్లుపేటెలోని రామమందిరంలో పెళ్లి నిశ్చయించారు. కానీ ఈ నెల 17వ తేదీన సుచిత్ర తన ప్రియునితో వెళ్లిపోయింది. ఫలితంగా పెళ్లి ఆగిపోయింది. ఈ అవమానభారాన్ని పుట్టేగౌడ తట్టుకోలేకపోయాడు. శనివారం పొలానికి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా చెట్టుకు వేలాడుతూ మృతదేహం కనిపించింది. తెరకణాంబి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. పెళ్లి సందడితో కళకళలాడాల్సిన ఇల్లు వరుస విషాదాలతో కన్నీటి సంద్రమైంది.



కావేరి నదిలో మృత్యు ఘోష





నంజుండ, జ్యోతి మృతదేహాలు

- స్నానాలకు వచ్చి ఇద్దరి మృతి, మరొకరు గల్లంతు

మండ్య: ఆదివారం సెలవు రోజు కావడంతో సరదాగా నదీ స్నానాలు చేసేందుకు విచ్చేసినవారిని మృత్యువు కబళించింది. నీటిలోకి దిగిన వారిలో ఇద్దరు జల సమాధి అయ్యారు. మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటన కేఆర్ఎస్ డ్యాంలో చోటు చేసుకుంది. మైసూరులోని కారుణ్య ట్రస్టుకు చెందిన 15 మంది ఆదివారం ఉదయం కేఆర్ఎస్‌కు వచ్చారు. వెనుక కాలువ సమీపంలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్దకు చేరుకొని అక్కడ జలాశయంలోకి దిగారు. కొందరు ఈత కొడుతుండగా మరికొందరు స్నానాలు చేస్తున్నారు. ఈక్రమంలో హరీష్ (32), నంజుండ (18), జ్యోతి (18)లు నీటిలో మునిగిపోయారు. జలాశయ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో గజ ఈతగాళ్లు వచ్చి గాలించగా జ్యోతి, నంజుండ శవాలు దొరికాయి. హరీష్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. ఘటనతో తోటివారు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

కూలీలపై మదగజాల దాడులు



పెరిగిన అడవి ఏనుగుల ఆగడాలు



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువు



ఘటనాస్థలిలో అధికారులు

- ఓ మహిళ మృత్యువాత
- మండ్య వద్ద దుర్ఘటన

మండ్య: పొలంలో పనిచేస్తున్న మహిళ పైన ఏనుగుల గుంపు దాడి చేసి చంపిన సంఘటన మండ్య తాలూకాలోని లాళనకెరె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సాకమ్మ (50) మృతురాలు. వివరాలు.. సాకమ్మ కూలి పనులు చేసుకుని జీవించేది. ఓ పొలంలో కూలి పనులకు సాకమ్మ, మరో 8 మంది మహిళలు వెళ్లారు. పనిలో మునిగి ఉండగా, ఎక్కడి నుంచో ఏనుగుల గుంపు దూసుకువచ్చింది. ఒక్కసారిగా ఏనుగులు రావడంతో మహిళలు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. చెరుకు తోట వద్ద సాకమ్మను ఒక ఏనుగు అటకాయించి తొండంతో కొట్టి కాళ్లతో తొక్కడంతో ఆమె అక్కడికక్కడే ప్రణాలు కోల్పోయింది. ఇతర మహిళా కూలీలు ఎలాగో క్షేమంగా బయటపడ్డారు. సాకమ్మ బంధువులు, గ్రామస్తులు తరలివచ్చి ఏనుగులను తరిమివేశారు. మండ్య గ్రామీణ పోలీసులు పరిశీలించి కేసు నమోదుచేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ ఘటనాస్థలిని సందర్శించి మృతురాలి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఇటీవలే చిక్కమగళూరు జిల్లాలో కూడా మహిళా కూలీని ఒక ఏనుగు దాడిచేసి హతమార్చడం తెలిసిందే.

సఫారీపై దాడికి యత్నం

మైసూరు: మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని నాగరహొళె అభయారణ్యంలో పర్యాటకుల సఫారీ వాహనంపై ఏనుగు దాడికి ప్రయత్నించింది. వాహనం డ్రైవర్ వేగంగా నడిపి ప్రమాదం నుంచి తప్పించాడు. పర్యాటకులు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. సఫారీలో యాత్రికులు అడవిని వీక్షిస్తుండగా, దగ్గరలో ఒక ఏనుగుల గుంపు వెళ్తోంది. అందులో నుంచి ఒక ఏనుగు సఫారి వాహనం వైపు పరుగులు పెట్టింది. డ్రైవర్ వేగంగా వెళ్లిపోవడంతో ముప్పు తప్పింది.

క్లుప్తంగా

మురుఘ స్వామిపై ఫిర్యాదు

సాక్షి,బళ్లారి: బాలికలపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోక్సో కేసు నమోదై ఏడాదిన్నర కాలంగా జైలులో ఉండి బెయిల్‌పై విడుదలైన చిత్రదుర్గం మురుఘ మఠం శివమూర్తి స్వామిపై మరో ఫిర్యాదు నమోదైంది. ఆయన బెయిల్‌పై విడుదలైన తర్వాత దావణగెరెలోని విరక్త మఠంలో ఉంటుండడంతో సాక్షులను బెదిరించి తారుమారు చేసే అవకాశం ఉంటుందని, మఠంలో స్వామి ఉండకూడదని న్యాయవాది మధుకుమార్ లిఖితపూర్వకంగా చిత్రదుర్గం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో మురఘా మఠం స్వామి దావణగెరెను వీడాల్సి రావచ్చని భావిస్తున్నారు.

కోలారులో ఇందిరాగాంధీ జయంతి



జయంతిని నిర్వహించిన దృశ్యం

కోలారు : నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఇందిరాగాంధీ 106వ జయంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తీసుకు వచ్చారన్నారు. గరీబీ హఠావో కార్యక్రమం ద్వారా పేదల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. ప్రధానిగా దేశాన్ని 17 ఏళ్లపాటు పాలించి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారన్నారు. బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా పేదలకు బ్యాంకుల రుణాలు అందేలా చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయదేవ్, ఎం.నాగరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం



మహదేశ్వరస్వామి మూలవిరాట్

మండ్య : తాలుకాలోని సుండహళ్లి సమీపంలో ఉన్న వడ్డరకట్టె గ్రామంలో కొలువైన ప్రసిద్ధ శ్రీమహాదేశ్వర స్వామి రథోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారి కార్తీక 101వ మాస జాతర ఉత్సవాలు ఈ నెల 12 నుంచి కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు.

బీజేపీ నాయకుడిపై దాడి

శివాజీనగర: చిత్తాపుర నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలైన మణికంఠ రాథోడ్‌పై దుండగులు దాడి చేసి గాయపరిచారు. ఈయన చిత్తాపుర నుంచి కలబురిగికి వస్తుండగా శహాబాద వద్ద దుండగులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. బీర్ బాటిళ్లతో ఆయనపై దాడి చేసి ఉడాయించారు. తీవ్రంగా గాయపడిన మణికంఠ రాథోడ్‌ను కలబురిగిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పార్కులు అధ్వానం..ఆహ్లాదం దూరం

- ఉద్యానవనాల్లో పరిశుభ్రత కరువు
- అధికారులు, పాలకుల తీరుపై ఆగ్రహం



అలనాపాలన కరువై అధ్వానంగా ఉన్న గణేష్ కాలనీలోని పార్కు



పార్కులో వృథాగా పక్కన పడవేసి ఉన్న వ్యాయామ పరికరాలు

సాక్షి,బళ్లారి: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెత నగరానికి అచ్చు గుద్దినట్లు సరిపోతోంది. స్టీల్ సిటీగా పేరొందిన నగరం చెత్త నగరంగా మారుతున్నా పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తారే కాని నగర స్వచ్ఛత, నగరాభివృద్ధిపై అంతగా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. పాలకులు ఎవరు వచ్చినా కొత్త సీసాలో పాత సారా అన్న విధంగా నగరాభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. రోడ్ల దుస్థితి, చెత్త చెదారం, స్వచ్ఛ బళ్లారి మాట అటుంచితే కనీసం పార్కుల్లోకి వెళ్లి కాసేపు ప్రశాంతంగా గడుపుదామని జనం అనుకుంటే పొరపాటే. నగరంలో సుమారు 150 పార్కులకు పైగా ఉంటే అందులో కనీసం ఐదారు పార్కులు కూడా సరిగా లేకపోవడంతో నగరవాసులు పార్కుల దుస్థితిపై పాలకులను దుమ్మెత్తి పోస్తున్నారు.

బుడా పార్కుకే దిక్కులేదు

ముఖ్యంగా నిత్యం పెద్ద ఎత్తున జనం తిరుగాడే, కార్యాలయాలకు వచ్చి వెళ్లే నగరంలోని బుడా కార్యాలయం ఆవరణలో ఐదేళ్ల క్రితం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కును ఏర్పాటు చేశారు. అయితే దాని నిర్వహణను పట్టించుకోకపోవడంతో పార్కు అధ్వానంగా మారింది. వ్యాయామ పరికరాలు అన్నీ విరిగిపోయాయి. పార్కు నిండా చెత్తా చెదారం, మద్యం బాటిళ్లు దర్శనం ఇస్తున్నాయి. బుడా కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌కు కూతవేటు దూరంలోనే ఈ పార్కు ఉంది. బుడా కార్యాలయం పక్కనే ఉన్న ఈ పార్కు దుస్థితిని కళ్లారా అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అప్పుడప్పుడు చూస్తున్నా పార్కును బాగు చేయాలన్న ఆలోచన చేయకపోవడంతో పార్కుకు వచ్చి పోయే ప్రజలు పాలకులు, అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. బుడా కార్యాలయ ఆవరణ పక్కనే పార్కులో జనం కాసేపు సేద తీరేందుకు కూడా అవకాశం లేని విధంగా అధ్వానంగా మారితే ఇక నగరంలో పార్కులు పరిస్థితి ఎవరు పట్టించుకుంటారో అర్థం చేసుకోవచ్చు.

శుభ్రత లోపించిన పార్కులు

ఒక్క బుడా కార్యాలయం ఆవరణలోని పార్కులే కాకుండా నగరంలోని వాజ్‌పాయి లేఅవుట్, రాఘవేంద్ర కాలనీ, పటేల్ నగర్, రామయ్య కాలనీ, కువెంపునగర్ తదితర కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కుల్లో పరిశుభ్రత లోపించింది. ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారం, విరిగిపోయిన వ్యాయామ పరికరాలు, దుస్థితిలో కనిపిస్తున్న ఆసనాలు, విపరీతంగా పెరిగిపోయిన గడ్డి, కంపచెట్లు దర్శనం ఇవ్వడంతో పార్కుకు వెళ్లిన జనం అక్కడ కాసేపు కూడా కూర్చొనేందుకు వీలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కుల దుస్థితిపై సంబంధిత అధికారులు కాని, స్థానిక కార్పొరేటర్లు కాని పట్టించుకోకపోవడంతో పార్కులన్నింట్లో జనం వెళ్లి కూర్చొనేందుకు, వాకింగ్ చేసేందుకు వీలు కావడం లేదంటున్నారు. అధికారులు నగరంలో అధ్వానంగా ఉన్న పార్కులన్నింటినీ బాగు చేసి నగర వాసులకు ఆహ్లాదం పంచాలని ప్రజలు కోరుతున్నారు.

డిసెంబరు 1 నుంచి బెంగళూరుహబ్బ



బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్

బనశంకరి: బెంగళూరు నగరవ్యాప్తంగా డిసెంబరు 1 నుంచి 11 వరకు బెంగళూరుహబ్బ నిర్వహిస్తామని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తెలిపారు. బీబీఎంపీ వలయ అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. అన్‌బాక్సింగ్ బెంగళూరు ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ ఘనత పెంచడం, బ్రాండ్‌బెంగళూరు విలువలు పెంచే దృష్టితో బెంగళూరుహబ్బ ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. బెంగళూరు హబ్బకు ప్రముఖ స్థలాలు, జంక్షన్, పై వంతెనలు, ఉద్యానవనాలు, మార్కెట్లలో స్వచ్ఛతకు చర్యలు తీసుకుంటామన్నారు. పురాతన కట్టడాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ ఉంటుందన్నారు. డిసెంబరు 9–10 తేదీల్లో బెంగళూరు ప్యాలెస్ మైదానంలో ఫుడ్‌స్టాల్స్ ఏర్పాటు చేస్తామని, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆరు ప్రముఖ రోడ్లలో ఓపెన్‌స్ట్రీట్ మేళా ఏర్పాటుచేస్తామని, ప్రజలను ఆకట్టుకునే రీతిలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. బెంగళూరు హబ్బ డైరెక్టర్ రవిచందర్ మాట్లాడుతూ బెంగళూరు హబ్బపై htt pr://ha bba. unboxi nf b r.com/ వెబ్‌సైట్‌లో పూర్తివివరాలు ఉంటాయన్నారు.

అధ్యక్ష బాధ్యతలు 20-20 మ్యాచ్‌తో సమానం

- జీ.వై. విజయేంద్ర



గణపతి సచ్చిదానంద స్వామీజీతో బీవై విజయేంద్ర

మైసూరు : పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలు రాజకీయంగా 20–20 మ్యాచ్‌తో సమానమని బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు విజయేంద్ర వ్యాఖ్యానించారు. ఆదివారం మైసూరులో మీడియాతో మాట్లాడారు. తనకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన విషయంపై ఎమ్మెల్యే యత్నాళ్ చేసిన వ్యాఖ్యలను ఎవరూ తప్పుగా అర్థం చేసుకోవద్దన్నారు. తమ అభిప్రాయాలు చెప్పే అవకాశం పార్టీలో అందరికీ ఉందన్నారు. అనంతరం అవధూత, దత్తపీఠం వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద స్వామీజీని విజయేంద్ర కలిసి ఆశీర్వాదం పొందారు.

హత్య చేసి.. టపాసులు కాల్చి

- ఉడుపి కిల్లర్ చౌగలే విచారణలో కఠిన నిజాలు



మేకవన్నె మృగం.. చౌగలే

యశవంతపుర: ఇటీవల ఉడుపిలో ఒకే కుటుంబంలో నలుగురిని హత్య చేసిన నిందితుడు ప్రవీణ్ చౌగలే.. ఏమాత్రం భయం, బాధ లేకుండా తీరిగ్గా టపాసులు కాల్చి దీపావళి పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నట్లు పోలీసుల విచారణలో బయట పడింది. ఈ నెల 12న పండుగ రోజు ఉదయం తల్లి, ఇద్దరు కూతుళ్లు, కొడుకుని హత్య చేశాడు. పోలీసులు నిందితున్ని కోర్టులో హాజరు పరిచి కస్టడీకి తీసుకొని విచారిస్తున్నారు. విచారణలో అనేక విషయాలను వెల్లడించాడు. యువతి ప్రేమించలేదనే పగతో ఆమె కుటుంబాన్ని మట్టుబెట్టాడు.

మంగళూరుకు వెళ్లి, ఆపై బెళగావికి

హత్యాస్థలి నుంచి ఉడుపి బస్టాండుకు వెళ్లాడు. రెండు సార్లు బైకిస్టులను లిఫ్టు అడిగి, ఒకసారి ఆటోలో ఎక్కి బస్టాండుకు చేరుకున్నాడు. హత్య సమయంలో పెనుగులాటలో చేతికి గాయం కాగా, ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఆపై ఫోన్‌ను స్విచాఫ్ చేసి మంగళూరుకు వెళ్లాడు. మంగళూరులో తన కుటుంబంతో కలిసి దీపావళి పండుగను చేసుకుని, ఆపై బయటకు వెళ్లి సంతోషంగా గడిపాడు. తరువాత రోజు ఒక్కడే కారులో బయలుదేరి బెళగావికి చేరుకున్నాడు. అక్కడ తన మొబైల్‌ను ఆన్ చేశాడు. ఉడుపి పోలీసుల సూచనతో బెళగావి జిల్లా కుడిచి పోలీసులు అతన్ని ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించి అరెస్ట్ చేశారు.

దళారుల చేతిలో ఉల్లి రైతు విలవిల



మార్కెట్‌లో నిల్వ ఉన్న ఉల్లిగడ్డలు

రాయచూరు రూరల్: పంట పండించిన రైతులు దళారుల చేతిలో నలిగి విలవిలలాడుతున్నారు. ఏపీఎంసీకి రైతులు తాము పండించిన పంటలను తెచ్చినా కొనుగోలు చేయకుండా దుకాణాల యజమానులు చేతులు దులుపుకుంటున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెచ్చిన ఉల్లిగడ్డలను ఏపీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు చేయక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు ఏపీఎంసీ అధికారులు ఉల్లిగడ్డల కొనుగోలుకు ముందుకు వచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి రాయచూరు ఏపీఎంసీకి ఉల్లిగడ్డలు వస్తున్నాయి. బస్తా ధర రూ.4400లుగా నిర్ణయించారు. జిల్లాలో ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. జిల్లాలో 800 హెక్టార్లలో ఉల్లి పంటను పండించారు. మద్దతు ధరలు ప్రకటించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రాయచూరు ఏపీఎంసీలో రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలను అధిక ధరకు విక్రయించడం కోసం వ్యాపారస్తులు గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడులకు లారీల్లో తరలిస్తున్నారు. గతంలో రైతులు ఉల్లిని తక్కువ ధరకు విక్రయించారు. నేడు ధర మూడింతలు పెరగడంతో కొనుగోలుదారులు దిక్కులు చూస్తున్నారు.

క్షతగాత్రుడి మృతి



విశాలగౌడ(ఫైల్)

మండ్య : మద్దూరు పట్టణంలోని కేఎస్ ఆర్టీసీ డిపో సమీపంలో ఈనెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మద్దూరు తాలూకా అజ్జహళ్లిలోని మరిస్వామి కుమారుడు విశాల్‌గౌడ(18) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇతను స్నేహితులు కార్తిక్, దర్శన్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా బెంగళూరు –మైసూరు జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన విశాలగౌడ, కార్తీక్‌ను బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విశాల్‌గౌడ మృతి చెందాడు.


కుమారస్వామికి మానసిక స్థితి సరిగా లేదు

- సీఎం సిద్ధరామయ్య

మండ్య : జేడీఎస్ ఓటమితో మాజీ సీఎం హెచ్.డి కుమార స్వామి నిరాశకు గురై మానసిక పరిస్థితి బాగా లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. మండ్య జిల్లా మద్దూరు తాలూకా ఆతగూరు సమీపంలో ఉన్న కదలూరు గ్రామానికి వచ్చిన సీఎం మీడియాతో మాట్లాడారు. ఇకపై జేడీఎస్ అధికారంలోకి రాదన్నారు. ఈ విషయం కుమారస్వామికి అవగతమై మానసికంగా ఆందోళనలో ఉన్నారన్నారు.

గాలి జనార్ధనరెడ్డికి బీజేపీ గాలం?

- చేరిక కోసం విజయేంద్ర చర్చలు!



ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి(ఫైల్)

సాక్షి, బళ్లారి: కర్ణాటక మాజీ మంత్రి, కేఆర్‌పీపీ వ్యవస్థాపకులు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన రెడ్డిని మళ్లీ సొంత గూటిలోకి చేర్చుకునేందుకు బీజేపీ నేతలు చర్చలు జరుపుతున్నారా? రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు విజయేంద్ర గాలితో చర్చలు జరిపారా అనే ప్రశ్నలు గట్టిగా వినిపిస్తున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గాలి జనార్దనరెడ్డి లేకపోతే బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాలతో పాటు రాష్ట్రంలో మరో ఐదారు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆయన ప్రభావంతో పార్టీకి నష్టం జరుగుతుందన్న భయంతో గాలికి బీజేపీ గాలం వేస్తోందని సమాచారం.

పార్టీ బలోపేతానికి

గాలి జనార్దనరెడ్డికి బీజేపీతో అవినాభావ సంబంధం ఉండేది. అయితే గనుల కేసులు, అరెస్టుల నేపథ్యంలో పార్టీతో దూరం పెరిగింది. గత ఎన్నికల్లో సొంతంగా పార్టీ పెట్టి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మారిన పరిస్థితుల్లో రాష్ట్రంలో బలం పెంచుకోవాలంటే బలమైన నాయకులందరినీ చేర్చుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో గాలి జనార్దనరెడ్డితో విజయేంద్ర సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

తుమకూరు : దేశ ప్రధానిగా దివంగత ఇందిరాగాంధీ అందించిన సేవలు మరువలేనివని తుమకూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ అన్నారు. తుమకూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఇందిర చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. దేశాభివృద్ధికి ఆమె అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. మహిళల్లో ఆత్మస్థైర్యం నింపారన్నారు.

మండ్య: దివంగత ఇందిరాగాంధీ రాజకీయ, నీతి, ఆమె ఆదర్శాలు నేటి యువతకు, రాజకీయ నాయకులకు స్ఫూర్తి అని మండ్య జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అంజనా శ్రీకాంత్ అన్నారు. మండ్యలోని ఇందిరా క్యాంటీన్ వద్ద నిర్వహించిన ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం



నోటు పుస్తకాలు అందజేసిన దృశ్యం

తుమకూరు : తుమకూరు నగరంలోని మరళూరు దిన్నెలోని యాదవ నగరలో జయకర్ణాటక సంఘటన ఆధ్వర్యంలో ఆదివారం కన్నడ రాజ్యోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర సమన్వయ కార్యదర్శి సి.పి. సుధీర్ కన్నడ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. కంటిదోషం ఉన్నవారికి వైద్య పరీక్షలు చేశారు. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేశారు.

కోలారు వార్తలు...

సహకార రత్నకు సన్మానం



ఎమ్మెల్యే నంజేగౌడను అభినందిస్తున్న దృశ్యం

కోలారు: సహకార రత్న అవార్డు గ్రహీత, మాలూరు ఎమ్మెల్యే, కోచిముల్ అధ్యక్షుడు కెవై నంజేగౌడను ఆదివారం కోచిముల్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సహకార రంగంలో అపార సేవలు అందించిన నంజేగౌడకు సహకార రత్న అవార్డు లభించడం హర్షణీయమన్నారు. ఆ అవార్డుకు ఆయన అన్ని విధాలా అర్హుడన్నారు. సన్మానం స్వీకరించి మాట్లాడిన ఎమ్మెల్యే తాను తన 20 ఏళ్ల వయస్సులోనే సహకార రంగంలోకి అడుగుపెట్టానన్నారు. 1985లో మొట్టమొదటి సారిగా 35 మంది యువకులతో కలిసి సహకార సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. నాటి నుంచి నేటి వరకు సహకార రంగానికి సేవలు అందిస్తున్నానన్నారు. ఈ నెల 20న వీ.వీ.పురలో జరిగే సహకార సప్తాహ ముగింపు కార్యక్రమంలో అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోబోతున్నట్లు తెలిపారు. డీసీసీ కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.జయదేవ్, ఎస్టీ సెల్ జిల్లాధ్యక్షుడు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ రక్షణకే సీఎం ఆరాటం



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రు

మాలూరు: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని, ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన కుర్చీని కాపాడుకునేందుకు పెడుతున్న శ్రద్ధ పరిపాలనపై చూపించడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు ఆరోపించారు. ఆయన ఆదివారం పట్టణంలోని పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా నిలిచి పోయాయన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీలు సర్వాధికార ధోరణితో పాలన సాగించడం వల్ల రాష్ట్రం ఎంతో వెనుకబడి పోయిందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ గత తొమ్మిదేళ్లుగా సర్వాధికార ధోరణిలోనే పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదన్నారు. వీరి వల్ల ప్రజా ప్రభుత్వ వ్యవస్థకు అర్థం లేకుండా పోయిందన్నారు. మూడు పార్టీలు కుటుంబ రాజకీయాలకు పెట్టిన పేరన్నారు. మూడు పార్టీలకు వ్యతిరేకంగా ఆప్ పోరాటం చేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆప్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎం.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులేవీ?

కోలారు: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, అనంతరం ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని జిల్లా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని భారత సేవాదళ్ కార్యాలయంలో నిర్వహించిన నివృత్త ప్రధానోపాధ్యాయుడు కె.వి. జగన్నాథ అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పదోన్నతి ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. అక్షర దాసోహ కార్యక్రమంలో భాగంగా గుడ్లు, మసాలా పదార్థాలు, కూరగాయలు తదితర సౌలభ్యాలను విద్యార్థులకు అందించడానికి కష్టం అవుతోందని, అక్షర దాసోహ వ్యయాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్షర దాసోహ పథకానికి సంబంధించిన పలు సమస్యలను ఇప్పటికే జెడ్పీ సీఈఓ దృష్టికి తీసుకు వెళ్లారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎంవీ జనార్ధన్, కోశాధ్యక్షుడు మునేగౌడ తదితరులు పాల్గొన్నారు.


విద్య దేశాభివృద్ధికి సంకేతం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: సమాజంలోని ప్రతి ఒక్కరికీ విద్య అందించడం దేశాభివృద్ధికి సంకేతమని పీయూసీ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప తెలిపారు. ఆదివారం అల్ అమీన్ పాఠశాల క్యాంపస్‌లో అమీన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉర్దూ సాహిత్య సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ ఇమిడి ఉంటుందని, సరైన సమయంలో వెలికి తీయాలన్నారు. మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పెద్ద కలలను కలిగి వాటి సాకారానికి నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సలహా ఇచ్చారు. పీబీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ మన్సూర్ మోమిన్ మాట్లాడుతూ ఉర్దూ భాష సుగంధభరితమై ఉందని, అల్ అమీన్ ఉర్దూ పాఠశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. సొసైటీ చైర్మన్ ఉమర్ ఇస్మాయిల్ ఖాన్, కార్యదర్శి జుబైల్ అన్వర్ సేట్, సంయుక్త కార్యదర్శి ఇబ్రాహీం అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో సోదాలు



మెడికల్ షాపులో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

కోలారు: యువతను మాదక ద్రవ్యాల బారి నుంచి దూరం చేయడం కోసం జిల్లా పోలీసులు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా నగరంలో ఆదివారం పలు మందుల దుకాణాల్లో సోదాలు చేపట్టారు. పోలీసులు ఇప్పటికే తాలూకాలోని విద్యా సంస్థల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులను జాగృతం చేశారు. మందుల దుకాణాల్లో కూడా అనుమతి లేని మందులను, మత్తును కలిగించే మందులను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో పోలీసులు ఈ సోదాలను చేపట్టారు.

గంజాయి విక్రేత అరెస్టు

మాలూరు: పట్టణంలోని హోసూరు మెయిన్ రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారంతో పోలీసులు దాడి చేశారు. హెచ్.హొసకోటె గ్రామానికి చెందిన నాజిద్ పట్టుబడగా, మరో నిందితుడు సొణ్ణూరు గ్రామానికి చెందిన ప్రశాంత్ పరారయ్యాడు. అతని వద్ద నుంచి రూ.75 వేల విలువ చేసే 1.525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు ప్రశాంత్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సత్య సాయి వైభవం



శోభాయమానంగా తీర్చిదిద్దిన సత్యసాయి మహాసమాధి



హాజరైన భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఎటు చూసినా సత్యసాయి నామం మార్మోగుతోంది. ఉత్సవాలను కనులారా వీక్షించేందుకు దేశ విదేశాలనుంచి వేలాది మంది భక్తులు విచ్చేస్తున్నారు. ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను ప్రశాంతి నియలంలోని సాయి కుల్వంత్ సభా మందిరంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి విద్యాసంస్థ విద్యార్థినులు సత్యసాయిని కీర్తిస్తూ నాదస్వరం వాయించారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. మహిళ అంటే సబల కాదని, లోకాన్ని తీర్చిదిద్దే దివశ్శక్తి అని సత్యసాయి చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి అవతార వైభవాన్ని వివరిస్తూ సత్యసాయి విద్యార్థినులు నిర్వహించిన నృత్యనాటిక భక్తులను పరవశింపజేసింది. సత్యసాయి 98వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్ బృందం సంగీత విభావరి నిర్వహించారు.



సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటున్న కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే



ప్రసంగిస్తున్న రాజమాత ప్రమోదాదేవి



సత్యసాయిని కీర్తిస్తూ నృత్యనాటికలోని ఘట్టం

క్లుప్తంగా

రైతులకు సహకార రంగం తోడ్పాటు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంజినప్ప

బొమ్మనహళ్లి : సహకార రంగం తోడ్పాటుతోనే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని సహకార రత్న బమూల్ మాజీ అధ్యక్షుడు బీ.జీ. ఆంజినప్ప అన్నారు. ఆనేకల్‌లోని సహకార సంఘం కార్యాలయంలో రాష్ట్ర సహకార మహా మండలి, బెంగళూరు నగర జిల్లా సహకార సమాఖ్య, బెంగళూరు సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన 70వ అఖిల భారత సహకార సప్తాహ సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సహకార రంగంలో రుణాలు తీసుకొని రైతులు పంటల సాగుకు వినియోగించుకోవాలన్నారు. బమూల్ అధ్యక్షుడు హెచ్.టి. నాగేష్, ఆనేకల్ తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సహకార సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి, బెంగళూరు నగర జిల్లా సహకార సంఘం కోశాధికారి వెంకటేష్, డైరెక్టర్ అమరేష్ రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ విభాగంలోనే ఎక్కువ ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రవీంద్ర

గౌరిబిదనూరు: చిక్కబళ్లాపురం జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ రవీంద్ర తెలిపారు. మంచేనహళ్లి పట్టణ పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన జనతా దర్శన్‌లో పాల్గొని ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో 17 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. రెవెన్యూ శాఖలో ఫిర్యాదులు ఎక్కువగా అందుతున్నాయన్నారు. వాటిని సత్వరం పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మంచేనహళ్లిలో తాలూకా కార్యాలయం, తాలూకా పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని, తదుపరి దశలవారీగా ఇతర కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అడిషనల్ కలెక్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు.

శ్మశానంలో కంపచెట్ల తొలగింపు



శ్మశానాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: తాలూకా అనూడి గ్రామంలో దళితులకు కేటాయించిన శ్మశానవాటికకు సరైన దారి లేకపోవడంతో జయకర్ణాటక తాలూకా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ గతంలో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. శ్మశాన స్థలాన్ని సర్వే చేయాలని తహసీల్దార్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో సర్వే సమయంలో అనుకూలంగా ఉండేందుకు చెట్లను జయకర్ణాటక నేతలు ఆదివారం జేసీబీలతో తొలగింపజేశారు.

మహిళ ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన దేవనహళ్లి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలో నివాసం ఉంటున్న ఉమేష్ దేవిక(21) అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజులు వారి దాంపత్య జీవితం సవ్యంగానే సాగింది. అనంతరం సంసారంలో గొడవలు వచ్చాయి. దీపావళి రోజు కూడా భర్త ఇంటికి రాలేదని దేవిక ఆవేదనకు గురైంది. ఈక్రమంలో భర్తకు వీడియో కాల్ చేసి మాట్లాడగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికలో ఆమె గర్భిణి అని తేలింది. ఉమేష్ వేధింపులు తాళలేక తన చెల్లెలు ఆత్మహత్యకు పాల్పడినట్లు దేవిక సోదరుడు ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఉమేష్‌ను అరెస్ట్ చేశారు.

కెనరా బ్యాంక్ మారథాన్



విజేతలతో బ్యాంకు ప్రముఖులు

సాక్షి బెంగళూరు: కెనరా బ్యాంక్ తన మొదటి మారథాన్‌ను బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఆదివారం నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో కె సత్యనారాయణ రాజుతో పాటు బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విజయ్ శ్రీరంగన్, బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దేబాశిష్ ముఖర్జీ, అశోక్ చంద్ర, హర్దీప్ సింగ్ అహ్లువాలియా, భావేంద్ర కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కెనరా ఫన్ రన్ (3 కి.మీ.), కెనరా సేవింగ్స్ రన్ (5 కి.మీ.) కెనరా ప్రీమియం రన్ (10 కి.మీ.) అనే మూడు వేర్వేరు విభాగాల్లో 7000 మంది పోటీపడ్డారు. 10కే, 5కే విజేతలకు వరుసగా రూ.2 లక్షలు, రూ. లక్ష నగదు బహుమతిని ప్రదానం చేశారు.



మైసూరులో మొబైల్ ఫోన్‌లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న నగరవాసులు



ప్రజలందరూ టీవీల ముందు చేరడంతో మైసూరులో నిర్మానుష్యంగా ఉన్న ఓ వీధి

అంతటా క్రికెట్ ఉత్కంఠ

- అభిమానుల సందడి





క్రికెట్ మ్యాచ్ గెలవాలని బనశంకరీ మాతకు పూజలు చేసిన దృశ్యం, ప్రపంచ కప్ నమూనాలో రంగోళి

బనశంకరి: క్రికెట్ ప్రపంచ కప్ టోర్నమెంటులో భారతదేశ జట్టు విజేతగా నిలిచి కప్‌ను కైవసం చేసుకోవాలని రాష్ట్రంలో క్రికెట్ అభిమానులు ఆకాంక్షించారు. కొందరు ఇళ్లలో, ఆలయాల్లో విశేష పూజలు కూడా నిర్వహించారు. బెంగళూరులో బనశంకరీ దేవస్థానంలో ప్రత్యేకపూజలు, హోమం నిర్వహించారు. ఆదివారం వేకువజామున అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్ అభిషేకం, అర్చనలు చేపట్టి జాతీయపతాకం, పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారత్ విజయం కోరుతూ యాగశాలలో హోమం జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అంతటా పూజలు

శివాజీనగర: ఆస్ట్రేలియాపై పోటీపడుతున్న ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ పోటీలో భారత జట్టు గెలుపొందాలని ఆకాంక్షిస్తూ వివిధ భాగాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిగాయి. బెంగళూరుతో పాటుగా రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు నీలిరంగు దుస్తులు ధరించి దేవాలయాలలో, వీధుల్లో పూజలు, హోమాలు నెరవేర్చారు.

సహకార రత్న ప్రశస్తికి ఎంపిక



హనుమంతరెడ్డి

గౌరిబిదనూరు: తాలూకా మరళూరు గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి సహకార రత్న ప్రశస్తికి ఎంపికయ్యారని మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. బిజాపూర్‌లో సోమవారం జరిగే సహకార సప్తాహం ముగింపు సమావేశాల్లో సీఎం సిద్దరామయ్య, మంత్రి రాజన్న చేతుల మీదుగా హనుమంతరెడ్డికి సహకార రత్న ప్రశస్తిని అందజేయనున్నట్లు తెలిపారు. కోలారు చిక్కబళ్లాపురం జిల్లాల్లో డీసీసీ బ్యాంకు డైరెక్టరుగా చేసిన సేవలు, రైతుల సంక్షేమానికి అందించిన సేవలను గుర్తించి అయన్ను ఈ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు.

సీఎంపై కుమార విమర్శలు

దొడ్డబళ్లాపురం: సీఎస్ఆర్ అంటే కరప్ట్ సన్ ఆఫ్ సిద్ధరామయ్య అంటూ మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి ఎక్స్ వేదికగా సీఎం సిద్దరామయ్య, ఆయన కుమారుడు యతీంద్రపై ఘాటు విమర్శలు గుప్పించారు. సీఎం సిద్ధరామయ్యకు అధికారం అనే అంటురోగం అంటుకుందని ధ్వజమెత్తారు. 'మంత్రులను బౌన్సర్లుగా నియమించుకున్నారా? నాపై అందరితో మూకుమ్మడిగా దాడి చేయిస్తే కుమారస్వామి బెదిరిపోతాడనుకున్నారా?అంతసీను లేదు' అంటూ కుమార ట్వీట్ చేశారు. మీ కుమారుడిని ఆశ్రయ కమిటీ అధ్యక్షుడిగా చేసి కేడీపీ సభ జరపడానికి అనుమతి ఇచ్చారా? ఇలా చేయవచ్చని ఏ చట్టంలో ఉంది? అని ప్రశ్నించారు.రాష్ట్ర ముఖ్యమంత్రినే టెలిఫోన్ ఆపరేటర్ చేసిన మీ కుమారుడిని ఇంకా సమర్థిస్తారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

నేత్రపర్వంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరులోని బొమ్మనహళ్లి పరిధిలోకి వచ్చే హెచ్ఎస్ఆర్ లేఔట్ అటల్ బిహారి వాజ్ పాయ్ క్రీడా మైదానంలో హెచ్ఎస్ఆర్ లేఔట్ శ్రీశ్రీనివాస కల్యాణోత్సవ సమితి 14వ ఏడాది శ్రీనివాస కల్యాణం శనివారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. బొమ్మనహళ్లితోపాటు చుట్టుపక్కల ప్రాంతాలనుంచ వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించి పులకించిపోయారు. శ్రీవాదిరాజ్ రాయచూరు, శ్రీనివాస ఉత్సవ సమితి, బెంగళూరు నగరం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో డాక్టర్ రాయచూరు శేషగిరిరావ్, విదూషి శుభ సంతోష్ ఆలపించిన భక్తిగేయాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఉడుపికి చెందిన శ్రీగోపాలాచార్‌లు స్వామి వారి కల్యాణోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. స్వామివారి కల్యాణం భక్తులకు తిరుపతి లడ్డూలను ప్రసాదంగా పంపిణీ చేశారు. బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి, కల్యాణోత్సవ సమితి కమిటీ సభ్యులు ప్రొఫెస్ సదాశివరెడ్డి, నారాయణ స్వామి, శ్రీధర్ రెడ్డి, అనిల్ ఎస్. రెడ్డి, జయరామ రెడ్డి, కే.వాసుదేవ, మాజీ కార్పొరేటర్, గురుమూర్తి రెడ్డి, ఆరోగ్య స్థాయి సమితి మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు

జాతీయ ఐక్యతా ప్రమాణ వచన బోధన

శివాజీనగర: మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని విధానసౌధ సమ్మేళనా సభా మందిరంలో సీఎం సిద్దరామయ్య ఆదివారం సచివాలయ అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యతా ప్రమాణ వచనాన్ని బోధించారు. కార్యక్రమంలో నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్, సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు, ఎమ్మెల్యే నరేంద్రస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వందితా శర్మ, సీఎం అదనపు ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయల్, అదనపు ప్రధాన కార్యదర్శి, అభివృద్ధి కమిషనర్ శాలిని రజనీశ్‌తో పాటుగా సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కండక్టర్‌పై యువకుల దాడి

మైసూరు : కండక్టర్ చిల్లర ఇవ్వలేదని యువకులు దాడికి పాల్పడ్డారు. ఈఘటన మైసూరులో జరిగింది. వివరాలు...గుండ్లుపేటె కేఎస్ ఆర్టీసీ డిపో నుంచి మైసూరులోని గన్ హౌస్‌కు వెళ్తున్న బస్సులో ఎక్కిన ఇద్దరు యువకులు టికెట్ తీసుకున్నారు. ఆ సమయంలో చిల్లర సమస్య ఏర్పడింది. ఒకరికి డబ్బు ఇచ్చి ఇద్దరూ పంచుకోవాలని కండక్టర్ మల్లికార్జున వారికి సూచించాడు. అయితే నేరుగా చిల్లర డబ్బు ఇవ్వకుండా మమ్ములనే చిల్లర పంచుకోవాలని చెబుతావా అంటూ యువకులు కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో దాడి చేశారు. దాంతో కండక్టర్ నజరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆపద్బాంధవుల్లా వచ్చారు

- ఇద్దరు వైద్యులకు ప్రశంసలు

యశవంతపుర: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడగా అదే మార్గంలో వెళ్తున్న వైద్యులు చికిత్స చేసి ప్రాణాలు పోశాడు. దీంతో వైద్యుడిపై ప్రశంసలు వెల్లువెత్తాయి. కై లాస, దినేష్ హెగ్డే అనే వైద్యులు ఆదివారం హుబ్లీకి వెళ్తుండగా శిరసి వద్ద ఓ మహిళ రోడ్డు ప్రమాదానికి గురై రోడ్డు పక్కన పడిపోయింది. గమనించిన సదరు వైద్యులు ఘటన స్థలంలోనే మహిళకు ప్రాథమిక చికిత్స చేసి ఆస్పత్రికి తరలించారు. ఈ దృశ్యాలు సమాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. వైద్యుల సమయస్ఫూర్తిపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

చిన్నారి అనుమానాస్పద మృతి

యశవంతపుర: అనుమానస్పద స్థితిలో ఏడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన బెంగళూరు ఉత్తర తాలూకా గంగోండహళ్లిలో జరిగింది. వినోద్, నళిని దంపతుల కుమార్తె అకృతి(7) తమ ఇంటి పక్కలోనే నివాసం ఉంటున్న నంజుండప్ప, పల్లవి ఇంటికి వెళ్లింది. అనంతరం బాలిక విగత జీవిగా కనిపించింది. పోలీసులు వచ్చి పరిశీలించారు. చిన్నారి ఎలా మృతి చెందిందో అర్థం కావటంలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

'కుమారస్వామి ముందు నుంచి అంతే'

మైసూరు: భూ సుధారణ సవరణ చట్టానికి శాసనసభలో బీజేపీకి మద్దతు ఇచ్చి బయటకు వచ్చి వ్యతిరేకంగా ధర్నా చేసిన వ్యక్తి జేడీఎస్ నేత హెచ్.డి కుమారస్వామి అని, ఆయనకు సైద్ధాంతిక స్పష్టత లేదని మంత్రి హెచ్.సి. మహాదేవప్ప అన్నారు. యతీంద్ర సీఎం సిద్దరామయ్యతో మొబైల్‌ఫోన్ సంభాషణ గురించి కుమార ఆరోపణలు చేయడం తగదన్నారు. కుమారస్వామికి మొదటి నుంచి ఇలాగే తప్పుడు ఆరోపణలు చేయడం ఆయన సహజ గుణమని అన్నారు.

తల్లిదండ్రులతో సమానంగా కన్నడకు గౌరవం



పురస్కారాలు అందజేసిన దృశ్యం

- నటుడు రమేశ్ అరవింద్
- ఘనంగా కన్నడ రాజ్యోత్సవం
- పలువురికి కర్ణాటక రత్న డాక్టర్ పునీత్‌రాజ్ కుమార్ పురస్కారాల ప్రదానం

బనశంకరి: తల్లిదండ్రులతో సమానంగా కన్నడ భాషకు గౌరవం ఇవ్వాలని నటుడు రమేశ్ అరవింద్ సూచించారు. శనివారం రాత్రి బీబీఎంపీ కేంద్ర కార్యాలయ ఆవరణలో బృహత్ బెంగళూరు మహానగర పాలికె ఉద్యోగుల కన్నడ సంఘం ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం, కర్ణాటక రత్న డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. నటుడు రమేశ్ అరవింద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తమ రోడ్లు, ఉద్యానవనాలు, స్వచ్ఛతకు బీబీఎంపీ కారణమన్నారు. పంపకవి, బసవణ్ణ, అనేక మంది సాహితీకారులు కన్నడభాష అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. అనంతరం నటుడు సుందరరాజ్ మాట్లాడుతూ నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్న పౌరకార్మికుల ఆరోగ్యాలను పరిరక్షించాలన్నారు. బీబీఎంపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏ.అమృతరాజ్ మాట్లాడుతూ ఈ నెల 25 తేదీన నేపాల్ పశుపతినాథ ఆలయంలో అంతర్జాతీయ కర్ణాటక రాజ్యోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సాధన చేసినవారికి డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ పేరుతో పురస్కారాలు అందజేశారు.

అవార్డులు అందుకున్నవారు వీరే

కర్ణాటక వికాసవేదిక అధ్యక్షుడు పాలనేత్ర, కన్నడ చళువళి కేంద్ర సమితి అధ్యక్షుడు గురుదత్త , నటి ప్రమీళజోషాయ్ తరపున సుందరరాజ్, శివకుమార్, రిషిగౌడ, ప్రేమగౌడ, రక్షాఅపూర్వ, ప్రతిభ, మాలతేశ్, వసంత్‌కుమార్, స్మితారంగనాథ్, శీతల్‌శెట్టి, మంజునాథ్, అల్లావుద్దీన్, పురుషోత్తమ్, కొండయ్య , పుట్టరాజు, డొళ్లుకుణిత కళాకారుడు చంద్రు, యోగా క్రీడాసంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, మరో 20 మంది బీబీఎంపీ అధికారులకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో పాలికె పాలనాధికారి రాకేశ్‌సింగ్, కమిషనర్ తుషార్‌గిరినాథ్ మాజీ మేయర్ హుచ్చప్ప, ప్రత్యేక కమిషనర్లు కేవీ.త్రిలోక్‌చంద్ర, మౌనిశ్‌ముద్గిల్, కే.హరీశ్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

పాత మైసూరుకు నాల్వడి కర్ణాటకగా నామకరణం చేయాలి

మండ్య: పాత మైసూరు ప్రాంతానికి నాల్వడి కర్ణాటక అని నామకరణం చేయాలని మైసూరు వర్సిటీ మాజీ సిండికేట్ సభ్యుడు ఈ.సి. నింగరాజు గౌడ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డాక్టర్ జీ.శం. ప.సాహిత్య వేదిక, రాజర్సి నాల్వడి కృష్ణరాజ ఒడెయర్ యువసేన ఆధ్వర్యంలో మండ్యలోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన కన్నడ హబ్బ, నాల్గవ కన్నడ అక్షర జాతర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1952 నుంచి 1973 వరకు రాష్ట్రాన్ని పాత మైసూరుగా పిలిచేవారని గుర్తు చేశారు. పాతమైసూరుకు అంతటి ప్రాముఖ్యత ఉందన్నారు.

విమానాశ్రయంలో బంగారం పట్టివేత

దొడ్డబళ్లాపురం: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని మంగళూరు విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 13, 18వ తేదీల్లో ఇండిగో 6ఈ1163 విమానం, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్ 814 విమానంలో దుబాయ్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను అనుమానంతో సోదా చేయగా అక్రమంగా తరలిస్తున్న 322గ్రాముల బంగారం పట్టుబడింది. దీని విలువ రూ.51,84,850లుగా అధికారులు తెలిపారు.



పట్టుబడ్డ బంగారం

హోసూరు వార్తలు..

రైతు బజారును ప్రక్షాళన చేయాలి



సంఘ సమావేశంలో మాట్లాడుతున్న రామగౌండర్

హోసూరు: హోసూరులోని రైతు బజారును ప్రక్షాళన చేయాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ఎం.రామగౌండర్ డిమాండ్‌చేశారు. ఆదివారం హోసూరు రైతు బజారు ముందు జరిగిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బజారులో రైతులు మాత్రమే అమ్మకాలు జరపాలి, కానీ కొంత మంది నకిలీ అనుమతి కార్డులు తయారు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారన్నారు. రైతు బజారు లోపల పశువులు, మేకలు సంచరిస్తూ వ్యాపారులు, జనంపై దాడులు చేస్తున్నాయన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రైతు బజారు అధికారులు సకాలంలో వచ్చి కాయగూరల ధరలను నిర్ణయించాలని అన్నారు. కెలమంగలం పట్టణ పంచాయతీలో రైతు బజారు ఏర్పాటు చేయాలని, అటవీ ప్రాంత గ్రామాల్లో వన్య మృగాల దాడులను నివారించాలని, ఏనుగులు, అడవి పందుల దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు లక్ష పరిహారం అందజేయాలని తీర్మానాలను చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కావేరప్ప, సంపత్ కుమార్, మంజునాథ్‌రెడ్డి, మాదప్ప, సుబ్రమణిరెడ్డి, వణ్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న వ్యాన్

- 10 మందికి గాయాలు

హోసూరు: ముందు వెళుతున్న లారీని వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో పది మందికి గాయాలేర్పడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. వివరాలు.. బెంగళూరు దగ్గర మాగడి ప్రాంతానికి చెందిన భాస్కర్ (50) రెండు రోజుల క్రితం చెన్నైకు వెళ్లి శనివారం వ్యాన్‌లో మరికొందరితో తిరుగు ప్రయాణమయ్యాడు. క్రిష్ణగిరి - హోసూరు జాతీయ రహదారి పేరండపల్లి వద్ద ముందు వెళుతున్న లారీని వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కర్, వ్యాన్ డ్రైవర్ మనోజ్, 5 మంది మహిళలతో పాటు 10 మందికి తీవ్ర గాయాలు తగిలాయి. స్థానికులు వెంటనే బాధితులను హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సానంతరం బెంగళూరుకు తీసుకెళ్లారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్య శిబిరం

హోసూరు: పట్టణంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిచే ఆదివారం అరసనట్టి అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ గాంధిమతి కణ్ణన్ ప్రారంభించారు. రోగులకు హృద్రోగ పరీక్షలు, కీళ్ల నొప్పులు, మహిళలకు చెకప్స్ నిర్వహించారు. అరసనట్టి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొని వైద్య చికిత్సలు చేయించుకొన్నారు.

సైబర్ మోసాలకు గురికావద్దు

- పోలీసుల హెచ్చరిక



అధిక సంపాదన ఆశతో అవస్థలు

హోసూరు: హోసూరు, క్రిష్ణగిరి ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులపై సైబర్ దొంగలు నిఘాపెట్టి లక్షల రూపాయలు దోచుకొంటున్నారని, ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని క్రైం బ్రాంచ్ పోలీసులు హెచ్చరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు హోసూరు, క్రిష్ణగిరి ప్రాంతాల్లో నివాసముంటూ హోసూరు, బెంగళూరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఐటి కంపెనీల్లో పనిచేస్తున్నారు. వీరిలో కొంత మంది ఇంటిలోనే ఉంటూ ఉద్యోగం చేస్తుంటారు. మరోవైపు ఆన్‌లైన్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ డబ్బులు సంపాదించాలని ఆశపడుతూ సైబర్ నేరగాళ్లకు చిక్కి ఉన్న డబ్బులను కూడా కోల్పోతున్నారు. ఇంటి వద్ద కంపెనీల పర్యవేక్షణ ఉండకపోవడం వల్ల సమయాన్ని వృథా చేయక పార్ట్ టైం ఉద్యోగాలు, వ్యాపారాలపై మక్కువ చూపడంతో సైబర్ దొంగలు వారి వద్ద ఉన్న డబ్బులను కాజేస్తున్నారని పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లపై స్పందించరాదని, ఆన్‌లైన్ బిజినెస్‌పై మక్కువ చూపి మోసపోరాదని పోలీసులు పేర్కొన్నారు.

ఆస్తి గొడవల్లో ఒకరిపై దాడి

హోసూరు: ఆస్తి తగాదాల్లో కార్మికునిపై దాడి చేసిన నలుగురిని హోసూరు పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని ఆవులపల్లి హడ్కో ప్రాంతానికి చెందిన జయశంకరరెడ్డి (44) హోసూరులోని ప్రైవేటు పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఇతనికి, బంధువుల మధ్య ఆస్తి తగాదాలుండేవి. శనివారం చెన్నత్తూరు వద్ద ఉన్న పొలం వద్దకెళ్లిన జయశంకర్‌రెడ్డిపై బంధువులు నందకుమార్ (32), మోపురెడ్డి (51), వాసుదేవరెడ్డి (56), ఉమాశంకరరెడ్డి (47)లు దాడి చేశారు. గాయపడిన జయశంకరరెడ్డిని స్థానికులు చూసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని ఫిర్యాదు మేరకు నలుగురిని అరెస్ట్ చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

క్రిష్ణగిరి: తన భార్యను ఓ వ్యక్తి కిడ్నాప్ చేశాడని భర్త కురుబరపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కురుబరపల్లి సమీపంలోని కొత్తక్రిష్ణేపల్లి ప్రాంతానికి చెందిన అరుణ్‌రాజ్ భార్య రమ్య (27) 15వ తేదీ ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియలేదు. స్థానికుల సమాచారం మేరకు విరుదునగర్ జిల్లాకు చెందిన అరుణ్ (27) రమ్యను కిడ్నాప్ చేసినట్లు తెలిసి కురుబరపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

రాయల ఉత్సవాలు సమాప్తం



నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

హోసూరు: రెండు రోజులుగా హోసూరులోని ఆంధ్ర సాంస్కృతిక సమితిలో జరుగుతూ వచ్చిన శ్రీ కృష్ణదేవరాయల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శనివారం రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముఖ్య అతిథిగా హైదరాబాద్ పొట్టి శ్రీరాముల వర్సిటీ వీసీ ఆచార్య తంగెడు కిషన్‌రావు పాల్గొన్నారు. సమ్మెట మాధవరాజుచే శ్రీ కృష్ణదేవరాయల సాహిత్య పోషణపై ఉపన్యసించారు. తిరుపతికి చెందిన గారపాటి దామోదరంనాయుడుచే శ్రీనాథ మహాకవి కవితావైభవం, మధ్యాహ్నం 2 గంటలకు గండ్లూరి దత్తాత్రేయచే ఇంద్రసభ, స్థానిక కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున తెలుగు భాషాభిమానులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమితి ఉపాధ్యక్షుడు రంగారెడ్డి పాల్గొన్నారు.

బైక్‌లను ఢీకొన్న కారు.. ఇద్దరి మృతి

దొడ్డబళ్లాపురం: రెండు బైక్‌లను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన బెంగళూరు-మంగళూరు 75వ జాతీయ రహదారిపై మరూరు హ్యాండ్ పోస్టు వద్ద చోటుచేసుకుంది. మృతులను సింగ్రిగౌడనపాళ్య గ్రామం నివాసి గంగాధరయ్య(45), కుణిగల్ నివాసి రజాక్ బాషా(34)గా గుర్తించారు. మృతులు ఇద్దరూ సోలూరు మీదుగా కుణిగల్ వైపు వేర్వేరుగా బైక్‌లపై వెళ్తుండగా నారసంద్ర వంతెన వద్ద బెంగళూరు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. గంగాధరయ్య అక్కడికక్కడే మృతిచెందగా, రజాక్ బాషాను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారుతో పాటు డ్రైవర్ పరారయ్యాడు. కుదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

ప్రైవేటు పాఠశాలల రికగ్నిషన్ పెంపుపై హర్షం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు రెన్యువల్ ఆఫ్ రికగ్నిషన్‌ను 3 నుంచి 8 ఏళ్లకు పెంచడంపై ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ..ఆన్‌లైన్ లేకుండా ఆఫ్‌లైన్‌లో అనుమతులు పొందేలా వీలు కల్పించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో 4,000 పాఠశాలలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. రెన్యువల్ చివరి తేదీని అక్టోబర్ 31 నుంచి డిసెంబర్ 31 వరకు పెంచిన నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విశాఖ చేరుకున్న ఆస్ట్రేలియా క్రికెటర్లు



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఆస్ట్రేలియా క్రికెటర్లు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): ఆస్ట్రేలియా క్రికెట్ ఆటగాళ్లు ఆదివారం విశాఖ చేరుకున్నారు. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 23న జరగనున్న టీ20 మ్యాచ్‌లో పాల్గొనేందుకు జట్టు సభ్యులు వచ్చారు. వీరు విశాఖ విమానాశ్రయం నుంచి ప్రత్యేక బస్సులో నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు బయలుదేరారు. వీరిని చూసిన అభిమానులు ఫొటోలో తీసేందుకు యత్నించారు.

అమ్మ నుంచి చాలా నేర్చుకున్నా

తెలంగాణ


మహిళలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖాముఖి



సాక్షి, హైదరాబాద్: అమ్మ నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలంగాణ రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు వెల్లడించారు. ఆదివారం బేగంపేట్‌లోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో ఫ్యూచర్ ఫార్వార్డ్ తెలంగాణలో భాగంగా 'విమెన్ ఆస్క్ కేటీఆర్' ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా జీవితంలో ఉండటంతో తన తండ్రితో తక్కువ సమయం గడిపానన్నారు. 'మా అమ్మని చూసి చాలా నేర్చుకున్నా. నా భార్య కూడా చాలా ఓపికగా ఉంటుంది. నా చెల్లి చాలా డైనమిక్. మా కుటుంబంలోనే తనంత ధైర్యవంతులు లేరు. నా కూతురు ఇంత చిన్న వయసులోనే చాలా బాగా ఆలోచిస్తుంది. కూతురు పుట్టాక నా జీవితం చాలా మారింది'అని వివరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ఎక్కువ మంది మహిళలే ఉండటం గర్వకారణమన్నారు. కోవిడ్ సమయంలో సుచిత్రా ఎల్లా, మహిమా దాట్ల వంటివారు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. మహిళలు మానసికంగా చాలా బలంగా వుంటారని అన్నారు. తెలంగాణ, ఏపీలో మహిళలు స్త్రీనిధి రుణాలను 99 శాతం తిరిగి చెల్లిస్తున్నారని చెప్పారు. తాము మేనిఫెస్టోలో మహిళల కోసం ప్రత్యేకంగా పెట్టిన పథకాల్లో కొన్నింటిని పూర్తి చేశామని, ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని తెలిపారు.

డీప్ ఫేక్‌తో రాజకీయ నేతలకూ ప్రమాదమే..

డీప్ ఫేక్.. మహిళలకు మాత్రమే కాదు.. రాజకీయ నేతలకు సైతం ప్రమాదమేనని చెప్పారు. తమ ప్రత్యర్థులు డీప్ ఫేక్ వాడి దుష్ప్రచారం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఒక్కోసారి టాక్సిక్‌గా తయారవుతోందని, ప్రతిపక్షాలు సోషల్ మీడియాని వాడుకుని తమపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. మాట్లాడే హక్కుని ఎదుటివారిని దూషించడానికి వాడకూడదని స్పష్టం చేశారు.



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ సచివాలయం పరిధిలో అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..
వివరించే కార్యక్రమంలో భాగంగా..



ఏలూరు జిల్లా పెదవేగి మండలం గార్లమడుగు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

నామినేషన్‌పై అడ్డగోలు లూటీ!

ప్రజాధనాన్ని కొల్లగొట్టిన రామోజీ-యనమల బంధుగణం

- ఓ నిర్మాణ కంపెనీకి అంతులేని మేలు అంటూ ఈనాడు దుష్ప్రచారం
- గత సర్కారు హయాంలో పట్టిసీమ పనులు చేసింది అదే సంస్థ కాదా?
- ట్రాన్స్‌ట్రాయ్‌కి నాడు రూ.1,333 కోట్లు బాబు సంతర్పణ
- రివర్స్ టెండర్లతో రూ.660 కోట్ల ప్రజాధనాన్ని ఆదా చేసిన సీఎం జగన్
- పోలవరం పనుల్లో జాప్యం లేకుండా సీజన్‌లో వడివడిగా కొనసాగించేలా చర్యలు

సాక్షి, అమరావతి: అటు పేదలకు పథకాలు అందకూడదు.. ఇటు ప్రాజెక్టుల పనులు ముందుకు సాగకూడదు!! ఇదీ ఈనాడు దుర్బుద్ధి! ఇదే లక్ష్యంగా అస్మదీయులకు అడ్డగోలుగా.. అంటూ ఓ బురద కథనాన్ని పాఠకులపైకి వదిలింది. ఓ నిర్మాణ కంపెనీకి ప్రభుత్వం అంతులేని మేలు చేస్తోందంటూ రామోజీ అక్కసు వెళ్లగక్కారు. గత సర్కారు హయాంలోనూ ఇదే కంపెనీ కాంట్రాక్టు పనులు చేసిన విషయం ఆయనకు గుర్తులేదా? రామోజీ, యనమల బంధుగణం నవయుగ, పుట్టా సుధాకర్ యాదవ్ నామినేషన్‌పై పనులను దక్కించుకుని అంచనాలు పెంచేసి బిల్లులు కాజేయడం నిజం కాదా? నాటి సీఎం చంద్రబాబు అండతో ప్రజాధనాన్ని కొల్లగొట్టడం రామోజీకి తప్పుగా తోచలేదా? ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏ పనులు చేపట్టినా వ్యతిరేకించడం దివాళాకోరుతనం కాదా? అయినా ప్రభుత్వానికి కొన్ని ప్రాధాన్యతలుంటాయి. అందుకు అనుగుణంగా పనులు చేపడతాయి. అది కూడా తప్పుబట్టే వారిని ఏమనుకోవాలి?



ఈనాడు ఆరోపణ: అస్మదీయుల బిల్లుల చెల్లింపులకు అడ్డగోలుగా గ్యారెంటీలు

వాస్తవం: గత ప్రభుత్వంలోనూ ఇదే కాంట్రాక్టు సంస్థ పట్టిసీమ సహా వివిధ ప్రాజెక్టుల్లో పనులు చేసింది. మరి రామోజీకి అప్పుడు అంతా సవ్యంగానే కనిపించింది కదా?

ఈనాడు ఆరోపణ: బిల్లులు చెల్లింపులకు ప్రభుత్వ గ్యారెంటీలా?

వాస్తవం: మీడియా ముసుగులో బురద చల్లుతున్న ఇదే రామోజీ గతంలో మధ్యవర్తిత్వం నడిపి పట్టిసీమ, పురుషోత్తపట్నం లాంటి పథకాలను చరిత్రలో ఎన్నడూ లేని విధంగా + 22 శాతంతో అధిక రేట్లకు కట్టబెట్టారు. అప్పుడు ఇదే గుత్తేదారు చంద్రబాబుకు అస్మదీయుడని ఆయనకు ఎందుకు అనిపించలేదు? పోలవరంలో రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్‌కి నిబంధనలకు విరుద్ధంగా రూ.1,333 కోట్ల ప్రజాధనాన్ని అప్పనంగా దోచి పెట్టినప్పుడు రామోజీకి ఫైనాన్స్ కోడ్ గుర్తు రాలేదా? వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అదే పనిని రివర్స్ టెండర్ల ద్వారా 12.60 శాతం తక్కువ వ్యయంతో మేఘా సంస్థకు పారదర్శకంగా కేటాయించి రూ.660 కోట్లను ఆదా చేసింది. 22 శాతం అదనంతో రూ.257.39 కోట్లను చంద్రబాబు లూటీ చేస్తే అది తప్పుకాదా రామోజీ?

మేఘా ప్రతిపాదనలకు అధికారులు సై..

వాస్తవం: మేఘా కంపెనీ పోలవరంతోపాటు కీలకమైన వెలిగొండ టన్నెల్ పనులు చేస్తోంది. పోలవరం కోసం రాష్ట్ర ఖజానా నుంచి వెచ్చించిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఖజానా నుంచి రూ.1,319 కోట్లు పోలవరం పనులకు వ్యయం చేసింది. మేఘా దాదాపు రూ.1,200 కోట్ల మేర పనులు చేసింది. పోలవరం పనులు పునఃప్రారంభించే సీజన్ ఆరంభం కావడంతో డబ్బులు రీయింబర్స్ చేయాలని రాష్ట్రం ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. సవరించిన అంచనా వ్యయానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించేలోగా పనులను వడివడిగా చేపట్టి కొలిక్కి తేవాల్సిన ఆవశ్యకత నెలకొంది. ఈ నేపథ్యంలో మేఘా నిధుల కోసం బ్యాంకుల నుంచి లోన్ తీసుకునేందుకు ఆర్థిక శాఖ అనుమతి కోరింది. ఖజానాకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా షరతులతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తోంది. బ్యాంకు విధించే వడ్డీ తదితర రుసుములను పూర్తిగా మేఘానే భరించాల్సి ఉంటుంది. న్యాయపరమైన అన్ని అంశాలకు సైతం కంపెనీనే బాధ్యత వహించాలి. ఇటువంటి కఠిన షరతుల మధ్య మేఘా ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

పాఠశాలల్లో 'ఫిట్‌నెస్' ఉద్యమం

నేటి నుంచి ఫిట్ ఇండియా వారోత్సవాలు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు క్రీడా నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు ఉద్దేశించిన ఫిట్ ఇండియా వారోత్సవాలకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలోని 6,786 ప్రభుత్వ హైస్కూళ్లు, 56 కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు, 271 ఎయిడెడ్, 5,501 ప్రైవేటు పాఠశాలలు కలిపి మొత్తం 12,614 ఉన్నత పాఠశాలల్లో రోజుకో వేడుక చొప్పున నిర్వహించనున్నారు. ఇందులో ప్రధానంగా విద్యార్థి ఫిట్‌నెస్ స్థాయిని మెరుగుపరిచేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేసేలా ప్రోత్సహిస్తారు. అంతే కాకుండా వారిలో క్రీడా స్ఫూర్తిని పెంచడం, టీమ్ స్పిరిట్, పరస్పర సహకారం, క్రమశిక్షణతో మెలగడం కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తారు. హైస్కూల్ స్థాయిలో ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సైతం భాగస్వాముల్ని చేయనున్నారు. దీంతో పాటు విద్యార్థుల భావవ్యక్తీకరణ మెరుగుపడేలా ఫిట్‌నెస్‌పై డిబేట్ పోటీలు నిర్వహించనున్నారు. వీటితోపాటు క్విజ్, వ్యాస రచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహిస్తారు. ఆయా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులతో చివరిరోజు వేడుకలు నిర్వహించనున్నారు.

పొంగిన సిరులు!

▶ మొదటి పేజీ తరువాయి

లీటర్‌కు రూ.4 మేర అదనపు ప్రయోజనం కల్పిస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మిన్నగా జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా రూ.10 నుంచి రూ.20 వరకు పాడి రైతులు అదనంగా లబ్ధి పొందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో గేదె పాలకు లీటర్‌కు రూ.112, ఆవుపాలకు రూ.53.86 చొప్పున ధర లభిస్తుండడంతో అమూల్‌కు పాలు పోసే వారి ఆనందానికి అవధుల్లేకుండా ఉంది. అమూల్ రాకతో ప్రైవేట్ డెయిరీలు సైతం అనివార్యంగా సేకరణ ధరలను పెంచాల్సి వచ్చింది. దీనివల్ల పాడి రైతులకు అదనంగా మేలు జరుగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కృషి ఫలితంగా మూతపడిన చిత్తూరు డెయిరీతో సహా సహకార సంఘాలు జీవం పోసుకుంటున్నాయి.

పాడి రైతులకు రూ.2,604.06 కోట్ల అదనపు లబ్ధి

అమూల్ ప్రారంభంలో లీటర్‌కు 11 శాతం వెన్న, 9 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో గేదె పాలకు రూ.71.47 చొప్పున చెల్లించగా 5.4 శాతం వెన్న, 8.7 శాతం ఎస్ఎన్ఎఫ్‌తో ఆవు పాలకు రూ.34.20 చొప్పున చెల్లించింది. ప్రస్తుతం గేదె పాలకు రూ.89.76, ఆవుపాలకు రూ.43.69 చొప్పున చెల్లిస్తోంది. అయితే రైతుకు గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్‌ను బట్టి గేదెపాలకు లీటర్‌కు రూ.112, ఆవుపాలకు రూ.53.86 చొప్పున ధర లభిస్తోంది. 18 నెలల్లో పాల సేకరణ ధరను అమూల్ ఏడు దఫాలు పెంచింది. లీటర్ గేదె పాలకు రూ.16.09, ఆవుపాలకు రూ.8.36 చొప్పున అదనంగా రైతులు లబ్ధి పొందుతున్నారు. గతంలో రెండేళ్లకోసారి పాల సేకరణ ధరలు పెంచే ప్రైవేట్ డెయిరీలు అమూల్ రాకతో ఏటా అనివార్యంగా కనీసం రెండుసార్లు పెంచాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ప్రైవేట్ డెయిరీలు పాల సేకరణ ధర తప్పనిసరిగా పెంచాల్సి రావడంతో పాడి రైతులకు రూ.2,604.06 కోట్ల మేర అదనంగా ప్రయోజనం చేకూరడం గమనార్హం. అమూల్ ప్రతి సంవత్సరం చివరిలో పోసిన ప్రతి లీటరు పాలకు రూ.0.50 చొప్పున లాయల్టీ బోనస్ పాడి రైతులకు చెల్లిస్తోంది. మరోవైపు గత 18 నెలల్లో అమూల్ 2,235.45 మెట్రిక్ టన్నుల నాణ్యమైన ఫీడ్‌ను లాభాపేక్ష లేకుండా పంపిణీ చేసింది. గేదెలకు రూ.30 వేలు, ఆవులకు రూ.25 వేలు చొప్పున వర్కింగ్ క్యాపిటల్‌గా అందిస్తున్న ప్రభుత్వం కొత్తగా పాడి పశువుల కొనుగోలుకు గేదెకు రూ.93 వేలు, ఆవులకు రూ.76 వేలు చొప్పున రుణాలందిస్తోంది.

33 నెలల్లో 11.37 కోట్ల లీటర్ల సేకరణ

మూడు జిల్లాలలో 2020 డిసెంబర్‌లో ప్రారంభమైన జగనన్న పాలవెల్లువ (జేపీవీ) నేడు 19 జిల్లాలకు విస్తరించింది. 400 గ్రామాలలో 14,845 మందితో మొదలైన ఈ ఉద్యమంలో నేడు 4,114 గ్రామాలలో 3,79,850 మంది భాగస్వాములయ్యారు. 33 నెలల్లో 11.37 కోట్ల లీటర్ల పాలను సేకరించగా రూ.512.83 కోట్లు చెల్లించారు. అమూల్‌కు ప్రస్తుతం రోజుకు సగటున 2,84,755 లీటర్ల చొప్పున పాలు పోస్తున్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ డెయిరీలు రోజుకు సగటున 6 లక్షల లీటర్ల చొప్పున పాలను సేకరిస్తున్నారు. నిండా 33 నెలలు కూడా నిండని అమూల్ సంస్థ ఇప్పటికే రోజుకు 2.85 లక్షల లీటర్ల పాలను సేకరిస్తోందంటే పాడి రైతులకు ఎంత మేలు చేస్తోందో ఊహించవచ్చు. పాలు పోసే రైతులకు ప్రతి 10 రోజులకోసారి నేరుగా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోంది.

ఏఎంసీయూ, బీఎంసీయూలు..

అమూల్ ప్రాజెక్టులో భాగంగా 9,899 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా మొదటి దశలో రూ.680 కోట్ల ఉపాధి నిధులతో 3,156 గ్రామాల్లో ఏఎంసీయూ, బీఎంసీయూలను నిర్మిస్తున్నారు. చేయూత లబ్ధిదారులకు వారి ఇష్ట ప్రకారం పాడి పశువుల కొనుగోలుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వాస్తవాలు ఇలా ఉంటే అమూల్‌కు మేలు చేసేందుకు ప్రభుత్వం రూ.పది వేల కోట్లు ఖర్చు చేసిందని, విలువైన సహకార డెయిరీలను అప్పనంగా అప్పగిస్తోందంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారానికి తెగబడింది.

హెరిటేజ్ కోసం..

సహకార డెయిరీల రంగం నిర్వీర్యమైంది చంద్రబాబు హయాంలోనే. సహకార స్ఫూర్తితో ఏర్పాటైన పాల యూనియన్లను ప్రభుత్వ అనుమతి లేకుండానే 'మ్యాక్స్' (మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీలు)లోకి మార్చుకుని తర్వాత సొంత కంపెనీలుగా ప్రకటించుకున్నారు. ఇలా చంద్రబాబు హయాంలో విశాఖ, గుంటూరు, ప్రకాశం జిల్లా మిల్క్ యూనియన్లు కంపెనీలుగా మారిపోయాయి. పులివెందుల, చిత్తూరుతో సహా 8 డెయిరీలు మూతపడ్డాయి. అన్నమయ్య జిల్లాలోని యూహెచ్‌టీ ప్లాంట్, ప్రకాశం జిల్లాలోని మిల్క్ పౌడర్ ప్లాంట్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఎంసీసీతో పాటు 141 బీఎంసీయూలు మూతపడ్డాయి. హెరిటేజ్ కోసం సహకార రంగాన్ని నిర్వీర్యం చేశారు. హెరిటేజ్ సేకరణ ధరలు పెంచాల్సి వస్తుందనే భయంతో పాడి రైతులకు ఎక్కడా ధరలు పెరగకుండా కట్టడి చేశారు. హెరిటేజ్ బాగుంటే చాలు పాడి రైతులు ఎలా పోయినా ఫర్వాలేదని చంద్రబాబు భావించారు.

పాడి రైతులకు ప్రయోజనం ఇలా (గేదె పాలు లీటర్‌కు రూ.ల్లో)

	అమూల్ రాక ముందు		ప్రస్తుతం	
డెయిరీ	ప్రకటించిన ధర	చెల్లించిన ధర	ప్రకటించిన ధర	చెల్లిస్తున్న ధర
హెరిటేజ్	67.65	58.43	77.00	66.50
సంగం	68.20	58.90	80.30	69.35
కృష్ణా మిల్క్ యూనియన్	71.94	62.13	80.30	69.50
శ్రీజ	71.50	61.75	80.30	69.35
విశాఖ	72.60	62.70	79.20	68.40
అమూల్	---	---	89.76	89.76

పాడి రైతులకు దక్కుతున్న ధరలిలా (ఆవు పాలకు లీటర్‌కు రూ.ల్లో)

	అమూల్ రాక ముందు		ప్రస్తుతం	
డెయిరీ	ప్రకటించిన ధర	చెల్లించిన ధర	ప్రకటించిన ధర	చెల్లిస్తున్న ధర
హెరిటేజ్	32.68	31.58	32.98	31.96
సంగం	33.37	31.96	35.58	34.05
కృష్ణా మిల్క్ యూనియన్	32.68	32.20	35.17	33.65
శ్రీజ	31.98	31.27	37.53	35.91
విశాఖ	33.37	32.87	37.88	36.18
అమూల్	----	---	43.69	43.69

'చిత్తూరు'లో క్షీరధారలు..

మూతపడిన డెయిరీల పునరుద్ధరణలో భాగంగా ఇప్పటికే మదనపల్లి డెయిరీని పునరుద్ధరించగా 2021 నుంచి అమూల్ సంస్థ విజయవంతంగా నిర్వహిస్తోంది. చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ కోసం ఆ డెయిరీకి ఉన్న రూ.182 కోట్ల అప్పులను తీర్చింది. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ ప్రాజెక్టు కోసం అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఇలా ఒకపక్క సహకార రంగాన్ని బలోపేతం చేస్తుంటే ఒంగోలు డెయిరీని అమూల్‌కు అప్పగిస్తే వదిలేసిందని, విలువైన ఆస్తులు కట్టబెడుతున్నారంటూ ఎల్లో మీడియా బురద చల్లడంపై విస్మయం వ్యక్తమవుతోంది. పాడి రైతులకు మేలు జరిగే చర్యలను సైతం అడ్డుకునే యత్నాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విశాక ఇండస్ట్రీస్‌కు చెందిన రూ.8 కోట్లు ఫ్రీజ్!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని చెన్నూరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్‌కు సంబంధించిన విశాక ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతా నుంచి విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఖాతాలోకి బదిలీ అయిన రూ.8 కోట్లను సైఫాబాద్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) ఆదేశాల మేరకు నగర పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో ఈ చర్య తీసుకున్నట్లు మధ్య మండల డీసీపీ వెంకటేశ్వర్లు ఆదివారం వెల్లడించారు. గత సోమవారం జరిగిన ఈ వ్యవహారంపై ఆ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ బుధవారం సీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ విజిలెన్స్ కంపెనీ రామగుండంలోని వివేక్ ఇంటి చిరునామాతో ఉందని, ఆయన సంస్థ ఉద్యోగులే ఈ సంస్థ డైరెక్టర్లుగా ఉన్నారని అందులో పేర్కొన్నారు. ఈ లావాదేవీపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని, ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు పెట్టడానికే వివేక్ ఈ షెల్ కంపెనీ ఖాతా వినియోగిస్తున్నట్లు సీఈఓకు ఇచ్చిన ఫిర్యాదుతో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రంగంలోకి దిగిన సైఫాబాద్ పోలీసులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బేగంపేట బ్రాంచ్‌లో ఉన్న విశాక ఇండస్ట్రీస్‌కు చెందిన ఓ గుర్తుతెలియని ఖాతా నుంచి విజిలెన్స్ సెక్యూరిటీస్ సంస్థకు ఐడీబీఐ బ్యాంక్ బషీర్‌బాగ్ బ్రాంచ్‌లోకి బదిలీ అయినట్లు గుర్తించారు. ఈ లావాదేవీ అనుమానాస్పదంగా ఉండటంతో సైఫాబాద్ పోలీసులు ఈ మొత్తాన్ని ఫ్రీజ్ చేయించారు.

తెలంగాణ

కుటుంబ పాలన అంతమే!

- ఎన్నో పోరాటాలతో వచ్చిన తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ
- నారాయణపేట, చేవెళ్ల సభల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ చేవెళ్ల: ఎందరో అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ కుటుంబ పాలనలో చిక్కుకుందని.. ఈ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు అయ్యారని, వేల మంది ప్రాణత్యాగం చేశారని.. కానీ సీఎం కుర్చీలో కూర్చుకున్న కేసీఆర్ తెలంగాణ ప్రగతిని పక్కనపెట్టి కుటుంబ సంపదను పెంచుకున్నారని ఆరోపించారు. కుటుంబ పాలన చేసే రాష్ట్రాల్లో బీజేపీ రాజకీయ యుద్ధం చేస్తోందని, తెలంగాణలోనూ కుటుంబ పాలనను అంతం చేస్తామని చెప్పారు. ఆదివారం నారాయణపేట, చేవెళ్లలలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభల్లో ఆయన ప్రసంగించారు. ''బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాష్ట్ర సర్కార్. ఇది తెలంగాణ ప్రజలను లూటీ చేస్తుంది. ఫోన్లలో 5జీ నెట్‌వర్క్ లాంటివారు ప్రధాని నరేంద్ర మోదీ. అదే కేసీఆర్ 5జీ ఏంటంటే.. పేదరికం (గరీబీ), కుంభకోణం (గొటాలా), అహంకారం (గుస్సోడి), మోసకారి (గప్లెబాజ్), గుండాయిజం (గుండారాజ్). ఇలాంటి కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో ఇంటికి పంపాలి. ఆ సమయం వచ్చింది'' అని ఆయన అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, అవినీతి, ప్రజలను మోసం చేయడంలో దిట్టలని ఆయన వ్యాఖ్యానించారు. మోదీ హయాంలో ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తిగా భారత్ ఎదిగిందని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని గెలిపిస్తే 2028 నాటికి మూడో స్థానానికి చేరుకుంటుంది అని నడ్డా పేర్కొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడగొట్టాలి

- అప్పుడే రాష్ట్ర యువతకు ఉద్యోగాలు వస్తాయి
- ఖానాపూర్, ఆసిఫాబాద్ కాంగ్రెస్ విజయభేరి సభల్లో ప్రియాంక గాంధీ



నిర్మల్/సాక్షి, ఆసిఫాబాద్: ''రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. అదే కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు (పదవులు) ఉన్నాయి. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగం ఊడగొట్టాలి. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలి..'' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పిలుపునిచ్చారు. ప్రజలు ఇప్పటికే రెండుసార్లు బీఆర్ఎస్‌కు ఓటేసి పదేళ్లు దగాపడ్డారని, మళ్లీ బీఆర్ఎస్‌కు వేస్తే రాష్ట్ర భవిష్యత్తు నాశనం అవుతుందని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. ''ఇందిరాగాంధీ ఆదివాసీలు, గిరిజనులు గురించి ఆలోచించేవారు. వారి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకొచ్చారు. అందుకే ఆమె మరణించి 40 ఏళ్లు గడిచినా గిరిజనులు ఆరాధిస్తున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు తెలిసే సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారు. కానీ కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రజలను దగా చేశారు. ప్రజల ఆకాంక్షలు ఒక్కటీ నెరవేర్చలేదు. యువతకు ఉపాధి కల్పించలేదు'' అని మండిపడ్డారు. రాష్ట్రంలో కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరిట రూ.లక్షల కోట్ల దోపిడీ జరిగిందన్నారు. ప్రధాని మోదీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై చర్యలు చేపట్టరు కానీ కాంగ్రెస్ నేతలపై మాత్రం సీబీఐ, ఈడీలను ఉసిగొల్పుతారని ధ్వజమెత్తారు.

ఇందిరమ్మ రాజ్యమంటే.. ఆకలి చావులే!

- నాటి పాలనలో ప్రజలను రాచిరంపాన పెట్టారు, దోపిడీ చేశారు
- అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి సభల్లో సీఎం కేసీఆర్



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నారని.. ఇందిరమ్మ పాలన అంటే ఆకలి చావులు, ప్రజలను కాల్చి చంపుడేనని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. నాడు జరిగింది నక్సలైట్ల ఉద్యమాలు, ప్రజలను కాల్చిచంపుడు, ఎన్‌కౌంటర్లేనని.. ప్రజలను రాచిరంపాన పెట్టారని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యమంత దరిద్రపు రాజ్యం ఇంకోటి లేదని పేర్కొన్నారు. అలాంటి రాజ్యం మళ్లీ తెస్తామంటున్న కాంగ్రెస్ పాలన కావాలా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ కోసమే పుట్టిందని చెప్పారు. ప్రజలు అన్నీ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ''ఇందిరమ్మ రాజ్యం పొడుగునా ఏం జరిగింది. ప్రజలను రాచిరంపాన పెట్టారు. దోపిడీ చేశారు. ఇందిరమ్మ రాజ్యమంత దరిద్రపు రాజ్యం ఇంకోటి లేకుండె. ఇది అందరికీ తెలుసు. ప్రజలను ఆగం చేసేందుకు ఢిల్లీ గద్దలు వాలుతున్నాయి. మనకు రావాల్సిన 24వేల కోట్లు ఆపిన బీజేపీ ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతోంది?'' అని ఆయన దుయ్యబట్టారు.

నిజామాబాద్ అర్బన్‌లో అభ్యర్థి ఆత్మహత్య




ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ తరఫున పోటీచేస్తున్న కన్నయ్యకుమార్‌గౌడ్ అనే అభ్యర్థి శనివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ గాయత్రీనగర్‌లోని సాయినగర్ కాలనీలో నివసించే కన్నయ్యకుమార్ గౌడ్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇరుక్కున్నాడు. సైబర్ నేరగాళ్లు ఆయనను హనీట్రాప్ చేసి వేధింపులకు పాల్పడుతున్నారు. వేధింపులకు తాళలేక ఆయన రెండురోజులుగా ఇంటిలోంచి బయటికి వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో కుంగిపోయిన కన్నయ్యకుమార్ గౌడ్ శనివారంరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఏపీకి రెండోస్థానం

- రాష్ట్రంలో 11,855 కేంద్రాలు
- అన్ని కేంద్రాల్లోనూ వైద్యసేవలు
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: గ్రామీణ, పట్టణ ప్రజానీకానికి వైద్యసేవలను మరింత చేరువ చేయడం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తోంది. తాజాగా హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలోనూ దేశంలో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని అన్ని కేంద్రాల్లోనూ ప్రజలకు వైద్యసేవలు అందిస్తుండటం విశేషం. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ఏడాది జూలై నాటికి 1,60,480 హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 21,891, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 11,855 కేంద్రాలు పని చేస్తున్నాయని వివరించింది. ఏపీ తర్వాత వరుసగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో అత్యధిక హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నట్టు పేర్కొంది. గ్రామీణ, పట్టణ ప్రజానీకానికి మరింత దగ్గరగా వైద్య సేవలందించడమే లక్ష్యంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను మంజూరు చేసినట్టు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సెంటర్లలో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలందించడంతోపాటు నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల స్క్రీనింగ్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అదేవిధంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు కూడా అందిస్తున్నట్లు వెల్లడించింది.



ఏపీలో ఇలా...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను అనుసంధానం చేసింది. వీటికి విలేజ్ హెల్త్ క్లినిక్స్, అర్బన్ హెల్త్ క్లినిక్స్‌గా పేరు పెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో 2,500 జనాభాకు ఒకటి చొప్పున విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో అనుసంధానించి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తోంది. విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తోపాటు ఏఎన్ఎం, ఆశ వర్కర్లను అందుబాటులో ఉంచింది. ఈ క్లినిక్స్‌లో 14 రకాల పరీక్షలు చేయడంతోపాటు 105 రకాల మందులు అందించేలా ఏర్పాట్లు చేసింది.

మహిళల వ్యక్తిగత రుణాలు పైపైకి..


- 2014–15 మొత్తం రుణాల్లో వీరి వాటా 18.3 శాతం
- 2023లో 23 శాతానికి పెరుగుదల
- వ్యవసాయం, వాణిజ్యం, విద్య, పారిశ్రామిక రంగంలో స్త్రీలకు విరివిగా రుణాలు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వాణిజ్య బ్యాంకులు మహిళలకు మంజూరు చేసే వ్యక్తిగత రుణాలు గత కొన్నేళ్లుగా పెరుగుతున్నాయి. 2014–15 నుంచి ఈ గ్రాఫ్ ఏటేటా పైకెళ్తున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2014–15 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య బ్యాంకుల మొత్తం రుణాల్లో మహిళల వ్యక్తిగత రుణాల వాటా 18.3 శాతం ఉండగా 2022–23 నాటికి అది 23 శాతానికి పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. అంటే గత తొమ్మిది సంవత్సరాల్లో మహిళల వ్యక్తిగత రుణాల వాటా 4.7 శాతం మేర పెరిగినట్లయిందని పేర్కొంది. అన్ని ప్రధాన రంగాల్లో వీరి వ్యక్తిగత రుణాల వాటా పెరుగుతూనే ఉందని తెలిపింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మహిళల వ్యక్తిగత రుణ ఖాతాల సంఖ్య 10.2 కోట్లుగా ఉంది. అలాగే, వ్యవసాయం, వాణిజ్య, విద్య, పారిశ్రామిక రంగాల్లో మహిళల రుణాలు పెరుగుతూనే ఉన్నాయని నివేదిక వెల్లడించింది. ఏటా వీరి వ్యక్తిగత రుణ ఖాతాల సంఖ్య పెరుగుతోందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని నివేదిక వ్యాఖ్యానించింది. అలాగే, మహిళల వ్యక్తిగత రుణాల కన్నా వివిధ రంగాలపై తీసుకుంటున్న రుణాల వాటా బాగా పెరుగుతోందని నివేదిక తెలిపింది. అత్యధికంగా విద్య, వాణిజ్య రంగాల్లో మహిళల వ్యక్తిగత రుణాల వాటా పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది.

రైతులను మోసం చేసింది మీ బాబే రామోజీ

రుణమాఫీ, వడ్డీలేని రుణాల హామీని తుంగలో తొక్కిన చంద్రబాబు

- అయినా వాత్సల్యంతో రామోజీ ఏనాడు వార్తలు రాయలేదు
- నేటి ప్రభుత్వం క్రమం తప్పకుండా రైతుల ఖాతాలకు సున్నా వడ్డీ రాయితీ జమ
- కానీ అబద్ధాలు పోగేసి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న రామోజీరావు
- 39.07 లక్షల మందికి రూ. 1,180.66 కోట్ల వడ్డీ రాయితీ ఎగ్గొట్టిన చంద్రబాబు
- ఈ నాలుగున్నరేళ్లలో 73.88 లక్షల మందికి రూ. 1,834.55 కోట్ల చెల్లింపు
- నాడు వడ్డీ క్లెయిమ్‌లు బ్యాంక్ ఖాతాలకు చెల్లింపు
- నేడు వడ్డీ రాయితీ నేరుగా రైతుల ఖాతాలకు జమ
- ఇవేమీ పట్టించుకోకుండా ఈనాడు వక్రరాతలు



సాక్షి, అమరావతి: రైతుల రుణాలను బేషరతుగా మాఫీ చేస్తామని, వడ్డీలేని రుణాలు అందిస్తామని చంద్రబాబు చేసిన వాగ్దానాలను అప్పట్లో తుంగలో తొక్కినా రామోజీరావు తన పత్రికలో ఒక్క ముక్క కూడా రాయలేదు. కానీ ఇచ్చిన హామీలకంటే మిన్నగా రైతులకు ఈ ప్రభుత్వం సాయం చేస్తుంటే నిత్యం విషం చిమ్ముతూనే ఉన్నారు. దుష్ప్రచారమే లక్ష్యంగా అబద్ధాలను పోగేసి 'సున్నా వడ్డీలో మహా మోసం' అంటూ మరో కథనాన్ని శనివారం ఈనాడు పత్రిక అచ్చేసింది. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, పైసా భారం పడకుండా ఉచిత పంటలబీమా, సీజన్ ముగియకుండానే పంట నష్ట పరిహారం, సకాలంలో సున్నా వడ్డీ రాయితీ సహా రైతులకు మేలు చేసే ఎన్నో పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తున్నా నిజాలను వక్రీకరించి వక్రరాతలు రాసేసింది. అప్పుల ఊబిలో చిక్కుకోకుండా చిన్న, సన్నకారు, వాస్తవ సాగుదారులు సాగు వేళ తీసుకునే పంట రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా 'వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 2019లో శ్రీకారం చుట్టింది. రూ. లక్ష లోపు తీసుకున్న పంట రుణాలను ఏడాదిలోపు తిరిగి చెల్లించిన రైతులకు మరుసటి సీజన్ రాక మునుపే వారు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోంది. వాస్తవ సాగుదారులకు వడ్డీ రాయితీ ప్రయోజనాన్ని అందించడం కోసం ఈ క్రాప్ డేటా ఆధారంగా ఈ పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోంది.

గతంలో రైతుపైనా వడ్డీ భారం



గతంలో రూ. లక్ష లోపు పంట రుణాన్ని ఏడాదిలోపు చెల్లిస్తే బ్యాంకులు వసూలు చేసే ఏడు శాతం వడ్డీలో 3 శాతం కేంద్రం రాయితీ ఇస్తే, మిగిలిన 4 శాతం వడ్డీని రైతులు భరించేవారు. 'వడ్డీలేని రుణ పథకం' కింద రైతులు చెల్లించిన వడ్డీ రాయితీని బడ్జెట్ కేటాయింపులను బట్టి ఏడాదికో.. రెండేళ్లకో బ్యాంకులకు జమ చేసేవారు. ఈ మొత్తాన్ని బ్యాంకులు రైతులు చెల్లించాల్సిన అప్పు ఖాతాలకు సర్దుబాటు చేసుకునేవి. గతంలో క్లయిమ్స్ డేటాను అప్లోడ్ చేయడానికి నోడల్ బ్రాంచ్‌లకు మాత్రమే అధికారం ఉండేది. దీంతో ఎంత మంది అర్హత పొందారు.. వారికి ఎంత వడ్డీ రాయితీ జమైందో రైతులకే కాదు.. సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌లకు కూడా తెలిసేది కాదు. సామాజిక తనిఖీ కోసం బ్యాంకుల వద్ద కానీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానీ జాబితాలు ప్రదర్శించే పరిస్థితులు ఉండేవి కాదు.

పారదర్శకంగా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో వడ్డీ రాయితీ చెల్లింపుల్లో జాప్యానికి తావు లేకుండా ఉండేందుకు ఏడాదిలోపు రుణం చెల్లించిన లబ్ధిదారుల డేటా బ్యాంకుల ద్వారా ఎస్వీపీఆర్ పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్నారు. ఈ డేటాను ఈ–క్రాప్ డేటాతో ధ్రువీకరించి అర్హులైన రైతుల జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. మొబైల్ ద్వారా ఎస్వీపీఆర్ (సున్నా వడ్డీ పంట రుణాలు) పోర్టల్ (https://karshak.ap.gov.in/ysrsvpr/)లో ఆధార్ నంబరుతో చెక్ చేసుకునే వెసులుబాటు రైతులకు కల్పించారు. ఏడాదిలోగా రూ. లక్ష లోపు రుణాలు తిరిగి చెల్లించి వడ్డీ రాయితీకి అర్హత పొంది, ఒకవేళ జాబితాలో తమ పేర్లు లేకపోతే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కూడా కల్పించారు. ఇలా అర్హత పొందిన రైతుల ఖాతాల్లో వారు చెల్లించిన నాలుగు శాతం వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా క్రమం తప్పకుండా జమ చేస్తోంది. రైతులలో జవాబుదారీతనాన్ని పెంచడం, సకాలంలో రుణ చెల్లింపు అలవాటు పెంపొందించే లక్ష్యంతో అమలు చేస్తోన్న ఈ పథకం ద్వారా రైతులు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని తిరిగి రైతుల ఖాతాలకే జమ చేస్తోంది.

టీడీపీ ఐదేళ్లలో వడ్డీలేని పంట రుణాల పథకం కింద చెల్లించిన వివరాలు ఇలా..

సంవత్సరం	రైతులు (లక్షల్లో)	వడ్డీ రాయితీ (రూ. కోట్లలో)
2014–15	0.80	3.87
2015–16	2.42	31.10
2016–17	21.02	252.65
2017–18	13.81	293.64
2018–19	2.53	104.20
మొత్తం		685.46

గత బకాయిలతో సహా గడిచిన 4.5 ఏళ్లలో ప్రస్తుత ప్రభుత్వం చెల్లించిన వడ్డీ రాయితీ వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య (లక్షల్లో)	వడ్డీ రాయితీ (రూ. కోట్లలో)
2014–19	39.07	1,180.66 (బాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలు)
2019–20	14.27	285.62
2020–21	12.32	207.72
2021–22	8.22	160.55
మొత్తం		1,834.55

బాబు ఎగ్గొట్టిన బకాయిలు చెల్లింపు

టీడీపీ ఐదేళ్ల హయాంలో సుమారు 40.61 లక్షల మందికి కేవలం రూ. 685.46 కోట్లు చెల్లిస్తే, గడిచిన 4.5 ఏళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 73.88 లక్షల మందికి రూ. 1,834.55 కోట్లు చెల్లించింది. ఈ మొత్తంలో 39.08 లక్షల మంది రైతులకు చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ. 1,180.66 కోట్ల బకాయిలున్నాయి. కాగా రబీ 2021–22, ఖరీఫ్–2022 సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద రాయితీ సొమ్మును డిసెంబర్‌లో రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వడ్డీ రాయితీని సకాలంలో అందించడమే కాదు. రైతులకు సంస్థాగత రుణాలు అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. 2019 ఖరీఫ్ పంట కాలం నుంచి ఇప్పటి వరకు రూ. 8,24,428 కోట్ల పంట రుణాలను ఈ ప్రభుత్వ హయాంలో రైతులకు అందించారు. అంతేకాదు వాస్తవ సాగుదారులకు సీసీఆర్సీ కార్డుల ద్వారా 14 లక్షల మంది కౌలురైతులకు రూ. 8,054 కోట్ల వ్యవసాయ రుణాలు అందించింది. ఈ ఏడాది అత్యధికంగా 8.22 లక్షల మంది కౌలుదారులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయగా, వారిలో ఇప్పటికే 4.88 లక్షల మందికి రూ.1,385.25 కోట్ల రుణాలు పంపిణీ చేసింది. అంతేకాదు.. రైతు భరోసా కింద 53.53 లక్షల రైతు కుటుంబాలకు రూ. 33,209.81 కోట్లు, రాయితీపై విత్తన సరఫరా కోసం 74.45 లక్షల మందికి రూ. 1,316.57 కోట్లు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 54.50 లక్షల మందికి రూ. 7,802.05 కోట్లు, ఇన్‌పుట్‌సబ్సిడీ కింద 22.85 లక్షల మందికి రూ.1,977 కోట్లు చెల్లించి రైతులకు ఈ ప్రభుత్వం అండగా నిలిచింది. మరో వైపు ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేస్తోంది.

సన్నిధి

మంచిమాట

అలవాటు

అలవాట్లు మనిషిని పట్టిస్తాయి. అంతే కాదు బంధిస్తాయి, బానిసని కూడా చేస్తాయి. అలవాటుకి ప్రయత్నం అవసరం లేదు. అలవాటు రెండవ స్వభావం అని చెప్పవచ్చు. స్వభావం లాగానే అలవాటుని కూడా అధిగమించటం చాలా కష్టం. అది ఎంతగా వంటపట్టిపోతుందంటే దాన్ని విడిగా గుర్తించటం కూడా కుదరదు. నిజానికి అది పుట్టుకతో వచ్చింది కాదు. తరవాత పెంపొందించుకున్నది.



పెరిగిన భౌగోళిక, ఆర్థిక, సాంఘిక, రాజకీయ, పరిస్థితులు, వాతావరణం, మనుషులు, మత విశ్వాసాలు మొదలైన ఎన్నో అంశాలు ఒక అలవాటు ప్రబలటానికి దోహదం చేస్తాయి. అవే పరిస్థితుల్లో ఉన్న మరొక వ్యక్తికి అది కాక మరొక అలవాటు ఉండవచ్చు. దీనికి వ్యక్తి స్వభావం కారణం అవుతుంది. అంటే, వ్యక్తి సహజ స్వభావం, పరిస్థితుల ప్రభావాల సమాహారంగా అలవాట్లు ఏర్పడుతాయి.

ఆ అలవాటు తెచ్చి పెట్టుకున్నది అని గుర్తించటం ఉండదు. అది సహజ లక్షణం అనే భ్రమలో ఆ వ్యక్తి మాత్రమే కాదు, చుట్టుపక్కల వారు కూడా ఉంటారు. అలవాటు ఎట్లా ఏర్పడిందో గుర్తించటం చాలా కష్టం. దానిని మానుకోటం మాత్రం కష్టం. ముందు అది మంచిది కాదు అని గుర్తించాలి, తరవాత మానాలి అనే సంకల్పం ఉండాలి. ఆ పైన ప్రయత్నం చేయాలి. మొదటిదే చాలా కష్టం. ఎందుకంటే మనిషికి తనని తాను సమర్థించుకోటం అన్నది సహజంగా ఉంటుంది. అలవాటై పోయింది అనటం అలవాటుగా మారిపోయింది.

ఇంతకీ అలవాటు అంటే? అల+పాటు = అలవాటు. అంటే, సముద్రంలో అల ఎంత సహజంగా పైకి ఎగసి, అంతే వేగంగా ఎటువంటి ప్రయత్నం, శ్రమ లేకుండా పడుతుందో అంత తేలికగా హాయిగా జరిగిపోయేది. దానిని ప్రత్యేకంగా గుర్తించటం కూడా ఉండదు.

అలవాటు అన్నది ఎంత బలంగా ఉంటుందంటే దానిని మానటం చాలా కష్టం. బలవంతంగా మానే వాతావరణం కల్పిస్తే గిజగిజ లాడిపోతారు. అందులోనూ దురలవాట్లు అయితే మరీనూ. పిచ్చిగా ప్రవర్తించటం, అవతలి వారికి పిచ్చెక్కేట్టు ప్రవర్తించటం లేదా ఆత్మహత్యలకి పాల్పడటం చూస్తూనే ఉన్నాం. అదే మంచి అలవాటు అయితే ఇబ్బంది పడతారు కాని, ఉన్న పరిస్థితుల్లోనే సద్దుకునే ప్రయత్నం చేస్తారు. కాని, గిజగిజలాడరు. ఉదాహరణకి రోజూ ఒక సమయానికి ధ్యానమో, పూజో చేసుకునే అలవాటు ఉన్నవారు ఎప్పటిలాగా వీలుకాకపోతే ఉన్నంతలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా తమ పని పూర్తి చేసుకుంటారు. పుస్తకాలు చదివే అలవాటు ఉన్నవారు ఎక్కడ ఉన్నా, ఎంత మంది మధ్య ఉన్నా, ఇతరులని ఇబ్బంది పెట్టకుండా పుస్తకం పట్టుకుని కూర్చొంటారు.

> రుచులు కూడా అలవాటు వల్లనే కలుగుతాయట! చిన్నతనం నుండి కారం తినటం అభ్యాసం చేస్తే అదే అలవాటు అవుతుంది. ఎప్పుడు తినని వారికి నోరు మంట పుడుతుంది. ఒక్కొక్క ప్రాంతం వారు ఒక్కొక్క ఆహారాన్ని ఇష్టపడటానికి కారణం ఇదే. అభిరుచులు కూడా అంతే! సాధారణంగా చేదు ఇష్టం ఉండదు ఎవరికీ. కాని నెమ్మదిగా అలవాటు చేసుకుని వదల లేని స్థితికి వచ్చింది సమాజం. కాఫీ, టీ, శీతల పానీయాలు ఇత్యాదులు. మొదటిసారి గొంతు దిగవు. ఆ తరువాత వదలవు. ధూమపానం, మద్యపానం సంగతి సరే సరి.

కొంతమంది త్వరగా దేనినైనా అలవాటు చేసుకుంటారు. వీరి అలవాట్లని మార్చటం అంత కష్టం కాదు. కొత్త అలవాట్లని తేలికగా చేసుకోగలరు కనుక మంచివి అలవాటు చేస్తే సరి! కొంతమందికి ఏది అలవాటు కావటం అన్నదే ఉండదు. వీళ్ళతో ప్రమాదం ఏమంటే మంచివి, పనికి వచ్చే అలవాట్లు కూడా ఉండవు. మనిషి జీవితం చాలావరకు అలవాటుగా సాగుతుంది. కొంతమందిని ఈ విధంగా ఎట్లా బతుకుతున్నావు? అని అడిగితే అలవాటయి పోయింది అంటారు. చిన్నప్పటినుంచి ఏది అలవాటు చేస్తే అదే అలవడుతుంది.

– డా.ఎన్. అనంత లక్ష్మి

బౌద్ధవాణి

చలువ చేసిన శాలువా

కొన్ని ధర్మాలు వినడానికి బాగుంటాయి. ఆచరించడానికి ఇబ్బందులు కొని తెస్తాయి. కొన్ని ధర్మాలు లేదా నీతులు ఎదుటి వారికి చెప్పడానికే బాగుంటాయి. తాము ఆచరించడానికి కటువుగా తోస్తాయి. అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో అందరూ ఆచరించే ధర్మం కప్పుకునే బట్ట లాంటిది అంటూ బుద్ధుడు చెప్పిన గొప్ప కథ ఇది.


ఆ రోజుల్లో ఎందరో తత్త్వవేత్తలు ఉండేవారు. ఎవరి సిద్ధాంతాల్ని వారు చెప్పేవారు. ప్రచారం చేసుకునేవారు. ఇతర సంప్రదాయానికి చెందిన ఒక గృహస్థు బుద్ధుని దగ్గరకు వచ్చాడు. బుద్ధునితో వాదానికి దిగాడు. అతని వెంట అతని పెంపుడు కోతి కూడా ఉంది. ఒంటి నిండా నల్లని బొచ్చుతో బొద్దుగా, ముద్దుగా ఉంది.

''గృహస్థూ! ఈ కోతి నీ పెంపుడు కోతా?'' అని అడిగాడు బుద్ధుడు.

''అవును, గౌతమా! నా భార్యకు లేక లేక గర్భం వచ్చింది. ఆమె నాకు ఒక మగ కోతి కావాలి!'' అని అడిగింది. అప్పుడు నేను– ''అంత తొందరెందుకు? నీకు మగబిడ్డ కలిగితే మగ కోతిని, ఆడబిడ్డ కలిగితే ఆడకోతిని తెచ్చి ఇస్తాను. అప్పుడు వారు దానితో ఆడుకుంటారు'' అన్నాను. కానీ, ఆమె మొండికేసింది. మారాం చేసింది. చేసేది లేక ఈ బొచ్చు కోతిని తెచ్చాను'' అన్నాడు.

''దీని బొచ్చు అందంగా ఉంది. మెత్తగానూ ఉంది. దీనిని నీవు శుభ్రంగా కడగగలవా?''

''చక్కగా. పసుపు, పిండి దట్టించి శుభ్రంగా స్నానం చేయించగలను. దీని వంటికి అంటిన మకిలిని వదిలించగలను.'' అన్నాడు గృహస్థు.



''బాగుంది.. అలాగే... మురికి వదిలించాక.. దీని వెంట్రుకలు మరింత మెరవడానికి రంగు వేయగలవా?''

''వేయగలను గౌతమా!''

''వేశాక మరింత అందంగా ఉండటానికి దీని వెంట్రుకలను సాపు చేయడానికి చలువ (ఇస్త్రీ) చేయగలవా?''

''లేదు గౌతమా..! చలువ చేయడాన్ని దీని శరీరం తట్టుకోలేదు'' '

'ఓ గృహస్థూ! అదే నీ దగ్గర వెంట్రుకలతో నేసిన వస్త్రం (శాలువా) ఉందనుకో. దాన్ని ఉతకగలవు, రంగు వేయగలవు, సాపు చేయగలవు. అన్ని రకాల పరిశుభ్రతలని ఆ వస్త్రం తట్టుకుంటుంది. అలాగే... ఏ ధర్మం అయితే.. పరీక్షలకు నిలబడి రానిస్తుందో... దానికి కాలంతో పని లేదు. అన్ని కాలాలకి వర్తిస్తుంది. అన్ని విమర్శలనూ తట్టుకుని నిలబడుతుంది. నా ధర్మం అలాంటిది'' అని చెప్పాడు.

ఆ గృహస్థు ఇంటికి వెళ్ళాడు. ఆ రాత్రి రకరకాల ప్రబోధాల్ని తరచి తరచి తర్కించుకున్నాడు. మరునాడు బుద్ధుని దగ్గరకు వచ్చి– నమస్కరించి, బుద్ధ అనుయాయిగా మారాడు. జీవితాంతం ధర్మాన్ని పాటించాడు. ప్రచారం చేశాడు.


– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం


వీథి దీపం వెలగకపోతే...!!!

'అచ్చమైన దీప సన్నిధిని మరుగిడబడి చెఱచినట్లున్నది...'. అంటున్నాడు త్యాగయ్య ఆ కీర్తనలో. కాంతినివ్వడం ఒక్కటే దీపశిఖ లక్షణం. దీపానికీ, ఈశ్వరుడికీ ఓ లక్షణం ఉంటుంది. వీథి దీపం వెలుగుతుంటే ఆ వెలుగులో అక్కడేమయినా పామున్నా, తేలున్నా తెలుస్తుంది. గుంటలు, రాళ్ళురప్పా కనబడతాయి... అని చెప్పి 'ఓ దీపమా! నా మార్గమును నిష్కంటకం చేసితివి, నాకు దారి చూపితివి. నీకిదే నా నమస్కారం..' అంటూ ధ్యాన శ్లోకాలంటూ ఏమీ ఉండవు దానికి. అయితే మనకు దారి చూపినందుకు దానికేసి గౌరవంగా చూస్తాం. ఓ రోజున ఒక ధూర్తుడు రాయి విసిరి దాన్ని పగలగొట్టాడు. ఇంతమందికి వెలుగిచ్చే దీపం, ఇంతమందికి దారిచూపే దీపం... అది మలిగిపోయేటట్లు చేస్తే ... రాయి విసిరినవాడిపై ఆ దీపమేమీ తిరగబడదు. ఆ వెలుగు ప్రయోజనాన్ని అనుభవిస్తున్న మనం దానిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ''అది లేకపోయినా ఫరవాలేదు. మా బతుకు మేం బతికేస్తాం ...'' అంటే దీపానికి వచ్చిన నష్టమేమీ లేదు... మనకు మాత్రం ఆ చీకటే మిగులుతుంది, దానిలో దేవులాటే ఉంటుంది. భగవంతుడు కూడా అంతే. 'నివాసవృక్షః సాధూనాం ఆపన్నానాం పరాగతిః/ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసః చ ఏకభాజనమ్'.. అంటారు కిష్కింధకాండలో. భగవంతుడున్నాడు.. అని నీవు నమ్మి బతకగలిగితే భగవదనుగ్రహం. ఆయనేమిటి ? ఆయనెందుకు?.. అని చెప్పి ఆయనను తిరస్కరిస్తే చీకటి మిగిలేది మనకే, ఆయనకు కాదు. 'అచ్చమైన దీపశిఖ సన్నిధిని మరుగు అడ్డుపడి చెఱచినట్టున్నది...'

ఓ దట్టమైన బట్టలాంటిది అడ్డు వచ్చిందనుకోండి.. అప్పుడు ఆ వెలుతురూ ఉండదు. దాని సహాయంతో చూసే అవకాశమూ ఉండదు. కాబట్టి ఆ దీపశిఖ నాకు కనబడడం లేదు... అంటే ఆ దీప శిఖ మరేదో కాదు, పరబ్రహ్మమే. అది ఒక్కటే వెలుగుతోంది. ''లోకంబులు లోకేశులు లోకస్థులు దెగిన తుదినలోకంబగు పెంజీకటికవ్వల నెవ్వండేకాకృతి వెలుగునతని నే సేవింతున్'' అంటారు పోతనగారు భాగవతంలో...అటువంటి వెలుగు ఇక్కడ వెలుగుతుంది. కానీ ఆ దీపం కనబడకుండా ఒక తెర అడ్డుపడుతున్నది. ఈ తెరను నేను తీయలేను



... అని ఆర్తితో వేడుకుంటున్నాడు త్యాగయ్య. ఇదెలా ఉందంటే...'మత్స్యము ఆకలిగొని గాలముచే మగ్నమైన రీతియున్నది' అని పోలికను చెబుతున్నాడు. చేప దానిదారిన అది పోతూ దారిలో కనిపించిన ఎరచూసి ఆశపడింది. దాన్ని కొరికింది. 'మఛ్లీ జల్ కా రాణీ, ఉస్కా జీవన్ పానీ, హాథ్ లగావ్ తో డర్ జాయేగీ, బాహర్ నికాలేతో మర్ జాయేగీ''.. ఇంకేముంది.. నీళ్ళలోంచి తీసి భూమ్మీద పడేస్తే చచ్చిపోయింది. అంటే తిందామనుకుని తినబడింది. ఈ మత్సరమను తెరతీయనంతకాలం నా పరిస్థితీ ఇంతే.. దీపం కనిపించదు.. స్వామీ ఆ తెరతీయి.. అంటే. అరిషడ్వర్గాల గురించీ నీ ద్వారా ఒక సందేశం లోకానికి అందాలని అనుకున్నాడేమో, ఆయన ఆ తెరనుదీసి దర్శనమిచ్చాడు. ఇదీ సంగీతంవల్ల, పాట పాడడం వల్ల, వినడం వల్ల ప్రయోజనం. అది ఆయనకే కాదు అందరి ఆత్మోద్ధరణకు కారణమయి నిలిచింది. అంత గొప్ప వాగ్గేయకారులు, లోకానికి ఆధ్యాత్మిక భిక్ష పెట్టినవారు, దీప స్తంభాల వంటివారు.. మన మధ్య గడిపిన వారు కావడం మన అదృష్టం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	188	65,795
నిఫ్టీ ▽	33	19,732

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,125	△	12
డోజోన్స్	34,947	△	2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,504	△	93
డాక్స్	15,919	△	133
షాంఘై	3,054	△	4
నికాయ్	33,585	△	155

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	101.67	105.12
€	యూరో	ఎస్‌బీఐ	88.89	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.49	56.18
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.77	55.12
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.83	62.81
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.75
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.59	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.31	12.39




ప్రణాళికతోనే కెరీర్ బంగారం

భారీగా పెరుగుతున్న విద్యా వ్యయాలు • పదేళ్లలో 100–200 శాతం అధికం • విదేశీ విద్య కోసం మరింత మొత్తం ముందస్తు ప్రణాళికతోనే అధిగమించగలం • పిల్లలు ఏడాది వయసు నుంచే పెట్టుబడులు • స్కాలర్‌షిప్, విద్యా రుణాలతో గట్టెక్కే అవకాశం

మనీష్ అరోరా (46) ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త. ఆయనకు 18 ఏళ్ల కుమార్తె 'ఆద్య' ఉంది. ఆమెను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపించాలన్నది అరోరా కల. కుమార్తెకు ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం ఇన్వెస్ట్ చేస్తూ వచ్చారు. దీంతో ఆద్య రెండు నెలల క్రితమే యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్(చికాగో)లో సైకాలజీలో అండర్‌గ్రాడ్యుయేషన్ సీటు సంపాదించింది. అందుకు కావాల్సిన వ్యయాలను అరోరా ముందు చూపుతో సమకూర్చుకున్నారు. ఆద్య చదివే కోర్స్ వ్యయం భారీగా ఉన్నప్పటికీ, ముందస్తు స్పష్టత అరోరాకు మార్గాన్ని చూపించింది. తమ పిల్లలకు వీలైనంతలో అత్యుత్తమ విద్యను అందించాలని అధిక శాతం మంది తల్లిదండ్రులు కోరుకుంటారు. కానీ, ఆచరణలో అంత సులభం కాదు. ప్రణాళికతోనే ఇది సాధ్యం. కెరీర్ ఆప్షన్లు, చేయాల్సిన కోర్స్‌లు, అయ్యే వ్యయం, కాల వ్యవధి ఇలా పలు అంశాలపై స్పష్టత, ప్రణాళికతోనే విజయం సాధించగలరు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కథనమే ఇది.

బోలెడు ఆప్షన్లు

గతంతో పోలిస్తే ఉన్నత విద్యలో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. ఇంజనీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్ కోర్సులు చదవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొందరు భిన్నమైన కోర్సులు ఎంపిక చేసుకుంటుంటే, విదేశీ విద్య కోసం వెళ్లే వారి సంఖ్య కూడా ఏటేటా పెరుగుతూ పోతోంది. ముఖ్యంగా నూతన తరం కోర్సులకు సంబంధించి కెరీర్ ఆప్షన్లు భారీగా అందుబాటులోకి వస్తున్నాయి. ఫైనాన్స్, డేటా అనలైటిక్స్, బిజినెస్ ఎకనామిక్స్, కాగ్నిటివ్ సైన్స్, మెరైన్, సైకాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ ఇవన్నీ ఆకర్షణీయమైన కెరీర్ ఆప్షన్లుగా మారుతున్నాయి. ''గేమ్ డిజైనింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్)కు ఆదరణ పెరుగుతోంది.



ఎక్కువ శాతం కెరీర్ ఆప్షన్లు సోషల్ మీడియా నుంచి ఉంటున్నాయి. వీడియో ఎడిటింగ్‌కు సైతం డిమాండ్ పెరుగుతోంది''అని మ్నెమోనిక్ ఎడ్యుకేషన్ అండ్ ఓవర్‌సీస్ అడ్మిషన్స్ సంస్థ అధినేత శిరీష్ గుప్తా తెలిపారు. ప్రాంప్ట్ ఇంజనీరింగ్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, డేటా సైన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, కంటెంట్ తయారీ వంటివన్నీ బంగారం వంటి అవకాశాలను తెచ్చి పెడుతున్నాయి.

''వచ్చే పదేళ్ల కాలానికి సంబంధించి 85 శాతం ఉద్యోగాలు ఇంకా ఆవిష్కృతం కావాల్సి ఉంది. సంప్రదాయ ఉద్యోగాల నుంచి నిరంతరం మారాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోంది. టెక్నాలజీతో సంబంధం లేని ఉద్యోగం దాదాపు ఉండకపోవచ్చు. అది రిటైల్ అయినా లేక ఈ కామర్స్ అయినా కృత్రిమ మేథ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తుంది''అని టీమ్‌లీజ్ ఎడ్యుటెక్ సహ వ్యవస్థాపకురాలు నీతి శర్మ తెలిపారు. అంటే సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగై పోతాయని అనుకోవద్దు. అస్థిరతలు వద్దనుకునే వారు ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు వెళుతుండడాన్ని గమనించొచ్చు. ఇంజనీర్లు, డాక్టర్లు, పరిశోధకులు, చరిత్రకారుల అవసరం భవిష్యత్తులోనూ ఉంటుంది. కానీ, ఆటోమేషన్, ఏఐ కొన్ని రకాల ఉద్యోగాలకు ముప్పుగా మారడం ఖాయం. లోగో, గ్రాఫిక్ డిజైనింగ్ పనులు ఆటోమేషన్‌కు మారుతున్నాయి. ట్రాన్స్‌లేటర్లు, టెలీ మార్కెటర్ల ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తోంది. యంత్రాలు అంత సులభంగా చేయలేని నైపుణ్యాలు, కోర్సులను చేసే దిశగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని గుప్తా సూచించారు. విద్య, ఉపాధిలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా సోషల్ మీడియాలో చురుగ్గా ఉండడం, తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం సాయంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైతే మెరుగైన విద్యా అవకాశాల కోసం విదేశాలకు పంపించడాన్ని కూడా పరిశీలించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది.

పెరిగిపోతున్న వ్యయాలు

అధిక ద్రవ్యోల్బణం, ప్రత్యేకమైన కోర్సులకు డిమాండ్, ఇందుకు మెరుగైన వసతుల కల్పన కారణంగా దేశ, విదేశాల్లో కోర్సుల వ్యయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు రూ.50వేలకే పూర్తయ్యే ఎంబీఏ కోర్స్ నేడు రూ.5 లక్షలకు చేరడం ఇందుకు ఓ నిదర్శనం. ఐఐఎంలలో ఫీజులు రూ.17 లక్షల నుంచి రూ.24 లక్షల మధ్య ఉన్నాయి. గతంలో ఇవి రూ.6 లక్షల స్థాయిలోనే ఉండేవి. ఐఐటీలోనూ కోర్సు ఫీజు రూ.6–10 లక్షలకు చేరింది. గతంతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐఎం, ఐఐటీల్లో ఫీజుల పెరుగుదల 100 శాతానికి పైనే ఉంటోంది. విదేశాల్లోనూ ఫీజుల పెరుగుదల ఇదే మాదిరిగా ఉంటోంది. మరీ ముఖ్యంగా డాలర్ మారకం రేటు అధికంగా ఉండడం ఈ భారాన్ని మరింత పెంచుతోంది. ''దశాబ్దం క్రితం విదేశాల్లో ఏడాది విద్యా వ్యయాలు రూ.25–30 లక్షల మధ్య ఉండేవి. ఇప్పుడు రూ.50 లక్షలకు చేరాయి''అని గుప్తా తెలిపారు. అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్స్ ఫీజు దశాబ్దం క్రితం రూ.కోటి స్థాయిలో ఉంటే, ఇప్పుడు అది రెట్టింపైంది. కేవలం ట్యూషన్ ఫీజుల వల్లే కాకుండా, జీవన వ్యయాలు కూడా పెరిగిపోవడం ఈ భారాన్ని మరింత పెంచుతోంది.

కాకపోతే విదేశీ విద్యకు సంబంధించి నూరు శాతం స్కాలర్‌షిప్ పొందే అవకాశం కాస్త ఊరటనిస్తుందని చెప్పుకోవచ్చు. ఈ అవకాశం సొంతం చేసుకోవాలంటే విదేశీ విద్యా ప్రవేశానికి మూడేళ్ల ముందు నుంచే తమ ప్రొఫైల్‌పై పని చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ''నూతనతరం కోర్సులు అయితే సాధారణంగా ఏటా రూ.5–10 లక్షల మధ్య ఫీజు ఉంటుంది. ఢిల్లీలోని పెర్ల్ అకాడమీలో బ్యాచిలర్ డిగ్రీ ఇన్ యూఐ/యూఎక్స్ (యూజర్ ఇంటర్‌ఫేజ్/యూజర్ ఎక్స్‌పీరియెన్స్)కు ఏటా రూ.7 లక్షల ఫీజు ఉంది''అని గుప్తా వెల్లడించారు. కోర్సుకు సంబంధించి ట్యూషన్ ఫీజు కేవలం ఒక భాగమే. పిల్లల వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల పెంపు కోసం తల్లిదండ్రులు అదనంగా ఖర్చు చేయక తప్పదు. కాలం చెల్లిన కరిక్యులమ్ నేపథ్యంలో, పిల్లలకు సమాంతరంగా నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాస అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుందని గుప్తా అంటున్నారు. తల్లిదండ్రులు ఉంటున్న ప్రదేశానికి దూరంగా, ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రవేశం లభిస్తే అప్పుడు వారి జీవనం కోసం మరింత వ్యయం చేయాల్సి వస్తుంది. ఇక విదేశాలకు పంపించే వారిపై ఈ భారం మరింత పెరుగుతుంది. వసతి, ఆహారం, లాండ్రీ, ఇంటర్నెట్, మొబైల్, వస్త్రాలు వీటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. జీవనం, రవాణా వ్యయాలు, యుటిలిటీలు (విద్యుత్, టెలిఫోన్), ఆరోగ్య సంరక్షణ, ఇతర అవసరాల కోసం పెద్ద మొత్తంలోనే ఖర్చు చేయాల్సి వస్తుందని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అరిజిత్ సేన్ పేర్కొన్నారు.

భయపెట్టే అంచనాలు



చారిత్రకంగా చూస్తే గడిచిన దశాబ్ద కాలంలో కోర్సుల ఫీజులు నూరు శాతానికి పైగా పెరిగాయి. భవిష్యత్తులోనూ ఇదే తరహా పెరుగుదల ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ''కోర్సుల ఫీజుల పెరుగుదల వచ్చే దశాబ్దం పాటు ఇదే మాదిరిగా ఉంటుంది. జీడీపీ 6 శాతం చొప్పున వృద్ధి చెందుతూ వెళితే, దీనికి అనుగుణంగా సగటున పెరిగే కుటుంబాల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే, విద్యా వ్యయం 10 శాతం చొప్పున పెరుగుతూ వెళ్లినా.. ఫీజులు, విద్యా రుణాలు భారంగా మారతాయి''అని నీతి శర్మ పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వంటి ప్రత్యామ్నాయాల రూపంలో రవాణా, జీవన వ్యయాల వంటివి ఆదా చేసుకునే అవకాశం ఉందని శర్మ వివరించారు. ''ప్రతిష్టాత్మక కాలేజీ నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ చేసేందుకు ఇప్పుడు ఏటా రూ.12–15 లక్షల వరకు ఖర్చవుతోంది. విద్యా ద్రవ్యోల్బణం 10–12 శాతం ఉంటుందన్న అంచనా ఆధారంగా వచ్చే పదేళ్లలో ఇది రూ.40 లక్షలకు చేరొచ్చు. ప్రైవేటు కాలేజీలో ఎంబీబీఎస్ డిగ్రీకి నేడు రూ.కోటి అవుతుంటే పదేళ్ల తర్వాత రూ.3 కోట్లు వ్యయం చేయాల్సి రావచ్చు''అని అరిజిత్ సేన్ తెలిపారు.

అనుసరణీయ మార్గాలు..

ఖరీదుగా మారుతున్న ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు ముందు నుంచే ప్రణాళికాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరం. కాలేజీ ప్రవేశానికి రెండేళ్ల ముందు నుంచే పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. విదేశాలకు పంపించేట్టు అయితే అక్కడి జీవన పరిస్థితులు, సంస్కృతి, దరఖాస్తు ప్రక్రియ, ఎదురయ్యే సవాళ్లపై అవగాహన తెచ్చుకోవాలి. కనుక ఈ విషయంలో నిపుణుల సాయం తప్పనిసరి. ఇప్పటి వరకు చెప్పుకున్నవన్నీ చదువులకు సంబంధించి ప్రస్తుత వ్యయాలు. తమ పిల్లల ఉన్నత విద్యకు ఇంకా ఎన్నేళ్ల కాల వ్యవధి మిగిలి ఉంది? ఎలాంటి విద్యా సంస్థల్లో ప్రవేశాలు తీసుకోవాలి, అక్కడి ప్రస్తుత ఫీజులు, తమ పిల్లలు కాలేజీ ప్రవేశం పొందే నాటికి ఎంత మేర పెరగొచ్చనే విషయాలపై స్పష్టత అవసరం. దీనికి సంబంధించి ఎన్నో సంస్థలు సేవలు అందిస్తున్నాయి. కోర్స్ వ్యయం, ట్యూషన్ ఫీజు, జీవన వ్యయాలు, రవాణా వ్యయాలు, స్కాలర్‌షిప్ ఉన్న అవకాశాలు, మెరుగైన విద్యా సంస్థలు ఎక్కడెక్కడ ఉన్నాయి అనే వివరాలను వారి నుంచి తెలుసుకోవచ్చు. మరీ ముఖ్యంగా పిల్లలు కాలేజీకి వచ్చే నాటికి వారి ఆసక్తులు ఎలా ఉంటాయన్నది ముందే గుర్తించడం అసాధ్యం. కనుక భవిష్యత్‌లో వారు ఏ కోర్స్ చేయడానికి ఆసక్తి చూపిస్తారన్నది ముందుగా తెలియదు. అందుకని ఖరీదైన కోర్స్‌కు సంబంధించి సన్నద్ధం కావడం మంచిది.

మొదటి పుట్టిన రోజు నుంచే..

పిల్లల ఉన్నత విద్యకు కావాల్సినంత సమకూర్చుకునేందుకు ఉన్న సులభ మార్గం వారి మొదటి పుట్టిన రోజు నుంచి ఆరంభించడమే. దీనివల్ల పెట్టుబడులు వృద్ధి చెందడానికి తగినంత సమయం మిగిలి ఉంటుంది. నెలవారీ పరిమిత మొత్తంతో పెద్ద నిధిని సమకూర్చుకోగలరు. ఇందుకు గాను ఫైనాన్షియల్ అడ్వైజర్, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్‌ను ముందే సంప్రదించి తమకు అనుకూలమైన (తగిన) ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. కేవలం ఉన్నత విద్య అనే కాకుండా వారి వివాహాలకు సంబంధించి కూడా విడిగా ప్రణాళిక అవసరం. భారీ ఖర్చులకు సంబంధించి ముందు నుంచే ఇన్వెస్ట్ చేయడం వల్ల నెలవారీ బడ్జెట్‌పై పెద్ద భారం పడదు. పెట్టుబడుల్లో అధిక శాతాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవాలి. 10–15 ఏళ్ల కాలంలో ఈక్విటీలు మెరుగైన రాబడులను ఇవ్వగలవు. కొంత మొత్తాన్ని హైబ్రిడ్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన (కుమార్తెలకు) వంటి సాధనాల్లోనూ ఇన్వెస్ట్ చేసుకోవాలి. పిల్లల ఉన్నత విద్యకు మిగిలి ఉన్న కాల వ్యవధి, ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేయాలి, ఎంత రాబడులు అనే అంశాల ఆధారంగా నిపుణులు వివిధ సాధనాలను సూచిస్తుంటారు. తమకు ఏదైనా జరగరానిది జరిగితే పిల్లల విద్య ఆగిపోకూడదు. అందుకని మెరుగైన కవరేజీతో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. అలాగే, ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో పిల్లలను కూడా భాగం చేయడం, లేదంటే వారి పేరిట ఇండివిడ్యువల్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవడం ఎంతో అవసరం.

స్కాలర్ షిప్/విద్యారుణం



దేశ, విదేశీ యూనివర్సిటీలు చాలా వరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఆఫర్ చేస్తున్నాయి. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లను సందర్శించి ఇందుకు సంబంధించి వివరాలు తెలుసుకోవచ్చు. విదేశాల్లోనూ చాలా యూనివర్సిటీలు స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాయి. పేరొందిన ట్రస్ట్‌లు కూడా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఆఫర్ చేస్తున్నాయి. ఒకవైపు తమ వంతు ఇన్వెస్ట్ చేస్తూనే, మరోవైపు స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఉన్న మార్గాలను తెలుసుకుని ఉండడం మంచిది. కొన్ని యూనివర్సిటీలు ప్రొఫెషనల్ డిగ్రీలకు అనుబంధంగా అప్రెంటిషిప్ అవకాశం కల్పిస్తున్నాయి. దీనివల్ల ప్రత్యక్ష అనుభవంతోపాటు కొంత ఆర్థిక మద్దతు లభించినట్టు అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ పలు యూనివర్సిటీ కోర్సులకు అప్రెంటిషిప్ ప్రోగ్రామ్‌లు అనుబంధంగా ఉన్నాయి. ఉన్నత విద్యా కోర్సులకు సరిపడా సమకూర్చుకోలేని వారు విద్యా రుణాన్ని కూడా పరిశీలించొచ్చు. చిన్న మొత్తం అయితే ఎలాంటి ష్యూరిటీ అవసరం పడదు. పెద్ద మొత్తంలో రుణం తీసుకునేట్టు అయితే ఆస్తుల తనఖా, గ్యారంటీలను బ్యాంకులు కోరొచ్చు. ఇందుకు కూడా ముందుగానే సిద్ధమవ్వాలి. విద్యా రుణాలపై వడ్డీ రేటు 9–15 శాతం మధ్య ఉంది. పిల్లల విద్య పూర్తయి, ఉద్యోగంలో చేరిన తర్వాత చెల్లింపులు చేసే ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. చాలా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు కోర్సు ఫీజులో 80–90 శాతం వరకు రుణంగా ఇస్తున్నాయి. పిల్లలు చదువుకుంటూనే పార్ట్‌టైమ్ అవకాశాలను వినియోగించుకోవడం మరొక మార్గం.

ఎంత మొత్తం కావాలి..?

కోర్స్ పేరు	2023లో వ్యయం	2038లో అంచనా వ్యయం (రూ.లలో)	నెలవారీ చేయాల్సిన పెట్టుబడి?
ఇంజనీరింగ్	5లక్షలు	20.88 లక్షలు	4,181
ప్రముఖ కాలేజీల్లో ఇంజనీరింగ్	10 లక్షలు	41.77లక్షలు	రూ.8,362
వైద్యవిద్య (ప్రభుత్వ)	4లక్షలు	16.70లక్షలు	3,345
వైద్య విద్య (ప్రైవేటు)	50లక్షలు	2.08కోట్లు	41,808
మేనేజ్‌మెంట్ కోర్స్	20 లక్షలు	83.54లక్షలు	16,273
మేనేజ్‌మెంట్ కోర్స్ (యూఎస్‌లో)	2కోట్లు	8.35కోట్లు	1,67,230

నోట్: ఇవి అవగాహన కోసం ఇచ్చిన గణాంకాలు



ఇవి గుర్తు పెట్టుకోవాలి

కాలేజీ ఎంపిక సమయంలో

- పిల్లల ఆసక్తులను తెలుసుకోవాలి
- కొత్తగా వస్తున్న టెక్నాలజీలకు అనుగుణంగా, మెరుగైన అవకాశాలున్న కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- యూనివర్సిటీలు, కోర్సులు, ఫైనాన్షియల్ స్కీముల గురించి లోతైన అధ్యయనం చేయాలి.
- అడ్మిషన్ల ప్రక్రియ, అక్కడి విద్యా కాలం గురించి తెలుసుకోవాలి

పొదుపు విషయంలో

- భవిష్యత్తులో కోర్సుల ఫీజులపై అంచనాకు రావాలి
- ముందు నుంచే ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టాలి
- ఈక్విటీ ఫండ్స్ సహా పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలి
- తగినంత కవరేజీతో లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి



ఫండ్స్ కొత్త పథకాల జోరు

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 48 కొత్త పథకాలు
- రూ.22,000 కోట్లు సమీకరణ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలో నూతన పథకాలు (ఎన్ఎఫ్‌వో) సెప్టెంబర్ త్రైమాసికంలో పెద్ద మొత్తంలో నిధుల సమీకరించాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో మొత్తం 48 ఎన్ఎఫ్‌వోలు మార్కెట్లోకి వచ్చాయి. ఇవన్నీ కలసి ఇన్వెస్టర్ల నుంచి రూ.22,049 కోట్ల నిధులను సమీకరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కేవలం 25 కొత్త పథకాలు రాగా, అవి వసూలు చేసిన మొత్తం రూ.5,539 కోట్లుగానే ఉంది. దీంతో పోలిస్తే సెప్టెంబర్‌లో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. సాధారణంగా మార్కెట్లు గరిష్టాల్లో ఉన్నప్పుడు, బుల్లిష్ సెంటిమెంట్‌ను అనుకూలంగా భావించి ఎన్ఎఫ్‌వోలు ఎక్కువగా వస్తుంటాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
20-11-2023	
విశాఖ	530-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
19-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

ఎస్‌జీబీ మెచ్యూరిటీ ఉపసంహరణ ఎలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

నేను సావరీన్ గోల్డ్ బాండ్లలో (ఎస్‌జీబీలు) ఇన్వెస్ట్ చేశాను. కాల వ్యవధి ముగిసిన తర్వాత వీటిని విక్రయించాలా..? లేక ఆ మొత్తం నా ఖాతాలో జమ అవుతుందా?

– వేదవ్యాస్ విశ్వరూప్

ఎస్‌జీబీల కాల వ్యవధి ఎనిమిదేళ్లు. గడువు ముగియడానికి నెలరోజుల ముందు బాండ్ల మెచ్యూరిటీ తేదీ గురించి ఇన్వెస్టర్లకు సమాచారం వస్తుంది. గడువు ముగిసిన తర్వాత ఆ మొత్తం బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. ఇన్వెస్టర్ పెట్టుబడి పెట్టే రోజున ఇచ్చిన బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. గడువు ముగిసిన రోజు నాటి ముందు మూడు రోజుల బంగారం సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. ఇండియా బులియన్ అండ్ జ్యుయెలర్స్ అసోసియేషన్ ప్రకటించే 999 స్వచ్ఛత బంగారం ధరలను ఇందుకు ప్రామాణికంగా పరిగణిస్తారు. ఆ ప్రకారం ఇన్వెస్టర్‌కు చెల్లింపులు చేస్తారు. ఎస్‌జీబీ సర్టిఫికెట్‌లోనూ బ్యాంక్ ఖాతా వివరాలు నమోదై ఉంటాయి. ఒకవేళ సార్వభౌమ బంగారం బాండ్లను ట్రేడింగ్ ఖాతా ద్వారా సెకండరీ మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తే అవి డీమ్యాట్ ఖాతాలో ఉంటాయి. కనుక మెచ్యూరిటీ ముగిసిన అనంతరం డీమ్యాట్ ఖాతాకు అనుసంధానమైన ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాకు ఆ మొత్తం జమ అవుతుంది. స్టాక్ మార్కెట్లో ఎస్‌జీబీల ట్రేడింగ్ ధర హెచ్చు, తగ్గులుగా ఉండొచ్చు. అయినప్పటికీ గడువు తీరే నాటి ముందు మూడు పని దినాల సగటు ధర ప్రకారమే చెల్లింపులు చేస్తారు. బంగారంలో పెట్టుబడులకు ఎంతో సౌకర్యవంతమైన మార్గం ఎస్‌జీబీలు అని తప్పక చెప్పాలి. పెట్టుబడిపై ఏటా 2.5 శాతం వడ్డీ ఇందులో లభిస్తుంది. ఎనిమిదేళ్ల పాటు పెట్టుబడిని కొనసాగిస్తే వచ్చే లాభంపై ఎలాంటి పన్ను లేదు.

పిల్లల ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?

– శరవణన్

పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, పదేళ్లకు పైగా కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. అందులోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను డైవర్సిఫై చేస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు. ఒకవేళ పన్ను ప్రయోజనం కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీలు సహజంగానే అస్థిరలతో ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల కొనుగోలు ధర సగటుగా మారి, మార్కెట్లు గరిష్టాల వద్ద ఉన్నప్పుడు రిస్క్‌ను తగ్గిస్తుంది. కనుక మీరు పెట్టుబడి మొత్తాన్ని ఒకే సారి కాకుండా.. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి.. అక్కడి నుంచి ప్రతి నెలా సిప్ రూపంలో మూడేళ్ల కాలంలో పెట్టుబడులు పెట్టుకోవడం అన్నది తగిన విధంగా ఉంటుంది. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.




స్టాక్స్ వ్యూ

టీసీఎస్ | కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: బీఎన్‌పీ పరిబాస్

ప్రస్తుత ధర: రూ. 3,499 టార్గెట్: రూ. 4,080

ఎందుకంటే: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో మరోసారి పెద్దగా వృద్ధిలేని ఫలితాలనే ప్రకటించింది. నిజానికి త్రైమాసిక వారీగా నిలకడైన కరెన్సీ ప్రాతిపదికన ఆదాయం అంచనాలకంటే తక్కువగా నమోదైంది. ఇటీవల సాధించిన పటిష్ట డీల్స్ ఆదాయంలో వృద్ధికి పెద్దగా దోహదపడలేదు. పెట్టుబడులపై తక్కువ ప్రతిఫలాల(ఆర్‌వోఐ) నేపథ్యంలో కస్టమర్లు టెక్నాలజీపై వ్యయాలను పునఃసమీక్షించుకోవడం ప్రభావం చూపింది. దీనికితోడు ప్రాజెక్టుల పూర్తి పుంజుకోకపోవడంతో ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి)లోనూ ఆదాయంలో వృద్ధికి దెబ్బ తగిలే వీలుంది. డిమాండ్ రికవరీ పరిస్థితుల్లో స్పష్టతలేకపోవడం దీనికి కారణంకాగా.. స్థూల వాతావరణం సర్దుకుంటే వృద్ధి రికవరీకి వీలుంటుంది. అయితే బీఎస్ఎన్ఎల్ నుంచి గెలుచుకున్న బిలియన్ డాలర్ల కాంట్రాక్టుసహా.. మొత్తం 11.2 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోవడం కంపెనీకి బలాన్నిస్తోంది. టర్నోవర్‌లో వృద్ధి నెమ్మదించినప్పటికీ.. త్రైమాసికవారీగా నిర్వహణ లాభ(ఇబిట్) మార్జిన్లు మెరుగుపడటం గమనార్హం! వ్యయ నియంత్రణలు, సబ్‌కాంట్రాక్టులు తగ్గించుకోవడం, వినిమయం పెంచుకోవడం తదితరాల ద్వారా మార్జిన్లను మరింత బలపరచుకోనుంది. భారీ డీల్స్‌ను సంపాదించడం సానుకూలాంశం.



ఏఐఏ ఇంజనీరింగ్ | కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: జేఎం ఫైనాన్షియల్

ప్రస్తుత ధర: రూ. 3,502 టార్గెట్: రూ. 4,015

ఎందుకంటే: ప్రపంచ మైనింగ్ కన్జూమబుల్స్ రంగంలో పేరొందిన కంపెనీ ఏఐఏ ఇంజినీరింగ్. గ్లోబల్ గ్రైండింగ్ విభాగంలో 7 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. బంగారం(గోల్డ్), రాగి(కాపర్), ముడిఇనుము(ఐరన్ ఓర్) గ్రైండింగ్ మీడియా విభాగంతోపాటు.. చైనామినహాయిస్తే సిమెంట్ గ్రైండింగ్‌లో 35 శాతం వాటాను ఆక్రమిస్తోంది. విభిన్న ప్రొడక్టులను అందించడం ద్వారా ఆర్థికంగా పటిష్ట ఫలితాల సాధనతోపాటు.. వృద్ధి, మార్జిన్లు, నగదు ఆర్జన(క్యాష్ ఫ్లో), ఆర్‌వోఐసీలలో మెరుగైన పనితీరు చూపుతోంది. కంపెనీకి కీలకమైన హైక్రోమ్ గ్రైండింగ్ మీడియా విభాగంలో ప్రొడక్టుల వినియోగం 20–25 శాతానికి మాత్రమే పరిమితం కావడంతో భవిష్యత్‌లో భారీ అవకాశాలకు తెరలేవనుంది. మరోవైపు మెటాలిక్ మిల్ లైనర్స్‌లోకి ప్రవేశించడం ఇందుకు జత కలవనుంది. వెరసి కీలక ప్రొడక్టుల ఆఫరింగ్ ద్వారా ఆదాయంలో భారీ వృద్ధిని సాధించే అవకాశముంది. ఫలితంగా గ్లోబల్ మినరల్ ప్రాసెసింగ్ పరిశ్రమ వృద్ధి అంచనాలు 6 శాతానికి మించి కంపెనీ టర్నోవర్‌లో పురోగతి నమోదయ్యే వీలుంది. ఈ నేపథ్యంలో రానున్న మూడేళ్ల(2023–26) కాలానికి షేరువారీ ఆర్జన(ఈపీఎస్)లో సుమారు 8 శాతం వృద్ధిని ఊహిస్తున్నాం. చివరి రెండేళ్లలో 10 శాతాన్ని మించవచ్చు. ఇక గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన చరిత్రాత్మక 25.3 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు స్వల్ప వెనకడుగుతో 23–24 శాతంగా నమోదుకావచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫలితం మాకు అనుకూలంగా రాలేదు. ఇలా జరగకుండా ఉండాల్సింది. ఈ రోజు మేం బాగా ఆడలేదనే విషయం తెలుసు. అయితే నా జట్టును చూసి గర్విస్తున్నా. నిజాయితీగా చెప్పాలంటే మరో 20–30 పరుగులు చేస్తే బాగుండేది. కోహ్లి, రాహుల్ ఆడుతున్నప్పుడు 270–280 వరకు స్కోరును ఆశించాం. అయితే ఆపై వరుసగా వికెట్లు కోల్పోయాం. 240 పరుగుల తర్వాత ఆరంభంలో వికెట్లు తీయడం కీలకం. అది కూడా చేశాం. కానీ హెడ్, లబుషేన్ చాలా బాగా ఆడారు. వారు మా నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. లైట్ల వెలుగులో పిచ్ బ్యాటింగ్‌కు తేలికగా మారింది. ఇలా జరుగుతుందని మాకూ తెలుసు. అయితే దీనిని సాకుగా చెప్పదల్చుకోలేదు. మేం బ్యాటింగ్ బాగా చేయలేదు. భారీ భాగస్వామ్యంతో జట్టును గెలిపించిన ఆసీస్ ద్వయానిదే ఈ విజయం. –రోహిత్ శర్మ, భారత కెప్టెన్

మా అత్యుత్తమ ప్రదర్శనను ఫైనల్ కోసం దాచి ఉంచినట్లుంది. కీలక మ్యాచ్‌లలో ఆడే సత్తా ఉన్నవారంతా సరైన సమయంలో స్పందించారు. ఇలాంటి ఛేదన సులువని మేం భావించాం. మా బౌలింగ్ చాలా బాగా సాగింది. పిచ్‌కు అనుగుణంగా వ్యూహాలు మార్చుకున్నాం. జట్టులో ఎక్కువ వయస్సున్నవాళ్లు ఉన్నా అంతా రాణించారు. 300 లోపు కట్టడి చేద్దామనుకుంటే 240కే ఆపగలిగాం. ఛేదనలో నా గుండె దడ కూడా పెరిగింది. కానీ హెడ్, లబుషేన్ కలిసి గెలిపించారు. చేయి విరిగిన తర్వాత కూడా హెడ్‌పై మేం నమ్మకం ఉంచి జట్టుతో కొనసాగించడం పని చేసింది. ఆటపై విపరీత అభిమానం చూపించే భారత గడ్డపై మ్యాచ్ ఆడటమే ఒక మంచి జ్ఞాపకం. అలాంటిది మేం ఇక్కడ ప్రపంచకప్ గెలుచుకోవడం అద్భుతమైన అనుభూతి. ఈ క్షణాన్ని చిరస్మరణీయంగా మార్చుకుంటాం. –ప్యాట్ కమిన్స్, ఆస్ట్రేలియా కెప్టెన్






అహ్మదాబాద్‌లో ఆదివారం జరిగిన వన్డే ప్రపంచకప్ టోర్నీ ఫైనల్‌ను వీక్షిస్తున్న సచిన్ టెండూల్కర్, షారుఖ్ ఖాన్, వాసుదేవ్ జగ్గీ, ఆంధ్ర మాజీ క్రికెటర్ చాముండేశ్వరనాథ్, సినీ నటుడు వెంకటేశ్, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, అమిత్ షా, సౌరవ్ గంగూలీ, సినీ నటి దీపికా పడుకోన్ తదితరులు

నిశ్శబ్దం...నిశ్శబ్దం...నిశ్శబ్దం...నిశ్శబ్దం ఎంత భయంకరంగా ఉంటుందో! లక్ష మందికి పైగా మన జనాలు ఉన్న మైదానంలో కూడా నిశ్శబ్దం ఆవరిస్తే ఆ పరిస్థితి ఎలా ఉంటుందనేది అక్కడ కనిపించింది... లక్ష మందిని నిశ్శబ్దంగా ఉంచగలిగితే అంతకు మించిన ఆనందం ఏముంటుంది అంటూ మ్యాచ్‌కు ముందు పరిహసించిన కమిన్స్ దానిని నిజం చేసి చూపించాడు... ఆ నిశ్శబ్దం ఒక్కసారి కాదు స్టేడియంలో మళ్లీ మళ్లీ కనిపించింది... దూసుకుపోతున్న రోహిత్ అవుటైన క్షణాన... 97 బంతుల పాటు కనీసం ఫోర్ కూడా కనిపించని వేళ... కోహ్లిని అవుట్ చేసి కమిన్స్ సింహనాదం చేసినప్పుడు... ఆ తర్వాత ట్రవిస్ హెడ్, లబుషేన్ వికెట్ల వద్ద పాతుకుపోయి అసలు ఏమాత్రం అవకాశం ఇవ్వనప్పుడూ అదే నిశ్శబ్దం కనిపించింది. మైదానంలోనే కాదు... దేశంలోని కోట్లాది మంది అభిమానుల ఆశలు, అంచనాలు కూడా తప్పగా మరోసారి గుండెకోతను మిగుల్చుతూ భారత ప్రపంచకప్ సమరం ఓటమితో ముగిసింది.

రోహిత్, కోహ్లి ముఖాల్లో ఎలాంటి భావాలు కనిపించడం లేదు... కేఎల్ రాహుల్ మోకాళ్లపై కూర్చుండిపోయాడు... సిరాజ్‌కు కన్నీళ్లు ఆగడం లేదు... బుమ్రాలో నాలుగేళ్ల తర్వాతా మళ్లీ అదే బాధ... ప్రపంచకప్ గెలుచుకోవాలని కలగన్న మిగతా ఆటగాళ్ల కళ్ల ముందూ ఒక్కసారిగా శూన్యం ఆవరించింది... ఎన్ని అద్భుత ప్రదర్శనలు... ఎంత గొప్ప ఆట... తిరుగులేని బ్యాటింగ్, పదునైన బౌలింగ్‌తో వరుసగా 10 విజయాలు... ఓటమన్నదే లేకుండా సాగిన ప్రయాణం చివరి మెట్టుపై నిరాశను మిగిల్చింది. లీగ్ దశలో టీమిండియా ఆటతీరు చూస్తే కప్ ఈసారి మనదే అనిపించగా... అసలు పోరాటంలో మాత్రం అనూహ్యంగా అడుగులు తడబడ్డాయి... భారతావని క్రికెట్ అభిమానులంతా టీమిండియా విజయం కోసం చేసిన పూజలు, మొక్కులు పని చేయక మరోసారి విషాదమే మిగిలింది. పదేళ్లుగా ఒక్క ఐసీసీ టైటిల్‌లేని టీమిండియా బాధ మరికొంత కాలం అందరినీ వెంటాడక తప్పదు.

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ఫీల్డింగ్ ఎంచుకుంది... తీవ్ర ఒత్తిడి ఉండే ఫైనల్లో ముందుగా బ్యాటింగ్ చేయడం మంచి అవకాశమే అనిపించింది... రోహిత్ దూకుడైన ఆరంభం చూస్తే భారీ స్కోరు ఖాయం అన్నట్లుగా అతని బ్యాటింగ్ ధాటి చూపించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా సీన్ మారిపోయింది... ఫైనల్ మ్యాచ్ ఒత్తిడి కనిపించింది... తొలి 10 ఓవర్లలో 80 పరుగులు చేసిన జట్టు తర్వాతి పదేసి ఓవర్లలో 35, 37, 45, 43 పరుగులే...చివరకు 240 వద్దే ఆట ముగిసింది. అయినా సరే...ఇంగ్లండ్‌తో 229 పరుగులను కాపాడుకోలేదా? సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 213 పరుగులు సాధించేందుకు ఆసీస్ తీవ్రంగా ఇబ్బంది పడలేదా? ఇప్పుడూ సాధ్యమే అనే ఆశ... ఆసీస్ 47/3 వద్ద ఆ నమ్మకం పెరిగింది... కానీ హెడ్‌ను తీయలేక, లబుషేన్‌ను అడ్డుకోలేక ఆ విశ్వాసం ఓవర్లు సాగుతున్నకొద్దీ కరుగుతూ వచ్చింది... చివరకు ఏమి చేయలేని స్థితిలో భారత్ ఓటమికి సిద్ధమైంది... 2003 ప్రపంచకప్ ఫైనల్‌కు ప్రతీకారంలా కాకుండా రీప్లేలా 2023 వరల్డ్ కప్ సినిమా ముగిసింది.

గుండె 'పదకొండు' ముక్కలు!

ప్రపంచకప్ ఫైనల్లో భారత్ పరాజయం

ఆరోసారి విశ్వ విజేతగా ఆస్ట్రేలియా

- 6 వికెట్ల తేడాతో ఓడిన టీమిండియా
- రోహిత్ బృందం బ్యాటింగ్ వైఫల్యం
- అద్భుత సెంచరీతో ఆసీస్‌ను గెలిపించిన హెడ్
- భారత్‌ను కట్టడి చేసిన ఆసీస్ బౌలర్లు





నిరాశావదనంతో భారత కెప్టెన్ రోహిత్ శర్మ, కోహ్లి, గిల్, శ్రేయస్ అయ్యర్

అహ్మదాబాద్: అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా ఆరోసారి వన్డే క్రికెట్‌లో జగజ్జేతగా నిలిచింది. టోర్నీ ఆరంభ దశలో తడబడి ఆ తర్వాత కోలుకున్న ఆ జట్టు చివరి వరకు అదే పట్టుదలను కనబర్చి వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకుంది. లీగ్ దశలో అజేయంగా నిలవడంతో పాటు వరుసగా 10 విజయాలతో ఊపు మీద కనిపించిన భారత్ అసలు పోరులో తలవంచింది. ఆదివారం నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 240 పరుగులకే ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (107 బంతుల్లో 66; 1 ఫోర్), విరాట్ కోహ్లి (63 బంతుల్లో 54; 4 ఫోర్లు), రోహిత్ శర్మ (31 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 43 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' ట్రవిస్ హెడ్ (120 బంతుల్లో 137; 15 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగగా, మార్నస్ లబుషేన్ (110 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు) అండగా నిలిచాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 35.5 ఓవర్లలో 192 పరుగులు జోడించారు. గతంలో ఆస్ట్రేలియా 1987, 1999, 2003, 2007, 2015లలో కూడా వన్డే ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచింది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓడిపోవడం ఇది రెండోసారి. 2003 ప్రపంచకప్ ఫైనల్లోనూ ఆస్ట్రేలియా చేతిలోనే భారత్ ఓడిపోయింది.

ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా డిప్యూటీ ప్రధానమంత్రి రిచర్డ్ మార్లెస్ విన్నర్స్ ట్రోఫీని అందజేశారు. విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టుకు 40 లక్షల డాలర్లు (రూ. 33 కోట్ల 32 లక్షలు), రన్నరప్ భారత జట్టుకు 20 లక్షల డాలర్లు (రూ. 16 కోట్ల 66 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

రాహుల్ అర్ధ సెంచరీ...

రోహిత్ ఎప్పటిలాగే తనదైన శైలిలో దూకుడుగా ఆటను ప్రారంభించాడు. మరో ఎండ్‌లో గిల్ (7 బంతుల్లో 4) విఫలమైనా రోహిత్ జోరుతో స్కోరు దూసుకుపోయింది. స్టార్క్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లతో కోహ్లి కూడా ధాటిని చూపాడు. 9 ఓవర్లలో భారత్ స్కోరు 66/1. అయితే మ్యాక్స్‌వెల్ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టిన రోహిత్ మరో భారీ షాట్‌కు ప్రయత్నించగా, హెడ్ పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లోనే శ్రేయస్ అయ్యర్ (3 బంతుల్లో 4; 1 ఫోర్) కూడా అవుటయ్యాడు. ఇక్కడి నుంచి భారత్ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆసీస్ బౌలర్లు మన బ్యాటర్లను పూర్తిగా కట్టిపడేశారు. మెరుగైన ఫీల్డింగ్ కూడా ఆ జట్టు అదనపు బలంగా మారింది. కోహ్లి కొంత మెరుగ్గా ఆడినా... రాహుల్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. ఒకదశలో వరుసగా 26.1 ఓవర్ల పాటు (97 బంతులు) ఒక్క ఫోర్ కూడా రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు! 56 బంతుల్లో కోహ్లి అర్ధసెంచరీ పూర్తయింది. ఆ వెంటనే కమిన్స్ వేసిన బంతిని వికెట్లపైకి ఆడుకొని కోహ్లి నిష్క్రమించాడు. కోహ్లి, రాహుల్ నాలుగో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. తడబాటును కొనసాగిస్తూ 86 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీకి చేరగా, బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు వచ్చిన రవీంద్ర జడేజా (22 బంతుల్లో 9) ప్రభావం చూపలేకపోయాడు. ఆపై వరుసగా వికెట్లు తీసిన ఆసీస్ చివరి వరకు ఒత్తిడిని కొనసాగించడంలో సఫలమైంది. 41వ ఓవర్లో స్కోరు 200 పరుగులకు చేరగా, సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 18; 1 ఫోర్) కూడా ఆఖర్లో ఏమీ చేయలేకపోయాడు.



ట్రవిస్ హెడ్

భారీ భాగస్వామ్యం...

లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. షమీ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ తొలి బంతికే వార్నర్ (3 బంతుల్లో 7; 1 ఫోర్) వెనుదిరగ్గా, బుమ్రా బౌలింగ్‌లో మిచెల్ మార్ష్ (15 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్) పెవిలియన్ చేరాడు. స్టీవ్ స్మిత్ (9 బంతుల్లో 4; 1 ఫోర్)ను కూడా బుమ్రా వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆసీస్ స్కోరు 47/3... ఇక్కడే భారత బృందంలో చిన్న ఆశ. మరో వికెట్ తీస్తే ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేయొచ్చనే వ్యూహం. కానీ హెడ్, లబుషేన్ ఆ అవకాశం ఇవ్వలేదు. హెడ్ తన దూకుడును ఎక్కడా తగ్గించకుండా చెలరేగిపోగా, లబుషేన్ చక్కటి డిఫెన్స్‌తో బలంగా నిలబడ్డాడు. వీరిద్దరి జోడీని విడదీయడానికి భారత్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. పిచ్ జీవం కోల్పోయి బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా మారిపోవడంతో పాటు మన బౌలర్లలో కూడా పదును లోపించింది. దీనిని ఆసీస్ ఇద్దరు బ్యాటర్లూ సమర్థంగా వాడుకున్నారు. ఎక్కడా కనీస అవకాశం కూడా ఇవ్వకుండా వీరిద్దరు లక్ష్యం దిశగా జట్టును నడిపించారు. 95 బంతుల్లోనే హెడ్ శతకం పూర్తి చేసుకోగా, 99 బంతుల్లో లబుషేన్ హాఫ్ సెంచరీ పూర్తయింది. విజయానికి మరో 2 పరుగుల దూరంలో హెడ్ అవుటైనా... మ్యాక్స్‌వెల్ (2 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. దాంతో ఆసీస్ శిబిరంలో భారీ సంబరాలు మొదలయ్యాయి.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) హెడ్ (బి) మ్యాక్స్‌వెల్ 47; గిల్ (సి) జంపా (బి) స్టార్క్ 4; కోహ్లి (బి) కమిన్స్ 54; అయ్యర్ (సి) ఇన్‌గ్లిస్ (బి) కమిన్స్ 4; రాహుల్ (సి) ఇన్‌గ్లిస్ (బి) స్టార్క్ 66; జడేజా (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజల్‌వుడ్ 9; సూర్యకుమార్ (సి) ఇన్‌గ్లిస్ (బి) హాజల్‌వుడ్ 18; షమీ (సి) ఇన్‌గ్లిస్ (బి) స్టార్క్ 6; బుమ్రా (ఎల్బీ) (బి) జంపా 1; కుల్దీప్ (రనౌట్) 10; సిరాజ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 240. వికెట్ల పతనం:** 1–30, 2–76, 3–81, 4–148, 5–178, 6–203, 7–211, 8–214, 9–226, 10–240. **బౌలింగ్:** స్టార్క్ 10–0–55–3, హాజల్‌వుడ్ 10–0–60–2, మ్యాక్స్‌వెల్ 6–0–35–1, కమిన్స్ 10–0–34–2, జంపా 10–0–44–1, మార్ష్ 2–0–5–0, హెడ్ 2–0–4–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) కోహ్లి (బి) షమీ 7; హెడ్ (సి) గిల్ (బి) సిరాజ్ 137; మార్ష్ (సి) రాహుల్ (బి) బుమ్రా 15; స్మిత్ (ఎల్బీ) (బి) బుమ్రా 4; లబుషేన్ (నాటౌట్) 58; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (43 ఓవర్లలో 4 వికెట్లకు) 241. వికెట్ల పతనం:** 1–16, 2–41, 3–47, 4–239. **బౌలింగ్:** బుమ్రా 9–2–43–2, షమీ 7–1–47–1, జడేజా 10–0–43–0, కుల్దీప్ 10–0–56–0, సిరాజ్ 7–0–45–1.

765 ఈ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా భారత స్టార్ విరాట్ కోహ్లి నిలిచాడు. కోహ్లి 11 మ్యాచ్‌లు ఆడి 3 సెంచరీలు, 6 అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 765 పరుగులు సాధించాడు.

24 ఈ ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా భారత పేసర్ మొహమ్మద్ షమీ నిలిచాడు. షమీ 7 మ్యాచ్‌లు ఆడి మొత్తం 24 వికెట్లు పడగొట్టాడు. షమీ మొత్తం 48.5 ఓవర్లు వేసి 257 పరుగులు ఇచ్చాడు.

428 మొత్తం ప్రపంచకప్ టోర్నీలలో అత్యధిక టీమ్ స్కోరు ఈ ప్రపంచ కప్‌లోనే నమోదైంది. శ్రీలంకతో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్లకు 428 పరుగులు సాధించింది.

771 ధర్మశాలలో ఆస్ట్రేలియా (388 ఆలౌట్; 49.2 ఓవర్లలో), న్యూజిలాండ్ (50 ఓవర్లలో 383/9) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొత్తం 771 పరుగులు వచ్చాయి. ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో ఇదే అత్యధికం.

201 ఈ ప్రపంచకప్‌లో అత్యధిక వ్యక్తిగత నమోదు చేసిన బ్యాటర్‌గా ఆస్ట్రేలియా క్రికెటర్ మ్యాక్స్‌వెల్ నిలిచాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో 201 నాటౌట్; 21 ఫోర్లు, 10 సిక్స్‌లు) అజేయ డబుల్ సెంచరీ సాధించాడు.

7/57 ఈ ప్రపంచకప్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన బౌలర్‌గా భారత పేసర్ మొహమ్మద్ షమీ నిలిచాడు. న్యూజిలాండ్‌తో ముంబైలో జరిగిన సెమీఫైనల్లో షమీ 57 పరుగులిచ్చి 7 వికెట్లు తీశాడు.

3 ఈ ప్రపంచకప్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో 400 అంతకంటే ఎక్కువ స్కోర్లు మూడు సార్లు నమోదయ్యాయి. శ్రీలంకపై దక్షిణాఫ్రికా (428/5), నెదర్లాండ్స్‌పై భారత్ (410/4), పాకిస్తాన్‌పై న్యూజిలాండ్ (401/6) సాధించాయి.

4 ఈ ప్రపంచకప్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా దక్షిణాఫ్రికా ప్లేయర్ క్వింటన్ డికాక్ నిలిచాడు. డికాక్ 10 మ్యాచ్‌లు ఆడి 4 సెంచరీలతో కలిపి 594 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లి, రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్) 3 సెంచరీల చొప్పున సాధించారు. డరైల్ మిచెల్ (న్యూజిలాండ్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా), శ్రేయస్ అయ్యర్ (భారత్), డసెన్ (దక్షిణాఫ్రికా), మిచెల్ మార్ష్ (ఆస్ట్రేలియా), మ్యాక్స్‌వెల్ (ఆస్ట్రేలియా), ట్రవిస్ హెడ్ (ఆస్ట్రేలియా) 2 సెంచరీల చొప్పున చేశారు.

597 ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్‌గా భారత సారథి రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు. రోహిత్ 11 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ, 3 అర్ధ సెంచరీలతో కలిపి 597 పరుగులు సాధించాడు. కేన్ విలియమ్సన్ (2019లో 578 పరుగులు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు.

7 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో సెంచరీ సాధించిన ఏడో క్రికెటర్‌గా ట్రవిస్ హెడ్ (ఆస్ట్రేలియా) నిలిచాడు. గతంలో క్లయివ్ లాయిడ్ (వెస్టిండీస్ 102; 1975లో వెస్టిండీస్‌పై), వివ్ రిచర్డ్స్ (వెస్టిండీస్ 138 నాటౌట్; 1979లో ఇంగ్లండ్‌పై), అరవింద డిసిల్వా (శ్రీలంక 107 నాటౌట్; 1996లో ఆస్ట్రేలియాపై), రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా 140 నాటౌట్; 2003లో భారత్‌పై), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (ఆస్ట్రేలియా 149; 2007లో శ్రీలంకపై), జయవర్ధనే (శ్రీలంక 103; 2011లో భారత్‌పై) ఈ జాబితాలో ఉన్నారు.

3 వన్డే వరల్డ్‌కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు గెల్చుకున్న మూడో భారతీయ క్రికెటర్‌గా విరాట్ కోహ్లి గుర్తింపు పొందాడు. గతంలో సచిన్ టెండూల్కర్ (2003లో), యువరాజ్ సింగ్ (2011లో) ఈ ఘనత సాధించారు.

ఆస్ట్రేలియాకు మాత్రమే సాధ్యం..!

'2015 కంటే ఈ విజయమే గొప్పది, ఎందుకంటే ఇది భారత గడ్డపై వచ్చింది'... హాజల్‌వుడ్ వ్యాఖ్య ఇది. ఇదే ఈ విజయం విలువేమిటో చెబుతోంది. టోర్నీ ఆరంభంలో 2 మ్యాచ్‌లలో ఓడిన తర్వాత పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అట్టడుగున ఉంది. ఫలితం మాత్రమే కాదు ప్రదర్శన కూడా చెత్తగా ఉంది. రెండు మ్యాచ్‌లలో జట్టు 199, 177 పరుగులే చేయగలిగింది. దాంతో అందరూ ఆసీస్‌ని తేలిగ్గా తీసుకున్నారు. కానీ తర్వాతి మ్యాచ్ నుంచి మొదలు పెడితే సెమీస్ వరకు వరుసగా ఎనిమిదో విజయాలతో ఆ జట్టు దూసుకుపోయింది. న్యూజిలాండ్‌తో, సెమీస్‌లో దక్షిణాఫ్రికాతో అతి కష్టమ్మీద గెలవడంతో ఫైనల్ కూడా భారతే ఫేవరెట్‌గా కనిపించింది. కానీ పట్టుదల, చివరి వరకు ఓటమిని అంగీకరించని తర్వాత ఉన్న కంగారూ బృందం ఎప్పటిలాగే ఐసీసీ టోర్నీలో అసలు సమరంలో సత్తా చాటింది. ప్రధాన పోటీల్లో ఒత్తిడికి తలవంచని తమ బలాన్ని మళ్లీ చూపించింది. ప్రపంచ కప్‌కు ముందు హెడ్ చేతికి గాయమైంది. అతని స్థానంలో మరో ఆటగాడిని ఎంచుకునే అవకాశం ఉన్నా ఆసీస్ ఆ పని చేయక 14 మందితోనే జట్టును కొనసాగించింది. ఇప్పుడు అతను సెమీస్, ఫైనల్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో నిలిచాడు. టోర్నీకి ప్రకటించిన టీమ్‌లో లబుషేన్‌కు చోటు దక్కలేదు. స్పిన్నర్ అగర్ గాయపడగా... అతని స్థానంలో మరో స్పిన్నర్‌ను ఎంచుకోకుండా లబుషేన్‌ను తీసుకుంది. జట్టు కుప్పకూలిపోకుండా మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు సరైన వాడని ఆసీస్ భావించింది. ఫైనల్లో అతను అదే చేసి చూపించాడు. వార్నర్, మ్యాక్స్‌వెల్ ఐపీఎల్ అనుభవం ఇక్కడా బాగా పని చేయగా, మార్ష్ కూడా రెండు కీలక శతకాలు బాదాడు. ముఖ్యంగా అఫ్గానిస్తాన్‌పై 91/7తో ఓటమికి చేరువైన దశలో మ్యాక్స్‌వెల్ చేసిన డబుల్ సెంచరీ నభూతో నభవిష్యత్. స్టార్క్, హాజల్‌వుడ్ చెరో 16 వికెట్లతో జట్టుకు చుక్కానిలా నిలవగా, లెగ్‌స్పిన్నర్ జంపా 23 వికెట్లతో సత్తా చాటాడు. అన్నింటికి మించి పేసర్‌గా, కెప్టెన్ కమిన్స్ ముద్ర ప్రత్యేకం. బౌలింగ్‌లో 15 వికెట్లు పడగొట్టడంతో పాటు వ్యూహాలపరంగా అతను చూపించిన సాహసం, తెగువ కమిన్స్‌ను ప్రత్యేకంగా నిలిపాయి. ఫైనల్లో తన 10 ఓవర్లలో ఒక్క బౌండరీ కూడా ఇవ్వకుండా భారత్‌ను కట్టి పడేయగలిగాడు. 2023లో డబ్ల్యూటీసీ, యాషెస్, వరల్డ్ కప్ కోసం సన్నద్ధమయ్యేందుకు ఐపీఎల్‌కు దూరంగా ఉంటున్నానని ప్రకటించిన కమిన్స్... ఈ మూడింటిలోనూ అద్భుత విజయాలతో ఆసీస్ గొప్ప నాయకుల్లో ఒకడిగా తన స్థానాన్ని లిఖించుకున్నాడు.

–సాక్షి క్రీడా విభాగం



సాక్షి
స్పోర్ట్స్
సోమవారం
20-11-2023



అభిమాని కలకలం

అహ్మదాబాద్: రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య లక్ష పైచిలుకు అభిమానులున్న స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది. 6000 మందికి పైగా సాయుధ బలగాలు పహారా కాస్తున్నాయి. ఇంతటి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన కూడా... ఆస్ట్రేలియాకు చెందిన పాలస్తీనా సానుభూతివరుడు ఇన్ని అంచెలను దాటుకొని కోహ్లిని కలవడం, కౌగిలించుకోవడం కలకలం సృష్టించింది. ఇది భద్రత డొల్లతనాన్ని బయట పెట్టింది. వెంటనే అప్రమత్తమైన భద్రత దళాలు వేన్ జాన్సన్ అనే ఆస్ట్రేలియన్‌ను నిర్బంధించాయి. అతన్ని చాంద్ ఖేడా పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి విచారణ చేపట్టింది. ప్రస్తుతం పాలస్తీనాలో హమాస్, ఇజ్రాయెల్‌ల మధ్య భీకర దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే!

అబ్బుర పరిచిన వాయుసేన విన్యాసాలు



అహ్మదాబాద్: అనుకున్నట్లుగానే చక్కని ప్రణాళికతో, స్వల్పకాల రిహార్సల్స్‌తో భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ చేసిన ఏయిర్ షో లక్షమందికి పైగా ప్రేక్షకుల్ని కన్నార్పకుండా చేసింది. తొమ్మిది హాక్ ఎంకే–132 ఎయిర్‌క్రాఫ్టలతో కూడా బృందం నరేంద్ర మోదీ స్టేడియంపై చరిత్ర సృష్టించింది. లక్షా 32 వేల మంది జేజేలతో విన్యాసాలను ఆస్వాదించారు. సూర్యకిరణ్ టీమ్ వైమానిక విన్యాసాలు కొత్త కాకపోయినా... ఓ క్రికెట్ స్టేడియంపై ఎయిర్‌షో చేయడమే కొత్త. గతంలో క్రికెట్ అనే కాదు... ఏ ఆటకు అంతెందుకు భారత్ ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ గేమ్స్ (2010)లోనూ ఇలాంటి విన్యాసాలు చేయలేదు. తద్వారా ఈ ప్రపంచకప్‌కు ఎయిర్ షో కొత్త శోభ తెచ్చినట్లయింది.

కోహ్లి... నీకో బహుమతి: సచిన్



అహ్మదాబాద్: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వన్డేల్లో తన 49 సెంచరీల రికార్డును చెరిపేసిన కింగ్ కోహ్లికి అమూల్యమైన బహుమతిని బహూకరించాడు. 24 ఏళ్ల కెరీర్‌లో తన 10 నంబర్ జెర్సీ అంతర్జాతీయ క్రికెట్‌లో లిఖించిన చరిత్ర అందరికీ తెలిసిందే. ఫైనల్‌కు ముందు సచిన్ స్వయంగా చేసిన ఆటోగ్రాఫ్ జెర్సీని కోహ్లికి అందజేశాడు. ఈ జెర్సీని సచిన్ 2012లో జరిగిన ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తో జరిగిన ఆఖరి వన్డే సందర్భంగా ధరించాడు. 'ఈ ప్రత్యేక సందర్భంలో ప్రత్యేక అనుభూతినిచ్చే గిఫ్ట్‌ను సచిన్... విరాట్‌కు అందజేశాడు' అని బీసీసీఐ సచిన్, కోహ్లిల ఫోటోతో పోస్ట్ చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన సెమీస్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి 50వ సెంచరీతో సచిన్ రికార్డు (49)ను బద్దలు కొట్టాడు.



అద్భుతం నుంచి ఆవేదన వరకు...

ప్రపంచకప్‌లో భారత్‌కు మరోసారి నిరాశ • తుది మెట్టుపై తడబాటు

మళ్లీ అదే బాధ... మరోసారి అదే వేదన... చేరువై దూరమైన వ్యథ! తమ అద్భుత ఆటతో అంచనాలను పెంచి విశ్వ విజేతగా నిలిచేందుకు అన్ని అర్హతలు ఉన్న జట్టుగా కనిపించిన భారత్ విషాదంగా మెగా టోర్నీని ముగించింది. 2003లో ఆసీస్ చేతిలో ఓడిన బాధ నాటి తరానికి మాత్రమే గుర్తుంటుంది... కానీ నాలుగేళ్ల క్రితం 2019 సెమీఫైనల్లో మన ఓటమి ఇంకా అభిమానుల మదిలో తాజాగానే ఉంది. ఇప్పుడు స్వదేశంలో దానిని సరిదిద్దుకునే అవకాశం లభించింది. తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై మన ఆధిపత్యం చూస్తే భారత జట్టుపై అంచనాలు పెరిగాయి... ప్రపంచకప్‌నకు ఆరు నెలల ముందు నుంచి జట్టు కూర్పుపై ప్రణాళికలు, ప్రదర్శన, ఒక్కో ఆటగాడి వ్యక్తిగత ప్రదర్శనలు, వారికి అప్పగించిన వేర్వేరు బాధ్యతలు అద్భుతంగా పని చేశాయి. కోచ్‌గా రాహుల్ ద్రవిడ్, రోహిత్ కెప్టెన్సీ మధ్య గొప్ప సమన్వయం మెరుగైన వ్యూహాలకు బాట వేసింది. ఈ నాలుగేళ్ల కాలంలో 66 వన్డేల్లో కలిపి భారత్ 50 మంది ఆటగాళ్లను ఆడించింది. ఏ ఇతర జట్టూ ఇంత మందికి అవకాశం కల్పించలేదు. ముఖ్యంగా ప్రతీ స్థానం కోసం సరిగ్గా సరిపోయే ఆటగాళ్లను గుర్తించే ప్రయత్నం ఇందులో జరిగింది. ఆయా ఆటగాళ్ల ప్రదర్శన తర్వాత ఈ సంఖ్యను సగానికి తగ్గించి 24 మందితో ఒక జాబితా తయారైంది. ఇందులో నుంచే వరల్డ్‌కప్ కప్ టీమ్ ఉంటుందనే విషయంపై స్పష్టత వచ్చింది. వరల్డ్‌కప్‌నకు ఆరు నెలల ముందునుంచి చూస్తే 2023 మార్చి 1 నుంచి అక్టోబర్ 4 మధ్య భారత్ 15 వన్డేలు ఆడితే ఈ 24 నుంచే జట్లను ఎంపిక చేశారు. అనంతరం 15 మందితో వరల్డ్ కప్ టీమ్ ఎంపికైంది. వరుస అద్భుత విజయాలు వీరితోనే సాధ్యమయ్యాయి.

'మేం జట్టుగా గెలుస్తాం...జట్టుగా ఓడతాం'... ప్రపంచకప్ మొత్తం భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ నినాదం గట్టిగా మార్మోగింది. సెమీస్ వరకు ఒక్కసారి కూడా ఓటమిని దరి చేరనీయకుండా విజయంపై విజయంపై సాధిస్తూనే టీమిండియా తమ స్థాయిని ప్రదర్శించింది. ఎదురులేని ఆటతో వరుసగా 10 మ్యాచ్‌లను సొంతం చేసుకొని అంచనాలను ఆకాశానికి పెంచింది. 1983 వరల్డ్‌కప్ అనగానే జింబాబ్వేపై కపిల్ దేవ్ 175 నాటౌట్, ఫైనల్లో కపిల్ పట్టిన రిచర్డ్స్ క్యాచ్‌లాంటివి ప్రత్యేకంగా కనపడతాయి. 2011లో యువరాజ్ సింగ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పాటు ధోని కొట్టిన విన్నింగ్ సిక్సరే అందరి మనసుల్లో ముద్రించుకుపోయింది. ఈ రెండు మెగా టోర్నీల్లోనూ ఇతర ఆటగాళ్లు తమ వంతు పాత్ర పోషించినా... టీమ్ గేమ్‌లో గెలవాలంటే అందరి భాగస్వామ్యం తప్పనిసరి అని ఎన్ని మాటలు చెప్పుకున్నా కొన్ని వ్యక్తిగత ప్రదర్శనలే హైలైట్ అయి అవే ప్రపంచకప్‌ను గెలిపించాయనే భావన కలిగిస్తాయి. కానీ ఈ టోర్నీలో మాత్రం భారత ఆటగాళ్లందరూ హీరోలే. ఒకరు ఎక్కువా కాదు, ఒకరు తక్కువా కాదు. మైదానంలోకి దిగిన ప్రతీ ఒక్కరు తమదైన ఆటతో జట్టును గెలిపించారు... జట్టు కోసం గెలుపు అవకాశాలు సృష్టించారు. జట్టుకు విజయం అందించేందుకు ఒకటో నంబర్ ఆటగాడినుంచి పదకొండో నంబర్ ప్లేయర్ వరకు ఒకరితో మరొకరు పోటీ పడ్డారు. వ్యక్తిగతంగా చూస్తే ప్రతీ పోరులో ఒకరు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలుస్తారు. కానీ భారత జట్టుకు సంబంధించి ప్రతీ మ్యాచ్‌లో అందరూ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌లే. ఒక బ్యాటర్ నెమ్మదించినట్లు కనిపిస్తే మరొకరు చెలరేగిపోయారు. ఒక బౌలర్ కాస్త తడబడినట్లు అనిపిస్తే నేనున్నానంటూ మరో బౌలర్ వచ్చి లెక్క సరిచేశారు. పవర్‌ప్లేలో పవర్ అంతా చూపిస్తే, మధ్య ఓవర్లలో మరొకరు ఇన్నింగ్స్ నడిపించారు. చివర్లో చెలరేగే బాధ్యత ఇంకొకరిది. భారత గడ్డపై పేసర్లు ఇంతగా ప్రభావం చూపించగలరని ఎవరైనా అనుకున్నారా! మన త్రయం దానిని చేసి చూపించింది. ఒక్కో బంతిని ఆడేందుకు బ్యాటర్లు పడిన తిప్పలు చూస్తే దాని పదునేమిటో తెలుస్తుంది. ఇక స్పిన్ ద్వయం ప్రత్యర్థులను పూర్తిగా కట్టి పడేసింది. ఒకరు కాదు ఇద్దరు కాదు... ఐదుగురూ వికెట్లు తీయగల సమర్థులైన బౌలర్లు ఉన్న టీమిండియాను చూసి ఎన్నాళ్లయింది?

అంకెలపరంగా చూస్తే ప్రతీ ఒక్కరి పాత్ర జట్టును గెలిపించింది. 11 ఇన్నింగ్స్‌లలో 3 సెంచరీలు, 6 అర్ధసెంచరీలతో 765 పరుగులు చేసిన కోహ్లి తన విలువేంటో చూపించాడు. ముందుగా క్రీజ్‌లో కుదురుకొని తర్వాత ధాటిగా ఆడే తన శైలిని మార్చుకొని ఆరంభంలో చెలరేగి విజయానికి పునాది వేసే వ్యూహంతోనే ఆడిన కెప్టెన్ రోహిత్ కూడా 597 పరుగులు చేశాడు. శ్రేయస్ (530), రాహుల్ (452), శుబ్‌మన్ గిల్ (354) కూడా కీలక పరుగులు సాధించారు. ఇక బౌలింగ్‌లో 7 మ్యాచ్‌లలోనే కేవలం 10.70 సగటుతో 24 వికెట్లు తీసి మొహమ్మద్ షమీ టోర్నీని ఒక ఊపు ఊపాడు. బుమ్రా 20 వికెట్లతో తన సత్తాను చాటగా... జడేజా (16), కుల్దీప్ (15), సిరాజ్ (14) బౌలింగ్ దళం బలాన్ని చూపించారు.

కానీ... కానీ... ఫైనల్ పోరులో మాత్రం ఈ గణాంకాలన్నీ పనికి రాలేదు. సెమీస్ వరకు స్వేచ్ఛగా ఆడినా... వరల్డ్ కప్ ఫైనల్ ఆడుతున్న ఒత్తిడి సహజంగానే వారిలో కనిపించింది. అందుకే అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ ఏదీ కలిసి రాలేదు. గిల్, శ్రేయస్ జోరు చూపించలేకపోగా, రాహుల్ పూర్తిగా తడబడ్డాడు. ఫైనల్‌లాంటి కీలక పోరులో రోహిత్ తన దూకుడు కాస్త నియంత్రించుకొని ఉంటే బాగుండేదని అనిపించినా... అతనూ విఫలమయ్యే ప్రమాదమూ ఉండేది. కోహ్లి ఒక్కడే తన స్థాయికి తగ్గ ఆటను చూపించగలిగినా అది సరిపోలేదు. జడేజా, సూర్య ఇలాంటి సమయంలో ఆదుకోలేకపోయారు. అయితే బౌలింగ్ దళం కాస్త ఆశలు కలిగించింది. ఆరంభంలో మూడు వికెట్లు తీయడం కూడా నమ్మకం పెంచింది. అయితే 240 పరుగుల స్కోరు మరీ చిన్నదైపోయింది. పది విజయాల ప్రదర్శన తర్వాత ఇలాంటి ఆట ఓటమి వైపు నిలిపింది.

అయినా సరే... భారత్ ప్రదర్శనను తక్కువ చేయలేం. లీగ్ దశలో తొమ్మిది వేర్వేరు ప్రత్యర్థులతో, వేర్వేరు వేదికలపై సాగించిన ఆధిపత్యం అసాధారణం. ఆటగాళ్ల శ్రమ, అంకితభావం అన్నింటిలో కనిపించాయి. ఈ టీమ్ చాంపియన్‌గా నిలిచేందుకే పుట్టింది అని అనిపించింది. అయితే ఏదైనా తప్పు జరగాలని రాసి పెట్టి ఉంటే అది ఎలాగూ జరుగుతుంది. కానీ కీలక సమయంలోనే అది జరుగుతుంది. ఈ టోర్నీలో మనం ఒక్క మ్యాచ్ అయినా ఓడాలని రాసి పెట్టి ఉన్నట్లుంది. ఆ మ్యాచ్ కాస్తా ఫైనల్ మ్యాచ్ కావడమే విషాదం!

–సాక్షి క్రీడా విభాగం

సినిమా


● రామ్‌చరణ్

చలో మైసూర్

హీరో రామ్‌చరణ్ కొన్ని రోజులు మైసూర్‌కు మకాం మార్చనున్నారట. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పొలిటికల్ యాక్షన్ ఫిల్మ్ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ మైసూర్‌లో జరిగేలా చిత్రయూనిట్ ప్లాన్ చేసిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ నెల చివర్లో జరగనున్న ఈ షెడ్యూల్‌లో రామ్ చరణ్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరించేలా శంకర్ ప్లాన్ చేశారట. అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, నవీన్‌చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'గేమ్‌చేంజర్' వచ్చే ఏడాది విడుదల కానుంది.

అలాంటి వ్యక్తితో నటించకపోవడం సంతోషం
– త్రిష



తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ వివాదాస్పద వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లోకెక్కాడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ–''నేను గతంలో చాలా సినిమాల్లో హీరోయిన్లతో బెడ్ సీన్లలో నటించా. 'లియో' సినిమాలో అవకాశం వచ్చినప్పుడు త్రిషతో బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని అనుకున్నాను. అయితే అలాంటి సన్నివేశం లేకపోవడం బాధపడ్డాను. కశ్మీర్ షెడ్యూల్ అయిపోయే వరకు త్రిషను చూసే అవకాశం కూడా చిత్ర యూనిట్ ఇవ్వలేదు'' అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశమంతటా చర్చనీయాంశంగా మారాయి. ఈ వార్తలు త్రిష వద్దకు చేరడంతో సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. ''మన్సూర్ అలీఖాన్ నా గురించి అసహ్యంగా మాట్లాడిన వీడియో నా దృష్టికి వచ్చింది.. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటి వ్యక్తులతో నటించకపోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులోనూ ఆయనతో, అలాంటి వారితో నటించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటా. ఇలాంటి వారి వల్లే మానవాళికి చెడ్డపేరు వస్తోంది'' అన్నారు. అయితే తన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగడంతో మన్సూర్ అలీ ఖాన్ స్పందిస్తూ–''త్రిష అంటే నాకు చాలా గౌరవం ఉంది. నేను సరదాగా మాట్లాడిన వ్యాఖ్యలపై ఇలాంటి దుమారం రేగుతుందనుకోలేదు.. నా మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవద్దు'' అన్నారు.

దుబాయ్‌లో యానిమల్


● రణబీర్ కపూర్, బాబీ డియోల్

రణబీర్ కపూర్, రష్మిక మందన్న జంటగా నటించిన చిత్రం 'యానిమల్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో నటించారు. గుల్షన్ కుమార్, టి.సిరీస్ సమర్పణలో భద్రకాళి పిక్చర్స్, సినీ 1 స్టూడియోస్‌పై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కృషణ్ కుమార్, మురాద్ ఖేతాని నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో డిసెంబరు 1న విడుదలవుతోంది. ఈ సినిమాలోని 'అర్జన్ వైలీ..' అనే పాటను దుబాయ్‌లోని ఐకానిక్ గ్లోబల్ విలేజ్‌లో అభిమానుల మధ్య ఘనంగా విడుదల చేశారు మేకర్స్. ఈ వేడుకలో రణబీర్ కపూర్, బాబీ డియోల్ పాల్గొన్నారు. వేదికపై 'అర్జన్ వైలీ...' పాటకు స్టార్ కాస్ట్‌తో పాటు అభిమానులు చేసిన డ్యాన్స్ వైరల్‌గా మారింది.

మూడు ముళ్లు... ఏడడుగులు

సీనియర్ నటి రాధ కుమార్తె, 'రంగం' ఫేమ్ హీరోయిన్ కార్తీక వివాహం ఆదివారం వైభవంగా జరిగింది. రోహిత్ మేనన్‌తో కార్తీక ఏడడుగులు వేశారు. తిరువనంతపురంలోని కవడియార్ ఉదయ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్‌లో కేరళ సంప్రదాయ పద్ధతిలో వీరి పెళ్లి జరిగింది. ఈ వివాహానికి ఇరు కుటుంబసభ్యులు, సన్నిహితులతోపాటు హీరో చిరంజీవి–సురేఖ దంపతులు, నటీనటులు రాధిక, సుహాసిని, రేవతి, భాగ్యరాజ్ తదితరులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా నాగచైతన్య హీరోగా రూపొందిన 'జోష్'(2009) సినిమాతో కార్తీక తెలుగులో హీరోయిన్‌గా అడుగుపెట్టారు. ఆ తర్వాత పలు తెలుగు, మలయాళం, తమిళ చిత్రాల్లో నటించి, తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2015 తర్వాత ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ వ్యాపార రంగంలో బిజీ అయ్యారు.


● రోహిత్ మేనన్, కార్తీక

ప్రయోగాత్మక సినిమాలు చేయాలనుంది
– హ్రితిక



వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వం వహించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హ్రితికా శ్రీనివాస్ మాట్లాడుతూ–''నటి ఆమని గారు మా మేనత్త. దీంతో చిన్నప్పటి నుంచే నాకు సినిమాలపై ఆసక్తి ఉండేది. బాలనటిగా కొన్ని సినిమాల్లో నటించాను. అమాయకులైన తండ్రీ కొడుకులు ఈజీ మనీ కోసం ఏం చేస్తారు? అనేది 'సౌండ్ పార్టీ' కథ. ఇందులో నేను సిరి పాత్రలో నటించాను. కామెడీతో పాటు కంటెంట్ ఉన్న ఫిల్మ్ ఇది. తెలుగులో సాయిపల్లవిగారంటే ఇష్టం. ఆమెలాంటి పాత్రలు చేయాలని ఉంది. హీరోల్లో నానీగారు అంటే ఇష్టం. భవిష్యత్తులో ప్రయోగాత్మక సినిమాల్లో నటించాలని ఉంది'' అన్నారు.

భయపెట్టే పిండం!


● ఖుషీ రవి, శ్రీరామ్

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా సాయికిరణ్ దైదా దర్శకత్వం వహించిన హారర్ ఫిల్మ్ 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఆరోహి దైదా సమర్పణలో యశ్వంత్ దగ్గుమాటి నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 15న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ''ప్రేక్షకులను భయపెట్టడమే లక్ష్యంగా ఈ సినిమా తీశాం. స్క్రీన్ ప్లే హైలైట్‌గా ఉంటుంది. డిసెంబరు 7న ప్రీ రిలీజ్ వేడుక నిర్వహిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈశ్వరీ రావు, అవసరాల శ్రీనివాస్, రవివర్మ కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు కృష్ణ సౌరభ్ సూరంపల్లి సంగీతం అందించారు.

డేట్ ఫిక్స్


● సుధీర్

'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా అరుణ్ విక్కీరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. వెంకటేశ్వర్లు కాటూరి, విజేష్ తయల్, చిరంజీవి పమిడి నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 1న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. ''సుధీర్‌ను సరికొత్త కోణంలో చూపించేలా ఈ సినిమాలో ఆయన పాత్ర ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు.

హత్యా? ఆత్మహత్యా?


● స్పందన పల్లి

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధానపాత్రల్లో నటించిన ఇంటరాగేటివ్ ఫిల్మ్ 'ది ట్రయల్'. రామ్ గన్ని దర్శకత్వంలో స్మృతి సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీ విష్ణు విడుదల చేసి, మాట్లాడుతూ–''ది ట్రయల్' ట్రైలర్ చాలా ఆసక్తిగా ఉంది. రామ్ ఈ సినిమా కథను బాగా డీల్ చేశారనిపిస్తోంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''కథ రీత్యా సబ్‌ఇన్‌స్పెక్టర్ రూప, ఆమె భర్త అజయ్ ఓ అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై తొలి వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుంటారు. అజయ్ కాలుజారి ఆ బిల్డింగ్‌పై నుంచి పడి చనిపోతాడు. తన భర్తను రూపే చంపిందనే అనుమానం తెరపైకి వస్తుంది. అయితే తన భర్తది ఆత్మహత్య అని రూప చెబుతుంది. అసలు.. అజయ్‌ది హత్యా? ఆత్మహత్యా? అనేది ఈ సినిమా ప్రధాన కథాంశం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

కుటుంబమంతా చూడాల్సిన చిత్రం
– సుమన్


● రామచంద్రరావు, సుమన్, తేజ్

''మాధవే మధుసూదన' సినిమాని రామచంద్ర రావుగారు చాలా స్పష్టతతో తీశారు. ప్రతి సన్నివేశంలో ఆయన అనుభవం నాకు కనిపించింది. కుటుంబమంతా కలిసి థియేటర్స్‌లో చూడాల్సిన చిత్రం ఇది'' అని నటుడు సుమన్ అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికి లోక్రే జంటగా నటించిన చిత్రం 'మాధవే మధుసూదన'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ మూవీ ఈ నెల 24 విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బొమ్మదేవర రామచంద్రరావు మాట్లాడుతూ – ''సినిమా ఇండస్ట్రీలో నాకు 45 ఏళ్ల అనుభవం ఉంది.. నేనే డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా మా అబ్బాయి తేజ్‌ని హీరోగా పెట్టి సినిమా చేశా. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు. ''మాధవే మధుసూదన'తో ఒక మంచి ప్రయత్నం చేశాం'' అని తేజ్ బొమ్మదేవర అన్నారు.

వైద్యో నారాయణో హరి..


● చైతన్యకృష్ణ

చైతన్యకృష్ణ హీరో పరిచయమవుతున్న ఎమోషనల్ థ్రిల్లర్ 'బ్రీత్'. 'వైద్యో నారాయణో హరి' అనేది ట్యాగ్ లైన్. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో నందమూరి జయకృష్ణ నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 2న విడుదల చేస్తున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. వైదిక సెంజలియా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు మార్క్ కె.రాబిన్ సంగీతం అందించారు.

క్లుప్తంగా

మురుఘ స్వామిపై ఫిర్యాదు

సాక్షి,బళ్లారి: బాలికలపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోక్సో కేసు నమోదై ఏడాదిన్నర కాలంగా జైలులో ఉండి బెయిల్‌పై విడుదలైన చిత్రదుర్గం మురుఘ మఠం శివమూర్తి స్వామిపై మరో ఫిర్యాదు నమోదైంది. ఆయన బెయిల్‌పై విడుదలైన తర్వాత దావణగెరెలోని విరక్త మఠంలో ఉంటుండడంతో సాక్షులను బెదిరించి తారుమారు చేసే అవకాశం ఉంటుందని, మఠంలో స్వామి ఉండకూడదని న్యాయవాది మధుకుమార్ లిఖితపూర్వకంగా చిత్రదుర్గం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో మురఘా మఠం స్వామి దావణగెరెను వీడాల్సి రావచ్చని భావిస్తున్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కంప్లి: ఇకపై లబ్ధిదారులందరికీ ఇళ్ల పట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే ఎస్‌టీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కూడ్లిగి తాలూకాలో జరిగిన జనతా దర్శన్‌లో జిల్లాధికారి, వలయ అటవీ సంరక్షణాధికారి ఆధ్వర్యంలో తాలూకాలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ది దారులకు పట్టాలు అందించారు. రెవెన్యూ లబ్ధిదారులకు పట్టాలు సిద్ధం చేశారని, ముమ్ముందు ఇదే ఆసక్తి చూపి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్నారు.

కుప్పణ్ణపై చర్యలకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: రామనగర్ జిల్లాలో బోవి సమాజాన్ని నిందించిన తనీషా కుప్పణ్ణపై చర్యలు చేపట్టాలని బోవి సమాజం డిమాండ్ చేసింది. శనివారం సాయంత్రం ఎస్పీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి జిల్లాధ్యక్షుడు ఈరణ్ణ మాట్లాడారు. రామనగర్ జిల్లా నుంచి బిగ్ బాస్ పోటీల్లో డోణి ప్రతాప్‌తో జరిగిన సంభాషణలో బోవి సమాజాన్ని అవమాన పరిచే విధంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ నిఖిల్‌కు వినతిపత్రం సమర్పించారు.

విద్యతో పాటు సంస్కారం అవసరం



చిత్రపటానికి పుష్పాంజలి అర్పించిన దృశ్యం

రాయచూరు రూరల్: ఉపాధ్యాయులు, పెద్దలు పిల్లలకు విద్యతో పాటు సంస్కారం నేర్పాల్సిన అవసరం ఉందని సీనియర్ అధ్యాపకుడు తిమ్మారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మున్నూరు కాపు విద్యా సంస్థలో జరిగిన బాలల దినోత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యతో పాటు ధర్మం, సనాతన, సంప్రదాయాలు, సంస్కారాన్ని అలవర్చుకొనేలా శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివకుమార్, సుజాత, ధర్మచరణ్, జ్ఞానదేవి, బసవరాజేశ్వరి, అశ్వినిలున్నారు.

కేపీఎస్‌సీ పరీక్షలు ప్రశాంతం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీసీ దురుగేష్

రాయచూరు రూరల్: జిల్లాలో కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్(కేపీఎస్‌సీ) ద్వారా నిర్వహించిన సీ గ్రూప్ ఉద్యోగుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద టాగూర్ స్మారక కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని అదనపు జిల్లాధికారి దురుగేష్ తనిఖీ చేశారు. జిల్లాలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 4299 అభ్యర్థులకు గాను 4026 మంది హాజరు కాగా 273 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి సురేష్ తెలిపారు.

ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు సూచన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని యువత ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ సూచించారు. ఆదివారం నగరంలోని ఎల్‌వీడీ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కూడా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పేర్లను చేర్పించుకోడానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మెహబూబి, నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య, సదాశివప్ప, వెంకటేష్ దేశాయిలున్నారు.

పార్కులు అధ్వానం..ఆహ్లాదం దూరం

- ఉద్యానవనాల్లో పరిశుభ్రత కరువు
- అధికారులు, పాలకుల తీరుపై ఆగ్రహం



ఆలనాపాలన కరువై అధ్వానంగా ఉన్న గణేష్ కాలనీలోని పార్కు



పార్కులో వృథాగా పక్కన పడవేసి ఉన్న వ్యాయామ పరికరాలు

సాక్షి,బళ్లారి: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెత నగరానికి అచ్చు గుద్దినట్లు సరిపోతోంది. స్టీల్ సిటీగా పేరొందిన నగరం చెత్త నగరంగా మారుతున్నా పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తారే కాని నగర స్వచ్ఛత, నగరాభివృద్ధిపై అంతగా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. పాలకులు ఎవరు వచ్చినా కొత్త సీసాలో పాత సారా అన్న విధంగా నగరాభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. రోడ్ల దుస్థితి, చెత్త చెదారం, స్వచ్ఛ బళ్లారి మాట అటుంచితే కనీసం పార్కుల్లోకి వెళ్లి కాసేపు ప్రశాంతంగా గడుపుదామని జనం అనుకుంటే పొరపాటే. నగరంలో సుమారు 150 పార్కులకు పైగా ఉంటే అందులో కనీసం ఐదారు పార్కులు కూడా సరిగా లేకపోవడంతో నగరవాసులు పార్కుల దుస్థితిపై పాలకులను దుమ్మెత్తి పోస్తున్నారు.

బుడా పార్కుకే దిక్కులేదు

ముఖ్యంగా నిత్యం పెద్ద ఎత్తున జనం తిరుగాడే, కార్యాలయాలకు వచ్చి వెళ్లే నగరంలోని బుడా కార్యాలయం ఆవరణలో ఐదేళ్ల క్రితం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కును ఏర్పాటు చేశారు. అయితే దాని నిర్వహణను పట్టించుకోకపోవడంతో పార్కు అధ్వానంగా మారింది. వ్యాయామ పరికరాలు అన్నీ విరిగిపోయాయి. పార్కు నిండా చెత్తా చెదారం, మద్యం బాటిళ్లు దర్శనం ఇస్తున్నాయి. బుడా కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌కు కూతవేటు దూరంలోనే ఈ పార్కు ఉంది. బుడా కార్యాలయం పక్కనే ఉన్న ఈ పార్కు దుస్థితిని కళ్లారా అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అప్పుడప్పుడు చూస్తున్నా పార్కును బాగు చేయాలన్న ఆలోచన చేయకపోవడంతో పార్కుకు వచ్చి పోయే ప్రజలు పాలకులు, అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. బుడా కార్యాలయ ఆవరణ పక్కనే పార్కులో జనం కాసేపు సేద తీరేందుకు కూడా అవకాశం లేని విధంగా అధ్వానంగా మారితే ఇక నగరంలో పార్కులు పరిస్థితి ఎవరు పట్టించుకుంటారో అర్థం చేసుకోవచ్చు.

శుభ్రత లోపించిన పార్కులు

ఒక్క బుడా కార్యాలయం ఆవరణలోని పార్కులే కాకుండా నగరంలోని వాజ్‌పాయి లేఅవుట్, రాఘవేంద్ర కాలనీ, పటేల్ నగర్, రామయ్య కాలనీ, కువెంపునగర్ తదితర కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కుల్లో పరిశుభ్రత లోపించింది. ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారం, విరిగిపోయిన వ్యాయామ పరికరాలు, దుస్థితిలో కనిపిస్తున్న ఆసనాలు, విపరీతంగా పెరిగిపోయిన గడ్డి, కంపచెట్లు దర్శనం ఇవ్వడంతో పార్కుకు వెళ్లిన జనం అక్కడ కాసేపు కూడా కూర్చొనేందుకు వీలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కుల దుస్థితిపై సంబంధిత అధికారులు కాని, స్థానిక కార్పొరేటర్లు కాని పట్టించుకోకపోవడంతో పార్కులన్నింట్లో జనం వెళ్లి కూర్చొనేందుకు, వాకింగ్ చేసేందుకు వీలు కావడం లేదంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు నగరంలో అధ్వానంగా ఉన్న పార్కులన్నింటినీ బాగు చేసి నగర వాసులకు ఆహ్లాదం పంచాలని ప్రజలు కోరుతున్నారు.

సమావేశానికి గైర్హాజరైతే చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్

కంప్లి: తాలూకాలో కరువు నిర్వహణ సమావేశం ఎంతో ముఖ్యం అని, ఏదో ఒక సాకు చూపి అభివృద్ధికి సంబంధించిన సమావేశాలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. కూడ్లిగి తాలూకా కార్యాలయంలో కరువు నిర్వహణపై జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ఏ అధికారి అయినా అసత్యపు వంకతో విధులకు సెలవు వేయకుండా కరువు నిర్వహణ సమావేశంలో పాల్గొనాలని ఆదేశించారు.

యోగాతో ఆరోగ్య వృద్ధి

కంప్లి: ఎవరైతే నిరంతరం యోగాలో నిమగ్నులై ఉంటారో వారిలో ఆరోగ్యం పెంపొందుతుందని నందీపుర డాక్టర్ మహేశ్వర స్వామీజీ తెలిపారు. హగరిబొమ్మనహళ్లి ఎంవై ఘోర్పడే పాఠశాల ఆవరణలో కర్మయోగ ట్రస్ట్, నోబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెట్‌లాన్ ఛాలెంజింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనిషి తన శరీరాన్ని స్వాధీనంలో పెట్టుకోని పక్షంలో 40 ఏళ్ల దాటిన అనంతరం వివిధ వ్యాధులు ముసురుకుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు.

లోకాయుక్త వలలో తహసీల్దార్



మంజునాథ్(ఫైల్)

గంగావతి: లంచం పుచ్చుకుంటూ తహసీల్దార్ మంజునాథ్ బోగావతి లోకాయుక్త వలలో చిక్కారు. తాలూకాలోని వెంకటగిరి ప్రాంతంలో ఎర్రమట్టి అక్రమ రవాణాకు రూ.లక్షకు లీజ్ చేసుకొని రూ.50 వేలను ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ రాజు ద్వారా తహసీల్దార్ పుచ్చుకుంటుండగా లోకాయుక్త అధికారులు దాడి చేసి శనివారం రాత్రి పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు



నిందితులతో పోలీసులు

యాడికి: తాగుడుకు అలవాటు పడి పలు చోట్ల చోరీలు చేస్తూ ఇద్దరు దొంగలు దొరికారు. అనంతపురంజిల్లా తాడిపత్రి నియోజకవర్గ యాడికి మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఆదివారం సాయంత్రం అనుమానాస్పదం గా తిరుగుతున్న ఇద్దరు చోరులను అరెస్టు చేసి వారి నుంచి 6 తులాల బంగారు, 30 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. వివరాల మేరకు యాడికివాసి రాజ కుల్లాయప్ప అలియాస్ రాజు (22) పరిసర గ్రామాల్లో చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ ఉండేవాడు. 2022 లో బళ్లారి సమీపంలోని కుడితినిలో దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడి ఒక ఏడాది జైలు జీవితం గడిపి విడుదలై అనంతపురంలో బేల్దారి పనులు చేస్తున్నాడు. అదే ఏరియాలో ఉన్న ఇబ్రహీం (29)తో స్నేహం చేశాడు. జల్సాల కోసం మళ్లీ చోరీల బాటపట్టారు. ఈ నెల 3న యాడికి మండలంలోని కుర్మాజీపేట, ఈ నెల 14న తాడిపత్రి టౌన్‌లో దొంగతనాలు చేశారు. చోరీలపై ఫిర్యాదులు రావడంతో నిఘా పెట్టి అరెస్టు చేశారు.

వాల్మీకి మహర్షి జాతర పోస్టర్ విడుదల

కంప్లి: ఎస్టీ నకిలీ కుల ప్రమాణ పత్రాలకు ప్రభుత్వం క్లెం వేయాలని రాజనహళ్లి వాల్మీకి గురుపీఠం జగద్గురు ప్రసన్నానందపురి స్వామీజీ తెలిపారు. పట్టణంలో నిర్వహించిన అఖిల కర్ణాటక వాల్మీకి నాయక మహాసభ ఆధ్వర్యంలో ఆదికవి వాల్మీకి మహర్షి జాతర ముందస్తు సమావేశంలో ఎమ్మెల్యే జేఎన్.గణేష్‌తో కలిసి పోస్టర్‌ను విడుదల చేసి ఆయన మాట్లాడారు. సముదాయపు పోరాటం వల్లే 7 శాతం రిజర్వేషన్ లభించిందన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగాలకు అనుకూలం అయిందన్నారు.

ఉద్యోగులకు ప్రశస్తి ప్రదానం

కంప్లి: సండూరు తాలూకా ఎన్ఎండీసీ దోణిమలై అతిథిగృహంలో ప్రతి ఏటా నిర్వహించేలా ఈ ఏడాది కూడా కంపెనీలో సుదీర్ఘమైన సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశస్తి పురస్కార కార్యక్రమం నిర్వహించారు. కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉత్తేజనం నింపేందుకు 20 ఏళ్లకు పైగా సుదీర్ఘ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశస్తి పురస్కారాలను గోల్డెన్, సిల్వర్ రూపంలో అందించారు.

అట్టహాసంగా జ్యోతి రథయాత్ర



రథయాత్రను ప్రారంభిస్తున్న అధికారులు, యువకులు

కంప్లి: కురుగోడు తాలూకాలోని గ్రామాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆదివారం కర్ణాటక సంభ్రమ 50వ జ్యోతి రథయాత్రను అట్టహాసంగా నిర్వహించారు. సోమసముద్ర, గ్రామంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పిల్లలు జ్యోతి రథయాత్రను పూర్ణకుంభాలలో ఆహ్వానించారు. అనంతరం రథయాత్ర గ్రామం నుంచి కోళూరు క్రాస్ మీదుగా దమ్మూరు గ్రామానికి చేరుకుంది.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

బళ్లారిఅర్బన్: నగర శివార్లలోని రామేశ్వరి నగర్‌లో వెలసిన వేంకటేశ్వరాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి వనభోజనంతో పాటు ధార్మిక పూజలను జరిపారు. ఉదయం 8.30 గంటలకు 56 రకాల నైవేద్యాలు, రంగోలితో అలంకరణ, 10 గంటల విష్ణు సహస్ర నామ పారాయణం, 11 గంటలకు గోపూజ, ఆకు పూజ, మహామంగళారతి, దర్శనం, అన్నదానం నిర్వహించినట్లు రామేశ్వరి ట్రస్ట్ అధ్యక్షులు తెలిపారు.

వాస్తు నిపుణుడిని అంటూ మోసం

- నిందితుడు అరెస్ట్, ఆభరణాలు స్వాధీనం

హుబ్లీ: వాస్తు నిపుణుడిని అంటూ నమ్మించి నగరంలోని విద్యానగర పరిధిలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడి పరారైన నిందితుడిని విద్యానగర పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. తాను ఒక వాస్తు నిపుణుడినంటూ ఇంట్లో ఉన్న వారిని పరిచయం చేసుకున్న నిందితుడు మీ ఇంట్లో సమస్య ఉంది. వాస్తు దోషాలను సరి చేసుకుంటే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని మభ్యపెట్టాడు. ఈ క్రమంలో వాస్తు పరిహారానికి కొన్ని వస్తువులు అవసరమని, తెచ్చి ఇవ్వాలని ఇంటి యజమానిని అంగడికి పంపించారు. అనంతరం ఇంట్లో లాకర్‌లోని బంగారు, మంగళసూత్రం, ఒక చెక్ చోరీ చేసి పరారయ్యాడు. ఈ మేరకు విద్యానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి ప్రశాంత్ ఇటిగి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.3.10 లక్షల విలువ చేసే 88 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

దళారుల చేతిలో ఉల్లి రైతు విలవిల




మార్కెట్‌లో నిల్వ ఉన్న ఉల్లిగడ్డలు

రాయచూరు రూరల్: పంట పండించిన రైతులు దళారుల చేతిలో నలిగి విలవిలలాడుతున్నారు. ఏపీఎంసీకి రైతులు తాము పండించిన పంటలను తెచ్చినా కొనుగోలు చేయకుండా దుకాణాల యజమానులు చేతులు దులుపుకుంటున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెచ్చిన ఉల్లిగడ్డలను ఏపీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు చేయక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు ఏపీఎంసీ అధికారులు ఉల్లిగడ్డల కొనుగోలుకు ముందుకు వచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి రాయచూరు ఏపీఎంసీకి ఉల్లిగడ్డలు వస్తున్నాయి. బస్తా ధర రూ.4400లుగా నిర్ణయించారు. జిల్లాలో ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. జిల్లాలో 800 హెక్టార్లలో ఉల్లి పంటను పండించారు. మద్దతు ధరలు ప్రకటించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రాయచూరు ఏపీఎంసీలో రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలను అధిక ధరకు విక్రయించడం కోసం వ్యాపారస్తులు గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడులకు లారీల్లో తరలిస్తున్నారు. గతంలో రైతులు ఉల్లిని తక్కువ ధరకు విక్రయించారు. నేడు ధర మూడింతలు పెరగడంతో కొనుగోలుదారులు దిక్కులు చూస్తున్నారు.

గాలి జనార్దనరెడ్డికి బీజేపీ గాలం?

- చేరిక కోసం విజయేంద్ర చర్చలు!



ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి(ఫైల్)

సాక్షి, బళ్లారి: కర్ణాటక మాజీ మంత్రి, కేఆర్‌పీపీ వ్యవస్థాపకులు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన రెడ్డిని మళ్లీ సొంత గూటిలోకి చేర్చుకునేందుకు బీజేపీ నేతలు చర్చలు జరుపుతున్నారా? రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు విజయేంద్ర గాలితో చర్చలు జరిపారా అనే ప్రశ్నలు గట్టిగా వినిపిస్తున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గాలి జనార్దనరెడ్డి లేకపోతే బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాలతో పాటు రాష్ట్రంలో మరో ఐదారు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆయన ప్రభావంతో పార్టీకి నష్టం జరుగుతుందన్న భయంతో గాలికి బీజేపీ గాలం వేస్తోందని సమాచారం.

పార్టీ బలోపేతానికి

గాలి జనార్దనరెడ్డికి బీజేపీతో అవినాభావ సంబంధం ఉండేది. అయితే గనుల కేసులు, అరెస్టుల నేపథ్యంలో పార్టీతో దూరం పెరిగింది. గత ఎన్నికల్లో సొంతంగా పార్టీ పెట్టి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మారిన పరిస్థితుల్లో రాష్ట్రంలో బలం పెంచుకోవాలంటే బలమైన నాయకులందరినీ చేర్చుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో గాలి జనార్దనరెడ్డితో విజయేంద్ర సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

విజయేంద్రకు ఎందుకు పట్టం కట్టారు?



మాట్లాడుతున్న మంత్రి సంతోష్‌లాడ్

హుబ్లీ: బీవై విజయేంద్రను ఎందుకు బీజేపీ అధ్యక్షుడిని చేశారో చెప్పాలని రాష్ట్ర కార్మిక మంత్రి సంతోష్‌లాడ్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయేంద్ర గత బీజేపీ ప్రభుత్వ పాలనలో జోక్యం చేసుకున్నారని నాడు యడియూరప్పను సీఎం పదవి నుంచి తొలగించారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్, కేంద్ర ప్రభుత్వం విజయేంద్ర జోక్యంపై విసిగిపోయే యడియూరప్పను సీఎం పీఠం నుంచి దింపారన్నారు. అయితే ప్రస్తుతం అదే విజయేంద్రను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేశారని ఆయన ఆక్రోశం వెళ్లగక్కారు.

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ



రాయచూరులో ఇందిరా క్యాంటీన్ వద్ద జయంతిలో పాల్గొన్న మంత్రి, నేతలు



బళ్లారిలో ఇందిరా గాంధీ జయంతిని ఆచరిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

- ఘనంగా జయంతి వేడుకలు

రాయచూరు రూరల్: పేదల సంక్షేమానికి వివిధ పథకాలను అమలు చేసి దేశానికి పేరు తెచ్చిన ఉక్కు మహిళ అని చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు ప్రశంసించారు. ఆయన ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి భారత ప్రధానమంత్రిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సుభాణి, బసవరాజరెడ్డి, శివమూర్తి, తాయన్న నాయక్, రవి, నరసింహులు, శాలంలున్నారు. ఇందిరా క్యాంటీన్‌లో గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ నేతృత్వంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని జరిపారు. కార్యక్రమంలో శశికళ, ఇందిర, ప్రేమలత, నాగవేణి, లియాఖత్, రాణి రిచర్డ్స్‌లున్నారు.

ఇందిరకు పుష్పాంజలి

గంగావతి: కొప్పళ నగరంలోని ఇందిరా క్యాంటీన్ వద్ద ఆదివారం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాలతీ నాయక్ నేతృత్వంలో పదాధికారులు ఇందిరాగాంధీ జయంతిని జరిపారు. కార్యక్రమానికి జెడ్పీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ హిట్నాల్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాల ప్రజలను ఆదుకొనేందుకు అన్ని రకాలుగా తనదైన వినూత్న పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. బ్యాంక్‌లు జాతీయం చేయడం వల్ల చిన్న, సన్నకారు రైతులు, బడుగు బలహీన వర్గాలకు, ఆర్థిక పరమైన రుణాలు పొంది వాటి ద్వారా తమ జీవితాన్ని సాగించడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారని తెలిపారు. ఆమె ఆదర్శాలను, తత్వాలను నేటి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అలవరుచుకొని పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ పదాధికారులు పాల్గొన్నారు.

దేశ మొదటి మహిళా ప్రధాని ఇందిర

బళ్లారిఅర్బన్: భారత దేశపు మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. మోతీ సర్కిల్ బుడా ప్రాంగణంలోని ఇందిరా క్యాంటీన్ వద్ద భారతరత్న, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ చిత్రపటానికి వారు పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. మహిళా అధ్యక్షురాలు మంజుల, మాజీ ఎంపీ ఉగ్రప్ప, కాంగ్రెస్ నేతలు కల్లుకంబ పంపాపతి, ఎల్.మారెణ్ణ, మహమ్మద్ గౌస్, హుమయూన్ ఖాన్, గాదెప్ప, అలివేలు సురేష్, విల్సన్, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు షేక్ హుస్సేన్, లోకేష్, సండూరు ఆశాలతా, జ్యోతి, రిహాన, రోహిణి, ఇందిరా, సిమ్రాన్, సొద, అనురాధ, మున్ని, లత పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

సహకార రత్నకు సన్మానం



ఎమ్మెల్యే నంజేగౌడను అభినందిస్తున్న దృశ్యం

కోలారు: సహకార రత్న అవార్డు గ్రహీత, మాలూరు ఎమ్మెల్యే, కోచిముల్ అధ్యక్షుడు కెవై నంజేగౌడను ఆదివారం కోచిముల్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సహకార రంగంలో అపార సేవలు అందించిన నంజేగౌడకు సహకార రత్న అవార్డు లభించడం హర్షణీయమన్నారు. ఆ అవార్డుకు ఆయన అన్ని విధాలా అర్హుడన్నారు. సన్మానం స్వీకరించి మాట్లాడిన ఎమ్మెల్యే తాను తన 20 ఏళ్ల వయస్సులోనే సహకార రంగంలోకి అడుగు పెట్టానన్నారు. 1985లో మొట్టమొదటి సారిగా 35 మంది యువకులతో కలిసి సహకార సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. నాటి నుంచి నేటి వరకు సహకార రంగానికి సేవలు అందిస్తున్నానన్నారు. ఈ నెల 20న వీ.వీ.పురలో జరిగే సహకార సప్తాహ ముగింపు కార్యక్రమంలో అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోబోతున్నట్లు తెలిపారు. డీసీసీ కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.జయదేవ్, ఎస్టీ సెల్ జిల్లాధ్యక్షుడు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో సోదాలు



మెడికల్ షాపులో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

కోలారు: యువతను మాదక ద్రవ్యాల బారి నుంచి దూరం చేయడం కోసం పోలీసులు నగరంలో పలు చోట్ల సోదాలు నిర్వహించారు. ఆదివారం నగరంలోని మందుల దుకాణాల్లో మత్తును కలిగించే మందులను విక్రయిస్తున్నారా? అని సోదాలు చేపట్టారు. పోలీసులు ఇప్పటికే తాలూకాలోని విద్యా సంస్థల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులను జాగృతం చేశారు. మందుల దుకాణాల్లో కూడా అనుమతి లేని మందులను, మత్తును కలిగించే మందులను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో పోలీసులు ఈ సోదాలను చేపట్టారు.

కుర్చీ రక్షణకే సీఎం ఆరాటం



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రు

మాలూరు: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని, ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన కుర్చీని కాపాడుకునేందుకు పెడుతున్న శ్రద్ధ పరిపాలనపై చూపించడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు ఆరోపించారు. ఆయన ఆదివారం పట్టణంలోని పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా నిలిచి పోయాయన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీలు సర్వాధికార ధోరణితో పాలన సాగించడం వల్ల రాష్ట్రం ఎంతో వెనుకబడి పోయిందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ గత తొమ్మిదేళ్లుగా సర్వాధికార ధోరణిలోనే పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదన్నారు. వీరి వల్ల ప్రజా ప్రభుత్వ వ్యవస్థకు అర్థం లేకుండా పోయిందన్నారు. మూడు పార్టీలు కుటుంబ రాజకీయాలకు పెట్టిన పేరన్నారు. మూడు పార్టీలకు వ్యతిరేకంగా ఆప్ పోరాటం చేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆప్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎం.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

మాలూరు: పట్టణంలోని హోసూరు మెయిన్ రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి జరిపి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి జరిపిన సమయంలో హెచ్.హొసకోటె గ్రామానికి చెందిన నాజిద్ పట్టుబడగా, మరో నిందితుడు సొణ్ణూరు గ్రామానికి చెందిన ప్రశాంత్ అక్కడి నుంచి పరారయ్యాడు. అతని వద్ద నుంచి రూ.75 వేల విలువ చేసే 1.525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు ప్రశాంత్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఊరించి..ఉసూరుమనిపించి..

సాక్షి,బళ్లారి: గుజరాత్‌లోని అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్-ఆస్ట్రేలియాల మధ్య జరిగిన ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ క్రీడాభిమానులను ఊరించి ఉసూరుమనిపించింది. ఆదివారం వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నగరంలోని బీడీఏఏ మైదానంలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో క్రీడాభిమానులు భారీగా తరలివచ్చి క్రికెట్‌ను నేరుగా వీక్షించిన అనుభూతి పొందారు. ఈనేపథ్యంలో మైదానం చుట్టు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మైదానంతో పాటు ప్రతి ఇంటిలోనూ జనం టీవీలకు అతుక్కుపోయి వరల్డ్‌కప్ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించారు. అయితే భారత జట్టు ఆటగాళ్లు ఆశించినంతగా పరుగులు సాధించకపోగా, చివరికి ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలుకావడం క్రీడాభిమానులను నిరాశ పరిచింది.

విద్య దేశాభివృద్ధికి సంకేతం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: సమాజంలోని ప్రతి ఒక్కరికీ విద్య అందించడం దేశాభివృద్ధికి సంకేతమని పీయూసీ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప తెలిపారు. ఆదివారం ఆల్ అమీన్ పాఠశాల క్యాంపస్‌లో అమీన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉర్దూ సాహిత్య సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ ఇమిడి ఉంటుందని, సరైన సమయంలో వెలికి తీయాలన్నారు. మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పెద్ద కలలను కలిగి వాటి సాకారానికి నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సలహా ఇచ్చారు. పీబీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ మన్సూర్ మోమన్ మాట్లాడుతూ ఉర్దూ భాష సుగంధభరితమై ఉందని, ఆల్ అమీన్ ఉర్దూ పాఠశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. సొసైటీ చైర్మన్ ఉమర్ ఇస్మాయిల్ ఖాన్, కార్యదర్శి జుబైల్ అన్వర్ సేట్, సంయుక్త కార్యదర్శి ఇబ్రాహీం అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.